UNIVERSAL
LIBRARY
OU_204808
UNIVERSAL
LIBRARY

# ఉత్తరరామచరిత్రనాటకము

కృతికర్త

బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు

రాజమహేంద్రవర కళాశాలాంధ్రపండితులు

మూఁడవకూర్పు

ప్రకాశకుఁడు

చల్లా జగన్నాథము బి. ఏ. యల్. టి.

రాజన్ ప్రెస్సందు ముద్రితము

రాజమహేంద్రవరము.

కాపీరైటు రిజర్వుడు 1929 వెల 0—12—0

# ఇందు వచ్చు పాత్రలు.

| పురుషులు. | స్త్రీలు |
|---|---|
| సూత్రధారుఁడు | సీత |
| నటుఁడు | ఆత్రేయి |
| శ్రీరాముఁడు | వాసంతి |
| అష్టావక్రుఁడు | మురళ |
| లక్ష్మణుఁడు | తమస |
| దుర్ముఖుఁడు | అరుంధతి |
| శంబూకుఁడు | కౌసల్య |
| దాండాయనుఁడు | విద్యాధరి |
| సౌధాతకి | గంగాదేవి |
| జనకుఁడు | వసుంధర |
| చంద్రకేతువు | |
| సుమంత్రుఁడు | |
| కుశలవులు | |
| విద్యాధరుఁడు | |
| వాల్మీకి | |

# తృతీయ ముద్రణ పీఠిక

పావనమైన యితివృత్తమును, అపూర్వమైన కథాసన్నివేశములును, మనోహరమైన రసపోషణమును, నిరుపమానమైన పాత్రౌచిత్యము ననెడిసద్గుణములతో సకరుణమైన విప్రలంభశృంగారము ప్రధాన రసముగా శ్రీభవభూతి మహాకవి సంస్కృతమున రచియించిన యుత్తర రామచరితము "ఉత్తరే రామచరితే భవభూతి ర్విశిష్యతే" యను నార్యోక్తినిబట్టి జగద్విఖ్యాతిని గాంచియుండ, దానిసుగుణము లిందు వివరింపఁ బూనుట యనావశ్యకము.

నే నీనాటకమును దొలుత నాంధ్రీకరించి కీర్తిశేషులును మహోదారులును వెంకటగిరిసంస్థానాధీశ్వరులు నగు శ్రీ మహారాజా వెలుగోటి రాజగోపాలకృష్ణయాచేంద్రబహదరు జి. సి. ఐ. ఇ. వారిసమాదరమున 1909 లోఁ బ్రకటించితిని. ఇది 1917 వ సంవత్సరమునందు చెన్నపురి విశ్వవిద్యాలయపక్షమున ఇంటర్మీడియెట్ పరీక్షకుఁబఠనీయమగునాఁటికే ముద్రితపుస్తకములు చాలావఱ కయిపోయినవి. తరువాత 1926 లో నిది సవరింపఁబడి పునర్ముద్రిత మైనది. 1929 సం॥ ఆంధ్ర విశ్వవిద్యాలయపక్షమున ఇంటర్మీడియెట్ పరీక్షకుఁ బఠనీయమైనది. ఆంధ్రుల సమాదరణమున నిది తృతీయముద్రణ మందినది.

మొదటిముద్రణములోని యనేకపద్యగద్యము లన్నియంకములందును ద్వితీయముద్రణమందే శైలిలో మార్పుచెందినవి. ఆమార్పు గూడ మూలానుసరణమే యైనను గొన్నిచోట్ల భావప్రధానముగాఁగూడ నుండును. ఎట్లయినను, ఆంధ్రీకరణము స్వతంత్రరచనము బోలదు కాని, చదువ నింపుగాను, ప్రదర్శింప రమ్యముగాను, ఉండవలె నన్నయుద్దేశముతోఁ బ్రయత్నించి దీనిని సవరించితిని. పాఠకలోక మిందలి గుణము గ్రహించి యాదరించుఁగాక.

మల్లాది సూర్యనారాయణశాస్త్రి.

# కృతిసమర్పణము.

—:O:—

క. ఈ రామచరిత్రంబు ను
దారాధిత జనకపాదు లారాధిత సీ
తారామ వెంకమాంబా
శ్రీరాముల కంకితంబు చేసితి భక్తిన్.

శ్రీరస్తు

ఓం నమః పరబ్రహ్మణే

# ఉత్తరరామచరిత్రనాటకము

## ప్రథమాఙ్కము

### ప్రస్తావన

నాంది- గీ. పూర్వకవులకు సద్భక్తిపూర్వకముగ
నిదె నమస్కార మొనరింతు మొదఁ దలంచి
నిత్యమూర్తియుఁ బరమాత్మసత్యకలయు
నైన వాణికి మ్రొక్కెద నధికభక్తి.

సూత్ర—(నాంద్యంతమున—) కాళప్రియనాథుని మహోత్సవమునకు విచ్చేసిన పెద్దల కిదే విన్నవించుచున్నాను. ఓపూజ్యులారా! కాశ్యపగోత్రుఁడు శ్రీకంఠబిరుదాంకితుఁడు పదవాక్యప్రమాణజ్ఞుఁడు నైన యేబ్రాహ్మణోత్తమునికి వాగ్దేవి వశ్యురా లయ్యెనో, ఆభవభూతిమహాకవి సంస్కృతమున రచించిన యుత్తర రామచరితనాటకమును చర్ల బ్రహ్మశాస్త్రిగురువరకరుణాధీతపాణినీయుఁడును గద్యపద్యాత్మకానేకకావ్యకర్తయు నుభయభాషాకవియు నైన మల్లాది సూర్యనారాయణశాస్త్రి యాంధ్రీకరించెను. దాని నిపుడు ప్రదర్శింపఁబోవుచున్నాము. సావధానముగాఁ జిత్తగింపుఁడు.

ఇదిగో! కవివశమున నే నీకథ జరిగినపు డయోధ్యాపురములో నున్నవాఁడనుగా మాఱినాను. (అంతటఁజూచి) ఏమండీ! ఇది పౌలస్త్యకులధూమకేతు వగు శ్రీరామచంద్రమహారాజేంద్రుని పట్టాభిషేకమహోత్సవసమయముగదా, రేయుంబవళ్ళఁ దెలిపి

లేకుండఁగా వేడుకలు సలుపఁదగిన యీదినములలోఁ బరిచారకు లందఱు పనితొందర లేక యిండ్లలో సుఖముగాఁ గూర్చున్నా రేమి?

నటుఁడు—(ప్రవేశించి) అయ్యా! పట్టాభిషేకమహోత్సవమునకు విచ్చేసినలంకా సమరమిత్రు లగు సుగ్రీవవిభీషణాదులను నానాదిగంతములనుండి దయచేసిన మహాత్ము లగుబ్రహ్మర్షులను దేవర్షులను రాజర్షులను నేఁడు యథోచితముగా సత్కరించి మామహారాజుగారు వారివారియిండ్ల కంపిరి. వా రందఱు నున్న రోజులలో వేడుకలు మెండుగా జరిగినవి. వా రందఱు వెళ్ళఁగానే యూఁగిపోయినవి.

సూ—ఆఁ! ఇదే కారణము!

నటు—మఱియును—

గీ. మాన్యుఁ డైనవసిష్ఠునిమాటఁబట్టి
విమలచరిత యరుంధతి వెంబడించి
రామచంద్రునితల్లులు క్రతువు చూడ
నల్లునాశ్రమమునకును వెళ్ళి రయ్యా!

సూ—పరదేశీయుఁడ నగుటచే నడుగుచున్నాను. అల్లుఁ డెవరయ్యా?

నటు—

గీ. దశరథమహామహీశుఁడు తాను గన్న
కన్నె శాంతను గూఁతురుగా నొసంగె
రోమపాదుండు నాఁజనుభూమిపతికి
నాతఁ డామెను బెంచి మహాదరమున.

విభాండకమహర్షి పుత్త్రుఁ డగుఋశ్యశృంగున కిచ్చి పెండ్లి చేసెను. ఆఋశ్యశృంగుఁ డిపుడు ద్వాదశవార్షిక మైన సత్రయాగ మారంభించెను. అందుచే నిండుచూలా లగుజానకీదేవిని గూడ విడిచి పెద్దవా రందఱు నచ్చటి కేగిరి.

సూ—అట్లయిన రమ్ము. రాజద్వారమున నిలిచి స్వజాతిమర్యాదతో స్తోత్రపాఠము చేయుచుందము.

నటు—అట్లయినచోఁ బరిశుద్ధమైన రాజస్తోత్రపద్ధతిని ముందుగా నిరూపింపుము.

సూ—గీ॥ సర్వవిధముల సన్నుతి సలుపవలయు:
గాని పరిశుద్ధ మనుమాట కలఘనేల?

మానినులశీలమునఁ బోలె మాటమంచి
యందు లోకంబు దుర్జనం బగును గాదె?

నటు—అతిదుర్జన మగు నని చెప్పఁదగును. ఏమనఁగా?

గీ. అవనిపుత్రి మహాసాధ్వి యఖిలపూజ్య
యైనవైదేహియెడ నింద లాడుజనము
రక్కసునియింట నుంటయే లెక్కచేయు
నమ్మహాగ్నిపరీక్షను నమ్మఁబోదు.

సూ—కాని యీలోకాపవాదము మన మహారాజు చెవిని బడెనేని మిక్కిలి కష్టము సంభవించునుజుమీ! అయినను, మునీంద్రులును దేవతలును సర్వవిధముల శ్రేయస్సు సమకూర్పఁగలరుగదా! (పరిక్రమించి యాకాశమున దృష్టినిలిపి) ఓయీ! మహారాజుగారిపు డెక్కడ నున్నారు? (వినుట యభినయించి) ఆఁ! జను లిట్లు చెప్పుచున్నారు.

చ. జనకుఁడు రాజదంపతులసత్కృతి సల్పఁగ వచ్చి వేడ్క నీ
దినములు వెళ్ళఁబుచ్చియు విదేహపురంబున కేగ నేఁడ, యం
దునఁ గడుఁ గుందునట్టితనతోయలిచిత్తము దేర్పఁ బాలనా
సనమును డిగ్గి రాఘవుఁడు చయ్యన నంతిపురంబుఁ జొచ్చెడిన్.

(అని నిష్క్రమించిరి.) ఇదిప్రస్తావన.

[అంతటఁ గూర్చుండి సీతారాములు ప్రవేశింతురు]

రాము—దేవీ! ఊఱడిల్లుము. పెద్దలు స్వయముగా మనల విడువఁ జాలరు. ఇఁక నేమనఁ?

గీ. నిఖలవేదోక్తకర్మనిర్ణిద్రనియతిన్
కర్మఠస్వేచ్ఛ కడ్డంబు గలుగఁ జేయు
నాహితాగ్నులగార్హస్థ్యమాగమోక్త
కర్మములు చేయమిని దోషకలిత మగును.

సీత—ఆర్యపుత్రా! ఎఱుఁగుదును. కాని గురుజనబంధువియోగము సంతాపకర మగును.

రా—ఇట్లే సంసారము మనస్సునకు నొప్పిగలిగించుచుండును. కావుననే విద్వాం

సులు వీనియెడ రోఁతపడి యెల్లకోరికలు పరిత్యజించి యడవులలో విశ్రమించు చుందురు.

కంచుకి—(ప్రవేశించి) జయము జయము రామభద్రా (అనఁబోయి) మహారాజా—!

రా—(నవ్వుచు) నాయనగారి పరిచరులు నన్ను రామభద్రా యని పిలుచుటయే తగును. నీ కలవాటయినట్లే పిలువవచ్చును.

కం—ఋశ్యశృంగాశ్రమమునుండి యష్టావక్రమహర్షి వచ్చెను.

సీ—ఆలస్య మొనరింప నేల?

రా—శీఘ్రముగాఁ దీసికొనిరమ్ము.

కం—(వెళ్ళెను)

అష్టావక్రుఁడు—(ప్రవేశించి) మీకు శుభ మగుఁగాక.

రా—మునీంద్రా! నమస్కారము. ఇచ్చట విచ్చేయుము.

సీ—మహర్షీ! వందనము. అత్తలు, అల్లుఁడు, మాఆఁడుబిడ్డ, తక్కిన పెద్దలు, అందఱును సుఖముగా నున్నారా?

రా—పూజ్యులైన ఋశ్యశృంగుఁడును శాంతాదేవియు నిర్విఘ్నముగా సోమపాన సుఖ మనుభవించుచున్నారా?

సీ—వారెప్పుడైన మామాటల తలపెట్టుచున్నారా?

అష్టా—అయ్యో! మిమ్ము స్మరింపకేమి? (అని కూర్చుండి) దేవీ! పూజ్యుఁడైన వసిష్ఠుఁడు నీతో నిట్లు చెప్పు మనెను.

చ. "నినుఁ గనినట్టితల్లి మహనీయగుణాన్విత భూతధాత్రి, ని
న్నొనిచినయట్టితండ్రి యలవేల్పులపెద్దకు సాటి యైన శ్రీ
జనకమహేశ్వరుండు, గురుసత్కృతి సూర్యుని నన్నుఁ గొల్చు స
ద్గుణు లగు పార్థివోత్తముల కూరిమి కోడల వీవు నందినీ!

సకలగుణసంపన్నురాల వైన నిన్నింక నింతకంటె నే మని దీవింతును? కేవలము వీరకుమారుల తల్లి వగుము."

రా—దేవీ! మనము గురువుగారి యనుగ్రహమునఁ గృతార్థుల మైతిమి! ఏమన?—

గీ. సద్గుణులు లౌకికులు నగుసాధుజనుల
నుడువు లర్థంబు వెనువెంట నడచుచుండు
ననఘు లాద్యులు నగుమహామునులు పల్కు
పల్కువెంబడి నర్థంబు పరుగులెత్తు

అష్టా—రఘువీరా; సీతాదేవికి గర్భవాంఛలు కలిగెనేని వాటిని వెంటనే తీర్పవలె

నని మీతల్లులును శాంతాదేవియు మాన్యురా లయిన యరుంధతియు మఱిమఱి చెప్పిరి.

రా—ఈమె కోరినట్లయిన నట్లే చేసెదను.

అష్టా—"అమ్మా! నిండుచూలాల వగుటచే నిన్ను యాగమునకుఁ దీసికొనిరాలేదు. నీసంతోషముకొఱకే రాముని గూడ నుంచితిమి. నీసంతానము నొడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని ముద్దాడుచుండఁగా నిన్నుఁ జూడఁగలము" అని ఋశ్యశృంగమహర్షి దేవితోఁ జెప్పు మనెను.

రా—(సంతోషహాసములతో) అట్లే యగుఁగాక. మునివరా! గురువర్యులగు వసిష్ఠులు నాతో నేమియుఁ జెప్పు మన లేదా?

అష్టా—అన కేమి? వినుము.

గీ. అల్లుఁ డొనరించు క్రతువున నాఁగినాము
బాలుఁడవు నీవు, నూత్నంబు పాలనంబు,
ప్రజలయనురంజనంబె కార్యంబు మీకుఁ
దనువుకంటెను గీర్తి యుత్తమధనంబు.

రా—గురుపాదు లాజ్ఞాపించినట్లే చేసెదను.

గీ. ప్రజలయారాధనంబె నాప్రాణపదము
దానికై స్నేహమునుగాని దయనుగాని
సౌఖ్యమునుగాని తుదకు నీజనకతనయఁ
గాని విడిచెద బాధ యింతేని లేక.

సీ—ఇట్టి యౌదార్య మున్నందుచేతనే యార్యపుత్రుఁడు రఘువంశశ్రేష్ఠుఁ డయ్యెను.

రా—ఎవ రక్కడ? మునివరా! కొంచెము సేపు విశ్రమింపుము.

అష్టా—(లేచి-నడచి) ఇదుగో లక్ష్మణుఁడు వచ్చెను. (అని వెళ్ళెను)

లక్ష్మణుఁడు—(ప్రవేశించి) ఆర్యా! జయము జయము. చిత్రకారుఁ డైనయర్జునుఁడు మనము చెప్పినట్లుగా మీచరిత్రమును వరుసగాఁ జిత్రించెను. దానిని బరీక్షింపుఁడు.

రా—వత్సా; అ దెందుకో తెలియునా? వికలచిత్త యగు జానకిని సంతోషపెట్టుటకు, కాని, అది యెంతవఱ కయినది?

ల—పూజ్యురాలి యగ్నిశుద్ధివఱకు నయినది.

రా—పాపము శాంతించుఁగాక. (తియ్యనిమాటలతో)

క. జననంబునఁ బావన యగు
జనకునికన్నియకు వేఱె చనునే శుద్ధుల్?
అనలంబును దీర్థోదక
మును వేఱొకదాన శుద్ధిఁ బొందఁగఁ దగునే?

దేవీ దేవయజ్ఞసంభవా! అనుగ్రహింపుము.

(1) ఇది నీకు యావజ్జీవ ముండునట్టి ప్రవాదము.

గీ. దుఃఖితులలాలనంబు బంధువులధర్మ
మట్టిచో నిన్నుఁ జెడ్డమా టంటి మకట!
పువ్వు తలలో ధరించుట పొసఁగుఁ గాని
కాలితోఁ ద్రొక్కి నల్చుట పోలు నొక్కొ?

సీ—కానిండు నీని కేమి! మీచరిత్రము చూతము రండు,

(లేచి పరిక్రమింతురు.)

ల—ఇదియే చిత్రపువు.

సీ—(చూచి) పై నున్న వీ రెవరు? ఒకర కొకరు మిక్కిలి దగ్గఱగా నిలిచియుండి యార్యపుత్రుని గొనియాడుచున్న ట్లున్నారు.

ల—భగవంతుఁ డగుకృశాశ్వునివలనఁ గౌశికుండు గ్రహించి తాటకావధ సమయమున నార్యున కనుగ్రహించిన జృంభకాస్త్రము లివియే.

రా—దేవీ! ఈదివ్యాస్త్రము లకు నమస్కరింపుము.

గీ. మున్ను బ్రహ్మాదిగురువులు భువనహితము
గోరి వెయ్యేళ్ళు పొనరించి ఘోరతపము
జపతపస్సిద్ధనైజ తేజఃప్రభావ
మనఁగఁ గనుఁగొని రీజృంభకాస్త్రచయము.

సీ—ఈ జృంభకాస్త్రములకు నమస్కారము.

రా—ఈ మహాస్త్రము లెల్లవిధముల నీసంతానము నాశ్రయించఁగలవు.

సీ—మహాప్రసాదము. కృతార్థురాల నైతిని.

ల—ఇది మిథిలావృత్తాంతము.

సీ—ఆహా! క్రొత్తగా వికసించిన నల్లకలువవలె నిగనిగలాడు సౌమ్యసుందరశరీరులా

---

[1] ఇది నీకు జీవితావధి యగు [పరిణామము.పరిణామము] పా—

వర్ణ్యమును, జనపాలఁ కన్యేందుముఖసౌందర్యమును నాది యాశ్చర్య మానం
దమును గమన నిశ్చేష్టులై నిలిచి మిథిలాపురవాసులు చూచుచుండఁగా, నవ
లీలగా శివధనుస్సు నెత్తి విఱిచిన యార్యపురుషుఁ డీచిత్తరువునఁ జక్కఁగా
శోభిల్లుచుండె.

ల—దేవీ, చూడుము చూడుము.

గీ. వియ్యమందినవారిని వీరి రాజ
బంధువులను వసిష్ఠాది పరమమునుల
జనక రాజు శతానందమునియు భక్తిఁ
గట్నము లొసంగి యర్చించుకరణి గనుము.

గా—ఈచిత్రలేఖనము మిక్కిలి చక్కగానున్నది.

గీ. కన్నియల నిచ్చినతఁడు గైకొన్నయతఁడు
సకలరాజర్షిఘనుఁడు కౌశికుఁడు గాఁగ
జనకరాజులు రఘురాజు లొనరఁజేసి
నట్టి సంబంధమున కెవ్వఁ డలరకుండు?

సీ—స్నాతకవ్రతములు సలిపి వివాహదీక్ష వడసినట్లున్న వీరు, మీనలువురు సోదరులే
కదా, ఆహా! ఆమిథిలాపురమున వివాహసమయమున నిపుడున్నట్లు తలఁచు
చున్నాను.

గా—అవును. నిజముగా నట్లే యున్నది.

గీ. పరిణయోత్సవరూపమై పరగునీదు
పచ్చతోరంబు గట్టిన భవ్యపాణిని
గౌతముఁడు మంత్రయుక్తి నాచేతి కిచ్చి
నట్టియాసమయం బిదే యనఁగఁ దోఁచు.

ల—ఈమె యార్యరాలు, ఈమె మాండవి. ఇది శ్రుతకీర్తి.

సీ—[నవ్వుచు] ఈమె యెవతె?

ల—[సలజ్జస్మితముగాఁ దనలో] ఓహో! ఈమె యూర్మిళను జూపి యడుగు
చున్నది. కానిమ్ము. పైకి జరిపెదను. (ప్రకాశముగా) దేవీ, చూడఁ దగిన
దెంతో మిగిలియున్నది చూడుము. ఇదిగో పూజ్యుఁడైన పరశురాముఁడు.

సీ—[చూచి] నాయుడలు వణఁకుచున్నది.

రా—మహర్షీ, నమస్కారము.

ల—దేవీ, చూడుము. ఇతనిని మాయన్న-

రా—[సాక్షేపముగా] తమ్ముఁడా! చూడఁదగిన దెంతో యున్నది. మఱియొకటి చూపుము.

సీ—[సస్నేహగౌరవముగా రాముని జూచి తనలో] ఆర్యపుత్రా, ఈవినయమహిమ చే వీరు మఱియును శోభిల్లుచున్నారు.

ల—ఇదిగో. ఈ మన మండలమును అయోధ్యకు వచ్చినాము

రా—[కన్నీటితో] హా, ఆసమయము తలఁపునకు వచ్చుచున్నది.

ఉ. నాయనగారు పాలన మొనర్చుచు బాగుగ నుండఁ, గూర్మిలేఁ
బ్రాయపు సుందరాంగుల నవంబుగఁ జేకొనియుండఁ దల్లుల
త్యాయతరక్తిఁ బ్రోచుమన కాదినముల్ గతియించె, నాసుఖ
ప్రాయము లైనరోజు లిఁక రా విఁక రా విఁక రావు తమ్ముఁడా!

అపుడీజానకియును—

ఉ. పోయినపట్లఁ బుట్టుపలు మొగ్గలఁగూడిన దంతపుష్పముల్
పోయగ మొల్కనట్టినునుఁజూపులు, ముద్దుమొగంబు, నాదుక
న్దోయికి విందు చేయఁగ మనోజ్ఞములున్ లలితోజ్జ్వలప్రభా
ప్రాయము లై నయంగముల హోయి యొసంగెను నాదుమేనికిన్.

ల—ఇదిగో, ఇది మంథర.

రా—[అది తప్పించి మఱియొకటి చూపి] దేవీ, వైదేహీ!

గీ. శృంగిబేర పురంబునచెంత నున్న
యింగుదీపాదపం బిది యిందువదన!
దీనిక్రిందనె మనకు మున్నా నిషాద
మహితుఁడైనట్టి గుహునితో మైత్రి కలిసె.

ల—(నవ్వి తనలో) ఆర్యుఁడు కైకేయీవృత్తాంతమును గప్పిపుచ్చెను.

సీ—ఇది జటాబంధనవృత్తాంతము. ఆహా,

ల—గీ. జ్యేష్ఠపుత్రుని రాజ్యాభిషిక్తుఁ జేసి
వృద్ధు లిక్ష్వాకునరనాథు లేవ్రితంబు

గడపి రాపుణ్య మారణ్యకంబు నైన
వ్రతము నొనరించె మాయన్న బాల్యమందె.

సీ—ఇదిగో! ఈమె ప్రసన్నపావనసలిలయుఁ బూజ్యురాలు నగు భాగీరథి.

రా—రఘుకులదేవీ! నమస్కారము.

మ. జననీ! మున్ను భగీరథుండు సగరాశ్వం బారయం బోయి మే
దిని భేదించి క్రుధాత్ముఁడాకపిలుశక్తిన్ దగ్ధులౌ వారలన్
దనముత్తాతలఁదండ్రులన్ దివికి నెత్తంగాఁ దపోనిష్ఠమై
నిను సేవించి తదీయభస్మముపయి న్నిన్నీళ్లు వాఱించెఁగా

తల్లీ! నీవు మాగురుపత్ని యైనయరుంధతివలెనే నీకోడలైన సీతను మేలుగోరుచుండుము.

ల—ఇదియే భరద్వాజుఁడు తెలియఁజెప్పిన చిత్రకూటమార్గమందలి కాళిందీతటమున నుండు శ్యామనామకవటవృక్షము.

రా—[స్మృతితోఁ జూచును]

సీ—ఆర్యపుత్రా! ఆప్రదేశమును స్మరించుచున్నారా?

రా—దేవీ! ఎట్లు మఱచిపోవుదును? నీవు—

చ. కమలినతూఁడులట్లు నడకం గడుఁగంది వశంబు దప్పి స
త్త్వము చెడియుం మఱింత లలితంబులుగాఁ గనవచ్చునీదునం
గములయలంత గొంత బిగికౌఁగిళులన్ శమియింపఁ గేలమై
నిమిరెడు నాయురంబుపయి నిద్దురవోయినచోటిదే కదా!

ల—ఇది వింధ్యాటవిలోని విరాధుని వృత్తాంతము.

సీ—చాలుఁజాలు. విసనకఱ్ఱ గొడుగుగాఁ జేతఁ బట్టుకొన్న యార్యపుత్రుని దక్షిణారణ్యమార్గమందలి భయంకరసంచారమును జూచుచున్నాను.

రా-మునులకుటీరముల్ సఫలపుష్పమహీజము లొప్పునీతపో
వనములు కొండయేళ్ల కిరువంకల భాసిలుచుండె జానకీ
కనుము గృహస్థులిందు తమకల్గిననివ్వరియన్న మిల్లుచో
చ్చినయతి కింత పెట్టుచును సేవ లొనర్తురు ధర్మనిష్ఠమై.

సీ—పుష్పించిన కడిమిచెట్లపై నెమళ్లు నాట్యము సల్పుచున్న యీకొండ పేరేమి?

ల—దట్టముగాఁ బెరిగిన చెట్లగుంపులచేఁ జీఁకటిపడినట్లుండిన ఘనఘోరారణ్యంబునఁ బ్రవహించి పచ్చగోదావరితరంగములు నాదచేయుగుహలు గలిగి, యెల్ల యెడల స్రవించు నీరధారలఁ గూడి నల్లనై కనఁబడునిదియే జనస్థాన మధ్య భాగమున నుండు ప్రస్రవణ పర్వతము.

రా-తలఁతువె? లక్ష్మణుండు బహుధా పరిచర్యలు చేయ దానిపై
నలరుచునున్న యాదినము, లాసరసోదక గౌతమీనదిన్
దలఁతువె?, దానిచెంతఁ బులినంబుల ముచ్చటలాడుచున్కియున్
దలఁతువె?, నాఁటివర్తన మెసం దలఁతే లలితాంగి జానకీ?

మఱియు నొక్కమాట. ఇది యెప్పుడైనఁ దలఁచెదవా దేవీ!

ఉ. ఒక్కొకబాహువొద్ద నొడ లుబ్బఁగ బిగ్గఁగవుంగిలించి ను
న్జెక్కిళులొక్కటై కదియ నెమ్మదిగా మన మేమి యేమియో
మక్కువమీఱ మాటపయి మాటగ ముచ్చటలాడుకొంచు ను
న్నక్కడి నాఁటి రాత్రి[1] నలుయామము లంతనె యంతరింపవే

ల—ఇది పంచవటిలోని శూర్పణఖ.

సీ—హా ఆర్యపుత్రా! నీదర్శన మింతవఱకే.

రా—ఓ వియోగభయకంపితురాలా ఇది చిత్తరువు.

సీ—ఏలాగయినను దుర్జనము దుఃఖము కలిగింపక పోదు.

రా—అబ్బా! నాకు జనస్థానవృత్తాంత మిప్పుడు జరుగు చున్నట్లే యున్నది.

ల—[సీతాహరణవృత్తాంతము చూపి]

చ. వనరుచునున్న యార్యదురవస్థకు వజ్రముగుండె వ్రయ్యున
ట్లును శిల లేడ్చునట్లును, ఖలుల్ నశియించినయంత నివ్వనిన్
గనకమృగంబుమూలముగఁ గల్గిన దీపని, దీని మేము వెం
టనె యణఁగించినన్ గటకటంబడు నేఁటికి నంతరంగముల్.

సీ—[కన్నీరొలుకఁ దనలో] దేవా సూర్యవంశనందనా! నామూలమున నీ వింత కష్టపడితివికదా!

ల—[రాముని జూచి సాభిప్రాయముగా] అన్నా! ఏమిది?

---

[1] నాఁటిరాత్రి మన కంతటిలోఁ దెల్లవాఱదే?

చ. పెరిగినమంచిముత్తెముల పేటలకైవడి నీదుకన్నులన్
దొరఁగినబాష్పధార లివె త్రుంగి ధరంబడుఁ జుక్కచుక్కలై
పరులకుఁ దోఁచు నెంతబిగఁబట్టిన నీహృదయార్తి యెంతయే
నురవడి నాసికాపుటము లోష్ఠము లొమ్మను సంచలించుటన్.

రా-ఉ. నాఁడు సతీవియోగమున నామదిఁ బుట్టినదుఃఖవహ్ని చిం
దాడుచు లేచినన్ రిపునియంతము చూడ దలంచి యోర్చితిన్
నేఁ డది పక్వమై యెడఁద నిప్పులు గ్రక్కుచు గుండెలోని పె
న్వాడికటారిపోటువలె బాధ యొనర్చుచునుండెఁ దమ్ముఁడా!

సీ—అయ్యో యెంతకష్టము! ఈమహాభయ సంభ్రమంబున నేను గూడ నార్యపుత్రుని
విడిచి యున్నట్లు తలఁచుకొనుచున్నాను. ఛీ ఛీ!

ల—[తనలో] వీ రిది మఱచిపోవునట్లు చేసెదను. [చిత్రరువుఁజూపి ప్రకాశముగా]
ఇదిగో! మన్వంతరపురాణుఁడును పూజ్యుఁడు నగుజటాయువృత్తాంత
పరాక్రమముల కుదాహరణము.

సీ—హా తండ్రీ! నీ వపత్యానురాగము సఫలము గావించితివి.

రా—హా తాతా! కాశ్యప శకుంతరాజా! నీవంటిపుణ్యాత్ముఁ డగుమహానుభావుఁ
డెక్కడ లభించును?

ల—ఇదిగో మున్ను దనుకబంధుఁడు నివసించిన జనస్థానపశ్చిమమైన కుంజవంతమ నెడి
దండకారణ్యభాగము. దీనికి దగ్గఱగా నున్నయిదియే మతంగాశ్రమము.
ఈమె శ్రమణ యనుపేరు గలసిద్ధశబరి. ఇది పంపాసరస్సు.

సీ—ఆర్యపుత్రుఁడు కోపధైర్యములు విడిచి గొంతెత్తి విలపించినచో టిదే నా?

రా—దేవీ! ఈ పద్మసరోవరము కడురమణీయము సుమీ! ఇందు—

మ. కలనాదం బొనరించుహంసములచెక్కల్ సోఁకఁదూఁగాడుతూఁ
డుల భాసిల్లెడు తెల్లతామరలచోటుల్ వేఁడికన్నీటిచు
క్కలచాలొల్కుచుఁ బుట్టుచుండునకుమం గన్గోనహా! నల్లక
ల్వలతావుల్ బలె నాదుకన్నులకుఁ గన్పట్టెన్ సరోజాననా!

ల—ఇడుగో! ఇతఁడు మాననీయుఁ డగుహనుమంతుఁడు.

సీ—ఇతఁడు జీవలోక ముద్ధరించినమహోపకారి యగుమహానుభావుఁడు.

రా-గీ. ఔను నిజ మీమహాబాహుఁ డట్టివాఁడె
యంజనానందవర్ధనుఁ డైనయితని
భుజబలంబునఁగాదె యీభువనములును
మనము ధన్యుల మైతిమి మంజులాంగి!

సీ—లక్ష్మణా! ఈకొండమీఁది యొకచెట్టునీడను సహజానుభావసౌందర్యముమాత్రము మిగులుగా ధూళిధూసరితశరీరశోభ గలిగి మూర్ఛిల్లి విలపించుచు నీచేఁ బట్టుకొనఁబడియున్న యార్యపుత్రుఁడు లిఖింపఁబడెనే! పుష్పించిన కడిమిచెట్లపై మయూరములు తాండవమాడుచున్నట్లున్న యీకొండపేరేమి?

ల—ఉ. నీలనవీనమేఘరమణీయమహాశిఖరంబు రమ్యపు
ష్పాళి సుగంధ మిచ్చు కకుభావనిజంబులు గల్గినట్టియీ
శైలము మాల్యవంత మిట—

రా-......... చాలు నిఁక కాఁగుము తాళఁజాల నీ
వేళ మహీసుతావిరహవేదన వెండియు వచ్చినట్లగుఁ.

ల—ఇటుపైని మాయన్నయు మాననియు నైనకపిరాక్షసులును గావించినపనులు లెక్కలేనన్ని యున్నవి. దేవీ! ఇప్పటికే నీవలసితివి. కొంచెముసేపు విశ్రమింపు మని నా మనవి.

సీ—ఆర్యపుత్రా! ఈచిత్రసందర్శనమువలన నాకొక్క కోరిక యుదయించినది. అది మనవిచేయుచున్నాను.

రా—ప్రేయసీ! తప్పక యానతిమ్ము.

సీ—ప్రసన్నగంభీరములగు వనవీథుల నొక్కమాఱు విహరింపవలె ననియు, నిర్మలశీతలోదకయగు గంగానదిలో నొక్కమాఱు చల్లగా జలక మాడవలె ననియు నాయభిలాష.

రా—వత్సా! దోహదము శీఘ్రముగాఁ జేయవలయు నని గురువు లిపుడే వర్తమాన మంపిరి. కావున, గుదపులేనిరథము తీసికొనిరమ్ము!

సీ—మీరుకూడా రావలెను జుమండీ!

రా—ఓసి కఠినురాలా! ఈమాట చెప్పవలెనా?

సీ—అట్లయినఁ బరమానందము.

ల—ఆర్యుఁ డాజ్ఞాపించినట్లు చేసెదను [వెళ్ళును]

రా — ప్రేయసీ! ఈకిటికీప్రక్క నించుక సేపు సుఖముగాఁ గూర్చుందము రమ్ము.

సీ — మంచిది (కూర్చున్నపిదప) అలసియుండుటచే నిద్ర నన్ను త్రోసి వేయుచున్నది.

రా — అట్లయిన నిద్రింప నన్ను గట్టిగాఁ బట్టుకొనుము.

గీ. అలపు వెలుపును గదురఁ జయ్యనఁజెమర్చి
యిందుకాంతిఁ గరంగినయిందుమణుల
సరమువలె జల్లనగునీబుజంబు జీవ
నంబుగాఁ బెట్టు నాదుకంఠంబుపైని.

[అట్లు సీతబుజమును దన మెడమీఁదఁ జేర్పించి సంతోషముతో]

మ. అరయంజాలను దుఃఖమో సుఖమొమూర్ఛావస్థయోనిద్రయో
గరాళావేగమొ మత్తొ? నీవు ననుదాఁకన్ బుట్టి నాయింద్రియో
త్కరముం ద్రొక్కి మనోవికార మొకఁడేకాకారమైలేచి యాం
తరచైతన్యము సంతలోఁ గలఁచుకనంతం దేర్చు నేమే సఖీ!

సీ — ఇం దాశ్చర్య మే మున్నది? మీనిశ్చలానుగ్రహ మట్టిది.

రా- గీ. అవుర! నీమాట లరయఁ గర్ణామృతములు
మానసరసాయనంబులు మ్లానజీవ
పుష్పవికసనములు సంగమోహనంబు
లగుచు నానందపెట్టు న న్నంబుజాక్షి?

సీ — దేవా ప్రియంవదా! రమ్ము. నిద్రపోవుదము. [ఇటునటు చూచును]

రా — ఈమాట చెప్పవలెనా? వెదకుచున్నా వేమిటి?

చ. పరిణయవేళనుండియును బాల్యమునం దెలప్రాయమందు మం
దిరమునఁ గాన నీకు సుఖనిద్రకు సాధనమైన దొండుబి
త్తరి! నిదురింప నెన్నఁడును దార్పని దీరఘురాముబాహు వో
ధరణికుమారి! సిద్ధ మగుతల్గడ నిద్దురపొమ్ము దీనిపై.

సీ — [నిద్రపటించుచు] ఔ నార్యపుత్రా! ఇదియున్నది. [అని యట్లుపండుకొనును]

రా — ఏమిటి! ఈప్రియభాషిణి యపుడే నాఱొమ్ముపై నిద్రపోయినది.

[సస్నేహముగాఁ జూచి]

ఉ. నానిలయంబులక్ష్మి యిది నానయనామృత, మీయమె తాఁకు నా
మేన నలందుచందనము, మే లగుముత్తెపుదండ నామెడం
బూనిన యీభుజంబు, తనుప్పున్నను నీమెయుఁ జెందినట్టిదే
దైనను, గాని యీయెవిరహంబు భరింప నశక్యమెంతయున్.

ప్రతీహారి—[ప్రవేశించి] దేవా! వచ్చెను.

రా—ఎవఁడు?

ప్రతీ—దేవరవారి యాసన్నపరిచారకుఁడు దుర్ముఖుఁడు

రా—[తనలో] అంతఃపురసంచారి యగుదుర్ముఖుఁడా? పౌరజానపదుల వార్తలు తెలిసికొనవచ్చుటకు వీనిని బంపియున్నాను. [ప్రకాశముగా] రానిమ్ము.

[ప్రతీహారి వెళ్ళెను]

దుర్ముఖుఁడు—[ప్రవేశించి తనలో] సీతాదేవి నడుమ నుండఁగా నిట్టితలఁపరాని జనాపవాదమును దేవర కెట్లు విన్నవింతును? అయ్యో! ఏమి చేయుదును? నిర్భాగ్యునకు నియోగ మిట్టిదే కదా?

సీ—హా నాథా! ఎక్కడ నున్నావు? [అని పలవరించును]

రా—అయ్యో! చిత్రరువుచూచుటవలనఁగలిగిన భయంకరమగు విరహభావనచే దేవి కలవరించుచున్నది. [ఆమెదేహము నిమురుచు]

మ. సకలావస్థల నేది కష్టసుఖముల్ సైరించునో యేకమై,
వికలం బైనమనంబు నెందు గనునో విశ్రాంతి, యెందొప్పు వా
ర్ధకమందుం దమి, పెండ్లి యాది మృతిపర్యంతంబుగాఁ బ్రేమ సా
ర్థక మౌ నెయ్యది, నిత్యభద్ర మయి యాదాంపత్యమే పారెడున్.

దుర్ము—[సమీపించి] దేవా! జయము జయము!

రా—విన్నవార్తలు చెప్పుము.

దుర్ము—శ్రీరామచంద్రుని యేలికడిచే దశరథమహారాజును మఱచితి మని పౌరజానపదు లేలినవారిని గొనియాడుచున్నారు.

రా—ఇది స్తోత్రవాక్యము. తప్పే మున్నదో చెప్పుము. చేత నైనచో దిద్దుకొందును.

దుర్ము—[కన్నీరు విడిచి] దేవా! వినుఁడి [చెవిలోఁ జెప్పును]

రా—ఆఁఆఁ అయ్యో! అయ్యో! ఎంతఘోరవార్త! పిడుగులాగునవచ్చి పైఁబడినదే!

[మూర్ఛిల్లును]

దుర్ము—దేవా! ఊఱడిల్లుఁడు.

రా—[ఊఱడిల్లి] హా! ఎంతకష్టము? ఛీ ఛీ!

గీ. పరగృహావాసమున సీత పడిననింద
యద్భుతాగ్నిపరీక్షచే నణఁగె నపుడు
విధివశంబున నిపు డది వెఱ్ఱికుక్క
విషముకైవడి నంతట విస్తరిల్లె.

భాగ్యహీనుఁడను, నే నిపు డేమిచేయుదును? [విచారముతో నాలోచించి] ఇంతకంటె మఱియొకటేమున్నది?

గీ. పరమధర్మజ్ఞపురుషు లేపగిదినైన
ప్రజల రంజింపఁజేయుట పాడి యగును
దానికై కాదె మున్న మాతండ్రి యహహా
నన్ను విడనాడెఁ దనదుప్రాణాలు విడిచె.

కులగురువు లైనవసిష్ఠులవారు గూడ నా కిపుడు పంపినసందేశ మిదే కదా!

గీ. భానువంశజు లైనభూపాలవరుల
సర్వలోకప్రసిద్ధమౌ సచ్చరిత్ర
నిట్టియపనింద నావల్లఁ బుట్టె నేని
ఛీ! యభాగ్యుండ నింక నాజీవ మేల!

హా! దేవీ! దేవయజనసంభవా! హా నిజజన్మానుగ్రహపవిత్రీకృతమేదినీ! జనకనందినీ! హా పావకవసిష్ఠారుంధతీప్రశంసితా గామనుయజీకృతా! హా సుశీలశాలినీ! దండకారణ్యవాసప్రియసఖీ! హా దశరథవాత్సల్యభాజనా సాధువర్తనా! హా మనోహారిణీ మితభాషిణీ! ఇంతటిదానవు. ఇంతటింగానే నీ కిట్టిమార్గా? అకటా! దేవీ!

క. నీపేరు దలఁచి లోకము
పాపం బెడఁబాసె దానిపలుకులు నీకుం
బాపంబు లయ్యె, లోకము
నీపాలన నుండె నీకుఁ బాలన మెడలెఁ

దుర్ముఖా! ఈక్రొత్తరాజయినరాముఁ డిట్లాజ్ఞాపించుచున్నాఁడని లక్ష్మణునితోఁ జెప్పుము. [అని చెవిలోఁ జెప్పును.]

దుర్ము—ఎవరో దుర్జన లేదో యన్నారని యగ్నిపరిశుద్ధురాలై, పవిత్రమైన రఘుసంతానమును గర్భమున ధరించియున్న యీమహాదేవి నిట్లు చేయుటకు దేవర వారెట్లు నిశ్చయించినారో కదా! అకటా!

రా—పౌరజానపదులు దుర్జను లెట్లగుదురు.

గీ. జనుల కిక్ష్వాకువంశ మిష్టంబె కాని
దైవవశమున నపనింద దానఁ బుట్టె
నద్భుతాగ్నిపరీక్ష నాఁ డయ్యె నన్న
నిచట నాదూరవృత్తాంత మెవఁడు నమ్మె?

కావున దుర్ముఖా! నీవు వెళ్ళి చెప్పుము.

దుర్ము—హా దేవీ! ఎంతకష్టము? [వెళ్ళును]

రా—అయ్యో! ఎట్టిఘోరకర్ముఁడను. ఎంతపాపాత్ముఁడను?

గీ. నన్ను నెన్నఁడు విడనాడ కున్నయిట్టి
చెలియఁ బిన్ననాఁటఁగోలెఁ బోషించి యిప్పు
డొక్కమిష పెట్టి మిత్తికి నొసఁగుచుంటి
నింటిచిలుకను బోయకు నిచ్చినట్లు.

కావున నస్పృశ్యుఁడ నగు నే నీదేవిని ముట్టుకొనఁ దగను. [అని మెల్లగా సీత తలయెత్తి బుజము తీసికొని]

గీ. నవనవోద్భూత కర్మ చండాలు నన్ను
విడిచి పెట్టుము నీ వింక వెఱ్ఱిముగుద!
మంచిగందపుఁజెట్టని యెంచి నీవు
చెనఁటి విషపాదపము చెంతఁ జేరినావు.

[లేచి] హా కష్టము! ఇపుడు జీవలోకము తలక్రిం దయినది. రాముని మనుగడలాభము నేఁటితో సమాప్తమైనది. ఇపు డీజగ మంతయు శూన్యము. జీర్ణారణ్యము. సంసార మసారము. శరీరము కాష్ఠప్రాయము, దిక్కులేనివాఁడను. ఏమి చేయుదును? ఏమి గతి? ఎక్కడికిఁ బోవుదును?

గీ. బహువిధంబైన దుఃఖానుభవముకొఱకె
నేను శ్రీరాముఁ డనఁగ జన్మించినాను, *

---

*మూర్ఛపడినప్పుడే జచ్చిపోక మగల, బ్రతికి లేచుట దుఃఖానుభవము కొఱకే,

మించి యాయువుపట్టులు నొంచునట్టి
ప్రాణములు వజ్రకీలంబు లనఁగ బిగిసె.

హా తల్లీ అరుంధతీ! హా గురువరా వసిష్ఠా! హా మాన్యచరిత్ర విశ్వామిత్రా! హా మిత్రసహోదరా! హా భగవతీ వసుమతీ! హా తాతా జనకమహారాజా! హా తండ్రీ! హా తల్లులారా! హా ప్రియసఖా సుగ్రీవా! హా సౌమ్యాంజనేయా! హా మహోపకారీ విభీషణా! హా సఖీ త్రిజటా! ఈ పాపాత్ముఁడైన రాముఁడు మిమ్ము వంచించినాఁడు పరిభవించినాఁడు. (అనుమానించి) కాని నే నిపుడు నాలుకచేతఁ బిలువఁగూడ కొఱఁగాను.

గీ. క్రూరచిత్తుండ నతికృతఘ్నుండ నైన
నేను బేరెత్తి పిలిచితి నేని యిపుడు
పూజ్యులైనట్టి యామహాత్ములకుఁ బాప
మంటు నంచుఁ దలంతు, నేమనఁగ? నేను—

చ. నను నెడఁబాయలేక గహనంబులఁ గూడ వసించినట్టి కా
ననసఖి, నమ్మి నాయురమున న్నిదురించిన గేహలక్ష్మి, నం
దనపరిపూర్ణగర్భ వసుధాసుత జానకి-యీసతిన్ బలా
శనులకుఁ గానలోన బలి సల్పఁగఁబంపిన దారుణాత్ముఁడన్.

(సీత పాదములు తలపైఁ బెట్టుకొని) దేవీ! నీపాదపద్మస్పర్శము రాముని కిప్పటికిదియే కడపటిది. (అని యేడ్చుచు.)

(తెరలో నాక్రందము విన్పించును. మహారాజా!

రా—ఏమది? (తెరలో నాలకించి)

గీ. ధర్మపరిపాలకా యయోధ్యామహీశ!
యమునదరి నుండుతాపసోత్తముల మేము
లవణరాక్షసబాధ లెల్లను వచింపఁ
జచ్చిచెడి వచ్చినాము నీసముఖమునకు.

రా—ఏమీ? ఇప్పటికిని రాక్షసబాధ లేదా? ఓ! నీ పుత్రుఁడును మధురాధిపతియు నైన యాలవణరాక్షసుని మొదలు నెఱుఁగక శత్రుఘ్నుని బంపుదుఁ దపసులారా యని యానతియ్యుము. (కొంచెము నడచి పరల వెనుకకుఁ దిరిగి) హా దేవీ! ఇట్టిదాన వెట్లు వెళ్ళఁ

గలవో! భగవతీ వసుమతీ! సచ్చరిత్ర యగు నీపుత్రిని జూచుకొమ్ము.

గీ. రఘుకులంబును జనకభూరమణుకులము
రెండును దరింప శుభము గూర్చినసుశీల
పావనం బైనసురయజ్ఞవాటి నీవు
కన్నకూఁతురు, చూచుకో! కరుణతోడ.

(అని యేడ్చుచు నిష్క్రమించును)

సీత—ఆర్యపుత్రా సౌమ్యా! ఎచ్చటనున్నావు? (తొందరగా లేచి) అయ్యో! దుస్స్వప్నభయమున విప్రలబ్ధ నైన నేను, ఆర్యపుత్రు నెడఁబాసి యున్నట్లు తలఁచుకొనుచున్నాను. (ఇటునటుఁ జూచి) హా! ఎంతకష్టము? నిద్రపోవున న్నొక్కదానిని విడిచిపెట్టి యార్యపుత్రుఁడు వెళ్ళెనా? ఏ మిది? ఎందు కిట్లు చేసెను? కానీ! అతనిని జూచినపిదప నామనస్సు నాలో నున్నయెడలఁ గోపగించెదను. ఎవ డిక్కడ?

దుర్ము—(ప్రవేశించి) దేవీ! ఎక్కుటకు రథము సిద్ధముగా నున్నదని లక్ష్మణస్వామి విన్నవించుచున్నాఁడు.

సీ—ఇదిగో వచ్చి యెక్కెదను. (లేచి యొకింత నడచి) గర్భభాగము స్ఫురించుచున్నది. మెల్లగాఁ బోవుదము.

దుర్ము— దేవీ. ఇటు దయచేయుము,

సీ—రఘుకులదేవతలకు నమస్కారము. తపోధనులకు వందనము.

(అందఱు నిష్క్రమింతురు.) ఇది ప్రథమాఙ్కము.

---

౮ వ పుటలోని మొదటిపద్యమునకు పాఠాంతరము.

గీ. తండ్రిగారు సుఖంబుగాఁ దనరుచుండ
భార్యలును గాఁపురము చేయ వచ్చియుండఁ
దల్లు లేలోటు రాకుండఁ దనుపుచుండ
వెలయు మన కాదినంబులు వెళ్ళిపోయె.

# ఉత్తరరామచరిత్రనాటకము

## ద్వితీయాఙ్కము.

(తెరలో) తపోధనకు స్వాగతము.

తాపసి—(దారి వెదకికొనుచుఁ బ్రవేశించి) ఫలపుష్పపల్లవగర్భిత మైన యర్ఘ్యమున నన్నుఁ బూజింప వనదేవత వచ్చుచున్నది.

వనదేవత—(ప్రవేశించి) తపోధనా! స్వాగతము. (అర్ఘ్యమిచ్చి)

చ. సుదినము నేఁడు తల్లి! నినుఁ జూచి తరించితిఁ, బూర్వపుణ్యసం
పదసె సమకూరు సజ్జనసమాగమ, మీవన మెల్ల నీదె, యీ
సదమలతోయ మీతరులచల్లనినీడయు నీఫలంబు లీ
మొదిగినకందమూలము లివెల్ల సుఖంబుగ నారగింపుమా.

తాప—అమ్మా! చెప్పెడి దేమి?

చ. సరసము లైనమాట లుపచారవివేకము తోఁచుచేఁత లా
దరణముతోడియీవి వినుతం బగునెయ్యము ముందువెన్కలన్
దిరుగనిసుస్వభావము విధేయత నిష్కపటంపువృత్తి సు
స్థిరమతి-ఔర! యీసుజనశీలరహస్య మెఱుంగ శక్యమే!

(ఇరువురును కూర్చుందురు)

వన—అమ్మా! నీ పే రేమి?

తాప—ఆత్రేయి.

వన—ఆర్యా ఆత్రేయీ! ఎందుండివచ్చుచున్నావు? ఈదండకారణ్యమున సంచరింపఁ గారణ మేమి?

ఆ. గీ. ఈవనంబున నుద్గీథ మెఱిఁగినట్టి
ఘను లగస్త్యాదిమునులు పెక్కండ్రు కలరు

వీరి సేవించి వేదాంతవిద్య నెఱుంగ
వచ్చుచున్నాను వాల్మీకివద్దనుండి.

వస — పురాణబ్రహ్మవాదియైనయా ప్రాచేతసమహర్షియే యితర మునీశ్వరులుండఁగాను వేదాంతవిద్య నభ్యసింప నాశ్రయింతురుగదా! నీ కీ ప్రవాస మేల?

ఆ — అచ్చట నధ్యయనమునకు గొప్పవిఘ్న మొకటి సంభవించినది. అందుచే దేశాంతరగమనమున కిష్టపడితిని.

వస — ఆవిఘ్న మెట్టిది?

ఆ — పాలు విడిచిన ప్రాయమువారై ముద్దులు మూటగట్టుచున్న యిద్దఱు పిల్లలను ఒకానొక వనదేవత గొనితెచ్చి వాల్మీకిమహర్షి కప్పగించినది. ఆ కుమారులను జూడఁగానే మునులహృదయములే కావు, పశుపక్ష్యాదులమనస్సులుకూడఁ గరఁగిపోయినవి.

వస — ఆబాలుర పేళ్ళెఱుఁగుదువా?

ఆ — ఆదేవతయే "కుశలవు" లనువారి పేళ్ళను వారిప్రభావమునుగూడఁ జెప్పెను.

వస — ఆప్రభావ మెట్టిదమ్మా!

ఆత్రే — వారు రహస్యములైన జృంభకాదిమహాస్త్రములు వారికిఁబుట్టుకతోనే వచ్చినవఁట.

వస — ఏమీ? ఇదెంతచిత్రమమ్మా!

ఆ — ఆపిల్లవాండ్రను వాల్మీకి దాదివలెఁ బెంచి చౌలకర్మ మొనరించి బ్రహ్మజ్ఞానము వేదములు దక్కఁ దక్కినయాయుర్వేద ధనుర్వేద గాంధర్వములను సకలశాస్త్రములను ముందుగా వారికి నేర్పెను. తరువాత గర్భమాసములతోఁగూడ పదకొండవయేఁట క్షత్రియోచితకల్పమున నుపనీతులను జేసి త్రయీవిద్యను నేర్పెను. అట్టివిశేషప్రతిభ గలవారితో నాబోఁటిదానికి సహాధ్యయనము సంబంధింపదు. ఏమనఁగా?

ఉ. మానితబుద్ధి మందుని సమానముగాఁ జదివించు నొజ్జ, పై
వానికి బుద్ధిశక్తి కొనివైచున? వీనికిఁ దీసివేయునా?
కాని ఫలంబు వేఱుపడి కానఁబడున్, మణిదర్పణంబు చం
దాన శిలామృదాదులు గనం బ్రతిబింబము పట్టఁజాలునే?

అక్కడ చదువుకొనుట కిది ముఖ్యవిఘ్నము. ఇంకొకయంతరాయము గలదు.

వస — అది యేమి?

ఆ — వాల్మీకిమహాముని యొకనాఁడు మధ్యాహ్నకృత్యములు నెఱవేర్పఁ దమసానది కేగెను. అప్పు డక్కడ నొక కిరాతుఁడు జంటగాఁ దిరుగు క్రౌంచపక్షుల

లో నొకదానిని జూపెను. దానిని జూచినంతనే-"మ్లానిమాద! [illegible]
[illegible] శ్రావ్య[illegible] యవశ్యం [illegible] నా [illegible] కానమో
హితః" అను శ్లోక [illegible] దోబద్ధమై యాకస్మికముగా [illegible] వచ్చెను.

[illegible]—వేదములయందు [illegible] నూతనముగా [illegible] యీ [illegible] మి[illegible] చిత్రముగా [illegible].

ఆ—అప్పుడు, [illegible] బ్రహ్మదేవుఁ [illegible] "[illegible]! [illegible] బ్రహ్మజ్ఞానము [illegible]. నీ [illegible] ప్రకాశించుచున్నది. [illegible] బ్రహ్మ[illegible] నై [illegible] రామాయణము [illegible] చేసెను.

వా—[illegible]! అది [illegible] కాదే

ఆ—అందుచే [illegible] యని [illegible].

వా—[illegible].

ఆ—అమ్మా! [illegible] యాత్రకము [illegible] దొరకదు.

వా—[illegible] గోదావరియొడ్డున నేమున్నది.

ఆ—(కన్నీటితో) [illegible] గోదావరి ఈ [illegible] ప్రసన్నమగుగాక! [illegible] దేవత [illegible] వాసంతి నా?

వాసంతి—అవును. నీవు చెప్పినది నిజము!

ఆ—నా పత్నా బాగుంది!

గీ. ఇప్పుడు మా టలుఁ ధోరణి నెఱుఁగఁబడిన
నీదుచిట్టాలు తెరుపర్వతాను లెల్ల
నాపుమాత్రాపశిష్ట వై నట్టి నిన్నుఁ
గోరి నాకంటఁ బెట్టుచున్నారు తల్లి!

వా—(భయముతోఁ దనలో) నాపుమాత్రావశిష్ట యున్న దేవిని (పరికా) సీతాదేవి కపాయమే మైన వచ్చెనా?

ఆ—కేవల మపాయమే కాదు. అపవాదములోఁ గూడిన యుపాయము. (చెవిలోఁ జెప్పును.)

వా—హా దైవమా! ఎంతదారుణమైన దెబ్బకొట్టినావు? (అని మూర్ఛిల్లును)

ఆ—[ఊఁఱడిల్లు మూఁఱడిల్లుము.

వా—[ఊఁఱడిల్లి] హా ప్రియసఖీ జానకీ! నీజన్మఫల మిట్టిదా? హా రామభద్రా! అయిన నీతో నేమి?---ఆత్రేయీ! చెప్పు మమ్మా! అడవిలో విడిచిపెట్టి లక్ష్మణుఁడు వెళ్ళిన పిదప సీత యేమయినదో వార్త తెలిసెనా?

ఆ—లేదు లేదు.

వా—అవురా! అరుంధతీవసిష్ఠు లాశ్రయించియున్న రఘుకుల మునుఁ గౌసల్యాదులు ముగ్గురు ప్రాణములు జీవించియుండఁగా నింతపని జరిగినదా?

ఆ—అపుడు పెద్ద లందఱు ఋశ్యశృంగునిసత్త్రయాగము చూడ వెళ్ళినారు. ఇపుడా యజ్ఞము సమాప్తమైనది. ఋశ్యశృంగుఁడును వారిని సమ్మానించి సాగనంపెను. కాని, కోడలులేని యయోధ్యకు నేను రా నని యరుంధతి యనఁగా రాముని తల్లు లామాటే పట్టుకొన్నారు. అపుడు వసిష్ఠుఁడు వారియనురోధముచే వాల్మీకిమహాముని తపోవనమున కేగి యందు నివ సింత మని నిశ్చయించెను.

వా—అమ్మా! ఆశ్రీరామమహారాజుగా రిపుడేమి చేయుచున్నారో!

ఆ—అతఁ డశ్వమేధయాగము చేయ నారంభించెను,

వా—ఛీఛీ! మరల పెండ్లాడెనా?

ఆ—లేదులేదు. పాపము శాంతించుఁగాక.

వా—అయితే యజ్ఞములో సహధర్మచారిణి యేది?

ఆ—బంగారు సీతాప్రతిమ.

వా—ఆహా! ఏమి?

గీ. వజ్రమునకంటె గట్టివి పట్టి చూడ
నలరుకంటెను మెత్తని వైయట్టి
ధీరగంభీరసుస్థిరోదారవీర
పురుషహృదయంబు లెఱుఁగ నెవ్వరితరంబు?

ఆ—వామదేవునియనుజ్ఞ వడసిన మేధ్యాశ్వము విడువఁబడినది. యథాశాస్త్రముగా దానికి సంరక్షకులు నియమింపఁబడిరి. దివ్యాస్త్రసంప్రదాయము తెలిసికొని లక్ష్మణపుత్త్రుఁ డైన చంద్రకేతువు చతురంగబలముతో సేనానాయకుఁడై వెళ్ళెను.

వా—[సకౌతుకానందబాష్పముగా] కుమారలక్ష్మణునికిఁగూడా కుమారుఁడా? మాతల్లీ! మంచిమాట చెప్పినావు. బ్రతికినా నమ్మా!

ఆ—అంతలో నొకబ్రాహ్మణుఁడు చచ్చిపోయిన తనకుమారుని దెచ్చి రాజద్వారమునఁ బెట్టి అయ్యో బాదుకొనుచు రక్షింపురక్షింపు మని మొఱ్ఱ వెట్టెను.

వా—తరువాత—

ఆ—అంతట రాజదోషము లేకుండఁగాఁ బ్రజల కకాలమృత్యువు రా దని దయామయుఁడైన శ్రీరాముఁడు దోషము తనయం దారోపించుకొనుచుండఁగా, అశరీరవాణి యిట్లు పలికెను.

గీ. వినుము శంబూకుఁ డనుశూద్రుఁ డనుపమాన
తపము చేయుచునుండె భూతలమునందు
చంపఁ దగినట్టివానిమ స్తకము దునిమి
బ్రాహ్మణకుమారు బ్రతికింపు రామచంద్ర!

అది విని జగతీనాయకుఁడైన రామభద్రుఁడు కత్తి చేతఁబట్టి విమాన మెక్కి శూద్రతాపసుని వెదకుటకై యెల్లదిక్కులు తిరుగ బయలుదేరెను.

వా—ధూమపాయి యైనశంబూకుఁ డీజనస్థానముననే తలక్రిందుగాఁ దపము చేయుచున్నాఁడు. వానిని వెదకుచున్న శ్రీరామచంద్రుఁడు మరల నీవన మలంకరించును గాఁబోలు!

ఆ—అమ్మా! ఇపుడు వచ్చుచున్నాఁడు.

వా—ఆర్య ఆత్రేయీ! కానిమ్ము. ఇపుడు మట్టమధ్యాహ్న మైనది చూడు.

ఉ. ఆతపబాధ కోర్వక రయంబున గూళ్ళకుఁ జేరి వేఁడిమిన్
గూఁతలు వెట్టుకాకులును కోళ్ళను బావురముల్ గలట్టియా
యాతరుపంక్తి క్రీఁ దట గొని యేన్గులు రాచుకొనంగ రాలుఘ
ర్మాతివిశీర్ణవృంతకుసుమావళిఁ బూజ యొనర్చు గౌతమిన్.

[ఇద్దఱు నిష్క్రమింతురు.] ఇది శుద్ధవిష్కంభము.

[తరువాత సదయుఁడైన శ్రీరాముఁడు విమానస్థుఁడై కత్తి పై కెత్తిపట్టుకొని ప్రవేశించును.]

రా-మ.విను మోదక్షిణహస్తమా! వృషలుపై వేవేయుమీకత్తిఁ జ
చ్చినభూమీసురబాలకుండు మరలన్ జీవింపఁగాఁ, బూర్ణగ
ర్భను వైదేహిని మోసపుచ్చి వనికిం బంపించు పాపిష్ఠ రా
మునిగాత్రంబవు గా వొకో! దయయు మోమోటంబు నీకున్న దే?

[అతికష్టముగ నఱకి] రాముఁడు చేయఁదగినపని చేసినాను. ఇఁక బ్రాహ్మణకుమారుఁడు జీవించునా?

దివ్యపురుషుఁడు—(ప్రవేశించి) దేవా! జయము జయము.

గీ. దండధరభీతిఁ బాపినదండధారి!
స్వామి! శంబూకుఁ డను నమస్కారమయ్య!
బ్రతికె విప్రుండు నాకు దివ్యత్వ మబ్బె
సజ్జనులచేతిమృతియు నిస్తారకంబ

రా—రెండువిధముల నాకిష్టమే. నీవు [illegible] ననుభవింపుము.

గీ. మోద మానంద మష్టవిభూతు లిష్ట
సంపదలు నెందు సమకూరు, సకలశుభము
లలరు వైరాజనామక మైనయట్టి
పుణ్యలోకంబుఁ జేర శంబూక! పొమ్ము.

శం—దేవా! మీయనుగ్రహముచేత నా [illegible] సిద్ధించినది. కాని నా తపస్సుచేఁ గాదు—ఇట్టి [illegible] తపస్సు [illegible] ముచేసినది.

చ. నరవర! లోకనాథుఁడ వనాథశరణ్యుఁడ వీవ లోకమున్
దిరుగఁగ నేఁపు, పైన ధరయుండెయుఁ గ్రుమ్మరి వచ్చితింక న
న్నరయఁగ నాతపోమహిమ యయ్యె నిజం బిది, యట్లుగానిచోఁ
దిరిగి యయోధ్యనుండి చనుదెంతురె? దండకఁ గాలు పెట్టుదే?

రా—ఇది దండకారణ్యమా! [అని [illegible]] ఆ! ఏమిటి

చ. చకచకలాడుచుండెడి నలచక్కవిచిక్కనిపచ్చసోలల్, భయా
నక ముదయించుఁ గన్గొన ఘనంబగుగోతులుమిట్టలున్న యీ
వికటతలం, బవే గిరులు వెల్లువ వాఁగు లగస్త్యునాశ్రమం
బకట! యిదంతయున్ బరిచితాటవిగాఁ గనుపట్టు నియ్యెడ. ౯

శం—అవును. ఇది మీ [illegible] దండకారణ్యము. తొల్లి దేవర [illegible] నివసించినపుడు [illegible] ఖరదూషణత్రిశిరులను సంహరించినారు. [illegible] సిద్ధక్షేత్రము [illegible] జనస్థానము [illegible] నాబోఁటి

జానపదు లందఱును నిర్భయముగా సంచరింపఁగలిగినారు.

రా—అయితే, ఇది కేవలము దండకాటవి కాక జానస్థానము కూడనా?

శం—చిత్తము. చూచువారి శరీరములు గగుర్పొడుచునట్లుగా భయంకరములై మఱించిన బెబ్బులులతోఁ గూడిన కొండగుహలు గలజనస్థానపర్యంతదీర్ఘారణ్యములు దక్షిణదిక్కునకు వ్యాపించి కనవచ్చుచున్నవి చిత్తగింపుఁడు.

సీ. ఆవంక నిద్రించునలఁ త్రాఁచుపాముల
నిట్టూర్పులకు రేఁగి నిప్పు మండు,
ఆప్రక్క కవల గాఢారణ్యమధ్యంబు
క్రూరసత్త్వముల సంచారభూమి,
ఆచాయ మృగములయార్పులు వినవచ్చు
నీచాయ నిశ్శబ్ద మెంతయేని,
ఆచక్కి గుహలలో నఁదందు నీళ్లున్న
వీచక్కి నీర మింతేని లేదు,

గీ. దప్పి గొన్నట్టికొండ లీదరుల మొగలఁ
బొంచి లోపల సుఖము నిద్రించుచున్న
కొండచిలువల మేనులనుండి కాఱు
చెమటనీళ్ళను ద్రాగు నచ్చెరువు గాఁగ.

రా-గీ. మున్ను ఖరరాక్షసుండు కాఁ పున్నయట్టి
యీజనస్థాన మిప్పుడే చ్లైను గంటి
నపుడు జరిగిన యిచటి వృత్తాంతములను
గన్నులకుఁ గట్టినట్లుగాఁ గాంచుచుంటి

(అంతటఁ జూచి) జానకి, సర్వథా రాముని ప్రేమించినమహాపతివ్రత—ఇవి దుర్గమారణ్యములు గదా! ఇంతకంటె భయకారణ మేముండును—(కన్నీటితో)

గీ. పుష్పరస పుష్పగంధంబు పొలయునట్టి
కానలం దుఁదు నీతోడఁ గలిసి యనును

నిందు నన్నుఁగూడి యుండెడి నాయిందువదన
ఆమెయనురక్తి యట్టిది-యసదృశంబు

గీ. ఏమియును జేయ కూరక యెవ్వ రెవరి
దుఃఖమును నైజసుఖమునఁ దోలఁగుచుండు
రట్టినిర్హేతుకప్రీతి నలరునట్టి
వారు వారియదృష్టదేవతలు సుమ్ము.

శం—దేవా! తలపెట్టరాని యీదుఃఖవచనములు విడిచిపెట్టి యీప్రసన్నగంభీరములైన మహారణ్యములను జూడుఁడు. మత్తమయూరముల చక్కనికంఠకాంతులు తళతళ మెఱయుచుండ, మిక్కిలి దగ్గఱగాఁ గలిసియుండి చల్లనినీడ నిచ్చు లేఁత మొక్కలగుంపు లతిసుందరంబులై కన్నులకింపగుచుండ, నిశ్చయముగా నందందు సంచరించువివిధమృగయూథములతో వెలయు నీవనభాగము లెంతరమణీయముగా నున్నవో చిత్తగింపుఁడు.

చ. కిలకిలలాడునట్టివిహగీవిహగంబులు ద్రొక్క వేతసం
బులపయినుండి జాఱిపడుపువ్వులవాసనతో, వినీలస
త్ఫలభరమైననేరెడుపాదంబడి త్రొక్కిలి మ్రోగువాఁగులం
గలిసినయేఱ్ఱు చూడు వడిగాఁ బ్రవహించెడుఁ దేటనీటితో

గీ. ఘోరభల్లూకములు క్రొంతగుహల నుమియు
నట్టిచప్పుడు మఱుమ్రోఁత నధిక మయ్యెఁ
గరులు విఱిచినసల్లకీతరులనుండి
వెడలు రసము సుగంధంబు విరియు నిందు.

రా—[క్రౌంచవనము చేపు మాటాడకుండి] ఓహో. దేవయానంబు లయిన మార్గములు నీ కనుకూలములగును గాక. పుణ్యలోకముల కేగింపుము.

శం—ప్రాచీనబ్రహ్మవాదియైన యగస్త్యమహామునికి నమస్కరించి శాశ్వతపదమునకుఁ బోయెదను. [వెళ్ళును]

రా-క. మునులము, గృహమేధుల మై
చనుచున ధర్మాభిరతిని సంసారసుఖం

బునఁ గాంచుచు బహుకాలము
మును పున్నవనంబు నిప్పుడు పొందితి మరలన్.

గీ. పీనహరిణంబు లున్నయీకాన లవియె
కేకిలిమనెమ్మ లున్నయీగిరులు నవియె
మంజులాశోక వేతసమహితనీప
కలిత మైనట్టియీయేళ్ళగట్టు లవియె.

మేఘపంక్తివలెఁ గనవచ్చునట్టి యీకొండయే ప్రస్రవణము. దానిలోయలనుండియే గోదావరి ప్రవహించుచున్నది. దానిశిఖరముమీఁదనే గృధ్రరాజు నివసించెడివాఁడు. దానిక్రిందనే కిలకిలలాడు వివిధశకుంతసంతానముల కావాసములై శ్యామలాకారమున గోదావరిలోఁ బ్రతిఫలించుబహువిధఫలపుష్పపాదపములతోఁ గూడిన దక్షిణవనాంతప్రదేశ మున్నది. అందే పర్ణశాలలలో మేము సుఖముగా నుండెడివారము. ఇదిగో! దానికి దగ్గఱగానే పంచవటి. ఇందే నాప్రియసఖురాలు ప్రాణసఖి యైనవాసంతి నివసించును. ఆహా! చిరకాలము నివసించుటచే మాస్నేహసల్లాపక్రీడాదుల కీప్రదేశములు సాక్షు లగునుగదా! [మనోవైకల్య మభినయించి] ఇదంతయు సంభవించినది. అయ్యో! ఇపుడు—

చ. తనువున నుండి యుండి యెగఁదన్నెడుతీవ్రవిషద్రవంబు రీ
తిని, మును డొక్కలో నణఁగి దెబ్బఁ జలించినముల్కుముక్కలా
గున, సెలలెత్తి బద్ధ లగుగుండియలోని రణంపుమూర్ఛబు, నా
వెనుకటిశోకమే మరల వేఁపఁగఁజొచ్చెను నూతనంబుగా.

అయినను పూర్వకాలమిత్రము లైనయీవనభాగములను జూచెదను. [చక్కఁగా నిరీక్షించి] ఆహా! ఈప్రదేశ మెంత మాఱిపోయినదో!

ఉ. చూడఁగఁ దొంటివెల్లువలచోట్లును మేటలు వేసె, నచ్చటం
బాడయి పల్చ నయ్యెఁ దరువాటిక, యిచ్చటఁ జిక్క నయ్యె, నే
నాఁ డిది చూచినాఁడనొ? కనంబడుచుండెను వేఱుకానగా
నేఁ డిది, కాని యీగిరులు నిక్క మదే యిది యంచుఁ దెల్పెడున్.

అయ్యో! నేను విడిచిపెట్టుచున్నను. నన్నీపంచవటీస్నేహము బలాత్కారముగా లాగుచున్నదిగదా! [సవిచారముగా]

ఉ. అక్కట! యింట నున్నగతి నాకమలాక్షిని గూడి పెక్కునా
ళ్లెక్కడ నుంటి? దేవికథ లెప్పటికప్పుడె యూరుచుండు మా
కక్కమనీయపంచవటి నాసతి మ్రాపినపాపి రాఘవుం
డొక్కఁడు నిప్పు డెట్లు కనునో? చని చూడక యెట్లు పోవునో?

శంబూకుఁడు—[ప్రవేశించి] దేవా! జయము జయము. నావలన దేవరవారిరాక విన్నయగస్త్యులవారు దేవరతో నిట్లు చెప్పుమని సెలవిచ్చినారు.

"రామభద్రా! నీవు విమానము దిగునప్పు డాచరింపఁదగిన నీరాజనాదులు సమకూర్చుకొని లోపాముద్ర మిక్కిలి వాత్సల్యముతో నీరాక కెదురు చూచుచున్నది. ఇచ్చటి మునీశ్వరు లందఱును నిన్నుఁ జూడఁ గుతూహలపడుచున్నారు. కావున ముందుగా నిచ్చటికి వచ్చి మా కందఱికిని సంతోషము గలిగించి వెంటనే మహావేగసంపన్న మైన విమాన మెక్కి యయోధ్య కేగి యశ్వమేధయాగమునఁ బ్రవేశింపుము."

రా—ఆమహానుభావుఁ డాజ్ఞాపించినట్లే చేయుదును.

శం—దేవా! ఇటు దయచేయుఁడు.

రా—[విమానమును బోనిచ్చుచు] అమ్మా పంచవటీ! పెద్దల యనురోధముచే నిన్నతి క్రమించి పోవుచున్నాను. క్షణకాలము క్షమింపుము.

శం—దేవా! ఇదియే క్రౌంచావతపర్వతము. దయచేసి నిరీక్షింపుఁడు—

చ. అలపొదరిండ్ల నుండినదివాంధగణంబులభీకరధ్వనిం
గలిసినకీచకధ్వనికిఁ గాకులు మూకము లయ్యె, వీను లిం
పొలయుమయూరనాదముల కుల్లము తల్లడ మంద సర్పముల్
తలఁకుచు వట్రితొఱ్ఱల మొదళ్లను డాఁగి వణంకు నెంతయున్.

చ. తరళపయోదశృంగ మిది దక్షిణపర్వతసంక్తి; దీనికం
దరములఁ గద్గదధ్వని యొనర్చును గౌతమి, చూడుమీ; పర
స్పరమును దాఁకి పైకెగసి సంకులమై వడిఁ ద్రోఁగునట్టిపె
ద్దరఁగలు లోతునీరును గనంబడునేళులసంగమంబులన్.

అందఱు నిష్క్రమింతురు.] ఇది ద్వితీయాంకము.

# ఉత్తరరామచరిత్రనాటకము

## తృతీయాఙ్కము

[అటుతరువాత నదీద్వయము ప్రవేశించును]

ఒకతె—సఖీ మురళా! తొందరపడుచున్నట్లున్నా వేమి?

మురళ—అమ్మా తమసా! అగస్త్యులవారి యిల్లాలగు లోపాముద్ర గోదావరితో నొక మాట చెప్పి రమ్మని నన్నుఁ బంపినది. నీవును దెలిసియే యుందును—

..భార్యను విడిచినది మొదలుగా—

గీ. ధీరగంభీరుఁ డగుటచేఁ దెలియరాక

యుండి లోపలఁ గుతకుతయుడుకునట్టి

రాముకరుణరసంబు దురంతతాప

కారియై పుటపాకసంకాశ మయ్యె.

గద్గదస్వరమునకుఁ గారణమైనయాదీర్ఘశోకసంతాపముచే రాముఁ డిపుడు మిక్కిలి చిక్కిపోయినాఁడు. అతనిఁ జూచినపిదప నామనస్సు కదలుచున్న పువ్వులోడి మేలాగున నున్నది. ఇపుడు తిరిగి వచ్చుచున్న రామభద్రుఁడు తనభార్యతోఁగూడి నివసించిననాఁటివినోదవిలాసములకు సాక్షులైనపంచవటీప్రదేశములను దప్పక చూచును ఎంతధీరుఁడైనను, ఈయవస్థలో దుఃఖమూలములైన ఆస్థానములను జూచునపు డతని కతిగంభీరశోకక్షోభసంవేగముచే మాటిమాటికిని మహాప్రమాదము సంభవించుచుండు నని శంకింపఁ దగియున్నది. కావునఁ భగవతీ గోదావరీ! నీ వచ్చట సావధానముగా నుండుము.

గీ. పద్మకింజల్కగంధసంవాసితంబు

నంబుశీకరశీతల మైనయలల

గాలి నిశ్శంకముగ లేపి కరుణతోడ
మూర్ఛమూర్ఛకు రాముని బ్రోవుమమ్మ!"

తమ — స్నేహధర్మముచే నాలోచించిన యీయుపాయ మెంతయుఁ జక్కఁగానున్నది. కాని ప్రధానమైన సంజీవనోపాయమే రామునకుఁ జేకూరునది.

ముర — అదెట్టిదో చెప్పుము.

తమ — చెప్పెదను వినుము. అపుడు, వాల్మీకిమహర్షి యాశ్రమముపగ్గఱ సీతాదేవిని విడిచిపెట్టి లక్ష్మణుఁడు వెళ్ళినతరువాత, ఆమె ప్రసవవేదన నోర్వలేక దుఃఖావేశముచే గంగలో దిగినది. వెంటనే యామె కప్పుడే యిద్దఱు పిల్లలు పుట్టిరి. అపుడు గంగావసుంధర లనుగ్రహించి యామెను శిశువులతో రసాతలమును జేర్చిరి. పాలుద్రాగుట మానినతోడనే గంగాదేవి యాకుమారుల నిద్దఱిని దీసికొనివచ్చి వాల్మీకిమహర్షికి స్వయముగా నప్పగించినది.

ముర — [ఆశ్చర్యముతో]

గీ. ఔర! గంగావసుంధరలంతవారు
సీత కట్టిసహాయంబు చేసి రనుట
యిట్టివారికి వచ్చెడి యెట్టిదశయు
నైనఁ బరమాద్భుతంబగు ననుటగాదె?

తమ — ఇపుడు శంబూకవృత్తాంతముచే రామభద్రుఁడు జనస్థానమునకు వచ్చినవార్త సరయూనదివలన విన్నదై జాహ్నవీదేవి స్నేహవశమున లోపాముద్ర యనుమానించినట్లై యనుమానించి, సీతాదేవిని వెంటఁ బెట్టుకొని యేదో యొకపని మీఁద వచ్చినట్లుగా గోదావరీతీరమునకు వచ్చినది.

ముర — భాగీరథి చక్కఁగా నాలోచించినది. రాజ్యపరిపాలననిష్ఠచే దేశాభివృద్ధికి హేతువులైన ఘనకార్యములలో మునిఁగి రామచంద్రుఁ డింతవఱకు నెట్లో మనోవ్యథబారినుండి తప్పించుకొనుచున్నాఁడు కాని యిపుడు వ్యాపారాంతరశూన్యుఁడై శోకమాత్రద్వితీయుఁ డైనయితనికిఁ బంచవటీప్రవేశ మనర్థదాయకము కాక పోదని యామె యూహించినయుపాయ మెంతయు ననుకూలముగానున్నది—ఔనుగాని సీతాదేవి రామభద్రు నెట్లూఱడించు నమ్మా!

తమ — గంగాదేవి యీమె జానకితో నిట్లు చెప్పినది. "అమ్మా దేవయజనసంభూతా సీతా నేఁడు చిరంజీవు లైనకుశలవులకుఁ బన్నెండవజన్మదినోత్సవము చేసి వారిచేతు

లను శుభసూత్రములు కట్టవలసినరోజు. కాఁబట్టి నీవు వయసను మొట్టమొదటి మామగారును మనుసంబంధ మైనరాజవంశమునకు జనకుఁడును సకలదోషహారుఁడు నైనసూర్యదేవుని నీచేతితోఁ గోసినపువ్వులఁ బూజింపుము. భూతలమందున్నను నాదుమహిమచే నిన్ను వనదేవతలు గూడఁ జూడఁజాలరు. ఇంక మనుష్యులమాట చెప్పనేల?” అని యామె నాతోఁ జెప్పి, “తమసా! మాకోడలయిన సీతను నీవిఁక నెంతో ప్రేమగఁ జూ! కావున నీవు సీతతోనుండుము. అని నాతో సెలవిచ్చినది. అందుచే నే నామె యాజ్ఞాప్రకారము నడచుకొనుచున్నాను.

ముర — నే నీ వృత్తాంతము లోపాముద్రకుఁ జెప్పెదను. ఇప్పటికి రామభద్రుఁడును వచ్చియుండునని యే నాయూహ.

తమ — ఇదిగో! గోదావరీహ్రదమునుండి బయలుదేఱి, జానకి—

గీ. తెల్లపడి చిక్కినట్టిచెక్కిళ్లతోడఁ
గొప్పు విడిపోయి మోముపైఁ గురులు చెదరఁ
గరుణరసమూర్తియో మేను గాంచువిరహ
బాధయో యన నడవికి వచ్చుచుండె.

ముర — ఇదిగో జానకి—

చ. పుడికినయట్టిలేఁజిగురుఁబోఁడిమి గల్గి కృశించినట్టియీ
పడఁతుక పాండురాంగమును వాడఁగఁ జేసెడుఁ జిత్తపుష్పముల్
గడు నుడికించుదీర్ఘతరగాఢమనోవ్యథ, శారదోష్మ మూం
పోడముచునున్న లే మొగలిపువ్వునలోపలి ఱేకునుంబలెన్.

[అని నిష్క్రమింతురు]

[తెరలో] ప్రమాదము ప్రమాదము.

[తరువాత, పుష్పాపచయవ్యగ్రహస్తయై సవిచారకుతూహలముగా వినుచున్న సీత ప్రవేశించును]

సీత — ఆహా! తెలిసినది. నాప్రియసఖి యైనవాసంతి మాట్లాడుచున్నది.

[మరలఁ దెరలో]

మ. అనురాగంబున మున్ను సీత తనముం దల్లాడునేయేన్గుపి
ల్లను బోషించెనొ లేఁతయుందుగుచిగుళ్లన్ నోటి కందించుచున్

[మఱియుఁ దెరలో] దాని కేమి వచ్చినది:

తనయాఁ డేనుఁగుఁ గూడి నీళ్ళఁబడి యాఁతా లాడునద్దాని డీ
కొని పోరాడఁగఁ జొచ్చె వేఱొక మదక్రూరేభ మెట్లో కదా!

సీ—[తొందరతో నాలు గడుగులు వెళ్ళి] ఆర్యపుత్రా! నా పెంపుడుపిల్లను రక్షింపు రక్షింపు— అయ్యో! పంచవటిని జూచుటచే దురదృష్టవంతురాల నైన నా కలవాటయిన యామాటయే నోటికి వచ్చుచున్నది. హా ఆర్యపుత్రా!

[మూర్ఛిల్లును]

తమస—[ప్రవేశించి] అమ్మా కుమారీ! ఊఱడిల్లుము.

[తెరలో] విమానరాజమా! నీ విచ్చటనే యుండుము.

సీ—[స్మృతిఁ జెంది సభయోల్లాసముగా] ఆహా ఆశ్చర్యము! జలభరితనూతనమేఘధ్వనిమాడ్కి గంభీర మైనగొప్పకంఠధ్వని యెక్కడనుండియో వచ్చి వీనులవిందై మందభాగ్య నగునా కానందము గలిగించుచున్నది,

తమ—[కన్నీటితో, చిఱునవ్వుతో] కుమారీ!

గీ. స్వప్నమా? కాదు, దూరాన సంభవించె
నట్టికంఠస్వరంబు నీ వాలకించి
పొడము తహతహఁ దత్తఱపడెద వేల?
యుఱుము విన్నట్టి బాలమయూరి వోలె.

సీ—భగవతీ! ఏమన్నావు? ఈవిన్నకంఠస్వర మస్పష్టమా? స్వరసందర్భము కూడ నెఱుఁగనా? అది నిజముగా నార్యపుత్రుని మాటయే.

తమ—కావచ్చును. శూద్రతాపసుని దండించుటకై యా రఘువీరుఁడు జనస్థానమునకు వచ్చె నని విన్నాను.

సీ—పరిపాలకధర్మములు నిర్వహించుట యామహారాజునకు మిక్కిలి యభీష్టము.

[తెరలో]

గీ. బాలమృగములు, చెట్లు పిట్టలుగాఁగ
నెందు చిరకాల మంటి నాయిందువదనఁ
గూడి, యవి యివ్వె సెలయేళ్లు గుహాలు పెక్కు
పరగు గోదావరీ తీర గిరితటములు.

సీ—ఎట్లు? ప్రభాతచంద్రమండలమువలెఁ దెల్లవడి శరీర మెంతో కృశించినను సహజగంభీరానుభావమాత్రముచే గుఱుతు పట్టఁదగిన యార్యపుత్రుఁడే దైవ

వశమున వచ్చెను. తల్లీ తమసా! నన్నుఁ బట్టుకొనుము, (అని తమసను కౌఁగిలించికొని మూర్ఛిల్లును)

తమ—అమ్మా! ఊఱడిల్లుము.

(తెరలో)

సీ. హృదయమున దాఁగియుండియు నింత, కిపుడు
పంచవటిఁ జూడ రగిలి జ్వలించునట్టి
దుఃఖవహ్నిని మును లేచుధూమమట్లు
గాఢముగ నన్ను మోహంబు గ్రమ్ముచుండె.

హా ప్రేయసీ జానకీ!

త—పెద్దలు శంకించినవిషయ మిదే కదా!

(తెరలో) హా దండకారణ్యప్రియసఖీ వైదేహీ! (మూర్ఛిల్లును)

సీ—హా కష్టము. ఆభాగ్యురాల నైననన్నుఁ బేరెత్తి పిలుచుచు నల్లకలువలు ముకుళించునట్లు కన్నులు మూఁతపడ నార్యపుత్త్రుఁడు మూర్ఛిల్లెను. అయ్యో! ఉచ్ఛ్వాసనిశ్వాసములు లేక వ్యత్యాసముగా భూతలమునఁ బడియుండెను. తల్లీ! తమసా! రక్షింపుము. ఆర్యపుత్త్రుని బ్రతికింపుము (అని కాళ్ళపైఁ బడును)

తమ—

క. నీవే బ్రతికింపవలెన్, భూవలయప్రభుని రాఘవుని గల్యాణీ!
నీవిమలకరస్పర్శము, నీవిభుని కభీష్ట మగుట నిక్కము గాదే?

సీ—కానున్నది కాక మానదు. నీవు చెప్పినట్లే చేసెదను (అని తొందరగా వెళ్ళును.)

(పిదపఁ గన్నీరు విడుచుచున్నసీతచేఁ బట్టుకొనఁబడి సానందముగా నిట్టూర్పు విడుచుచు నేలఁ బడియున్న రాముఁడు ప్రవేశించును)

సీ—(కొంచెము సంతోషించి) ముల్లోకములకుఁ బ్రాణము మరల వచ్చిన దని తలంచెదను.

రా—ఆహా ఏమిది?

ఉ. చందనపల్లవంబులరసంబొ! నిపీడితచంద్రమఃకలా-
స్యందిరసంబొ? జీవన మొసంగెడి యోషధిరాజసారమో?

పొందుగ నాయెడం దపయిం బూసినయట్టులు చల్లనయ్యె నూ
ర్పం దెసు విచ్చెఁ గన్నులు కడంటినప్రాణము వచ్చె వెండియున్.

మ. పరమాహ్లాద మొనర్చి జీవనము నాపాదించి రక్షించునీ
కరసంస్పర్శము మున్నెఱింగినదె నిక్కం బౌర! చిత్తవ్యథా
భరజాతం బగు మూర్ఛ నిప్పుడిది పోవం ద్రోసి యానందసం
భరితం బౌజడభావ మంగములఁ బర్వం జేయు నూత్నంబుగా.

సీ.—(భయవిచారములతోఁ గొంచె మొత్తిగిల్లి) నా కిప్పుడిదే యెక్కుడ.

గా—(కూర్చుండి) అనురక్తురాలయిన నాదేవి నన్ను స్పృశింపలేదు.

సీ.—అయ్యో ఎంతకష్టము! ఆర్యపుత్రుఁడు నన్నెట్లు నిర్దేశించును?

గా—కానీ! చూచెదను.

సీ.—తమసా! మన మావలికిఁ బోవుదము. తన సెలవు లేకుండఁగా దగ్గఱ నున్నందు కీమహారాజు కోపగించును.

తమ—బిడ్డా! గంగాదేవి యనుగ్రహముచే నీవు వనదేవతలకుఁ గూడఁ గనఁబడవు.

సీ.—ఆఁ! ఔను జ్ఞప్తికి వచ్చినది.

గా—ప్రేయసీ జానకీ!

సీ.—(గద్గదస్వరముతో) ఆర్యపుత్రా! ఇప్పటిస్థితినిబట్టి యీమాట యుచితముగా లేదు. (కన్నీళ్ళతో) అయ్యో! జన్మాంతరమం దైనను, ఈమహారాజుదర్శనము లభించునని యూహించుట కవకాశము కనఁబడదు. అట్టి మందభాగ్యురాల నయిన నన్నుద్దేశించి ప్రేయసీ యని పిలుచునట్టి యీప్రియునిమీఁద జాలిగుండె దానవై యెట్లు నిర్దయురాల నగుదును? ఈయన మనస్సు నే నెఱుఁగుదును. నామనస్సు నాయన యెఱుఁగును.

గా—(అంతటఁ జూచి) హా! ఇక్కడ నెవ్వరును లేరు.

సీ.—భగవతీ! నిష్కారణముగా నన్ను విడిచిపెట్టినయీప్రియు నీస్థితిలోఁ జూచుచున్న నాహృదయావస్థ యెట్లున్నదో యేమి చెప్పుదును?

తమ—అమ్మా! నే నెఱుఁగుదును.

సీ. ఎఱిఁగి యూరక యన న్నెడఁబాసె నితఁ డెంత
వంచనం బని కోపగించినట్లు

నాయాస లడుగంటె నాకెందు కిఁక సంచు
నాస్థ మాని తటస్థ మైనయట్లు
ఘనవియోగమున నాకస్మికఘటనచేఁ
బరవశం బయి భ్రమానుపడినయట్లు
సహజసౌజన్య భాస్వర మాటఁ బతిభక్తి
నల్క దేఱి ప్రసన్న మైనయట్లు
గీ. భర్తదుఃఖంబునకు దుఃఖపడినయట్లు
ఘనతరం బగునను రక్తిఁ గరఁగినట్లు
పాలుపోకున్నయట్లు నీపట్టునందు
నీదుహృదయంబు గనవచ్చు నిర్మలాంగి!

రా-గీ తనువు దాల్చునను గ్రహం బనఁగ నీదు
పావనదయార్ద్రశీతలస్పర్శ మిపుడు
గూడ నానందమును సమకూర్చుఁ గాని
దేవి! నీ వెక్కడున్నావొ? తెలియరాదు.

సీ—ఆహా! అతిగంభీర హృదయానురాగరసమునఁ బుట్టి యానందగద్గదమై పలుకుచున్న యీమహారాజుమాట లమృతప్రాయము లగుచున్నవి గదా. నిష్కారణముగా విడిచిపెట్టుటచేఁ బుట్టినమహాదుఃఖము మనశ్శల్యమై వేధించుచున్నను, మనసార వచ్చినయీమాటలను విశ్వసించి యిపుడు నాజన్మము బహుమతమై సార్థక మయ్యెనని తలఁచెదను.

రా—నా వెఱ్ఱి కాని, ప్రియురా లెక్కడనుండి వచ్చును? నిశ్చయముగా నిది యెల్లప్పుడును దలఁచుకొనుచుండుటచే నాకు గలిగినభ్రాంతి కాని వేఱు కాదు. (తెరలో) అనుగ్రహింపు మనుగ్రహింపుము.

మ. అనురాగంబున మున్ను సీత (పూర్వార్థము చదువఁబడును)

రాము—(సవిచారముగా) దాని కేమి వచ్చినది?

మ. తన యాఁడేనుఁగు గూడి (ఉత్తరార్థము చదువఁబడును)

సీ—ఇపు డేది మార్గ మగును?

రా—ఆఁ! ఎక్కడ? కరిణితో విహరించుచుండఁగా నాప్రియురాలి పెంపుడు గజము

నెదురొక్కొన్న దుష్టవారణ మెక్కడ? (అని లేచును)

వా—(ప్రవేశించి) ఏమి? పూజ్యుఁడైన రఘునందనుఁడు!

సీ—[చూచి] హా! నా ప్రియసఖియైన వాసంతి!

వా—మహారాజా! జయము జయము.

రా—[గుర్తించి] ఓ! వాసంతి, జానకీప్రియసఖీ!

వా—దేవా! త్వరపడుము. ఇటు జటాయుశిఖరమునకు దక్షిణముగా సీతాతీర్థమునుం
డుగా గోదావరిఁ జొచ్చి నీప్రియురాలి పెంపుడేనుఁగును రక్షింపుము.

సీ—హా తాతా! జటాయూ! నీవు లేని జనస్థానము శూన్యమే కదా!

రా—అకటా! ఈమాటలు హృదయమర్మములందు గ్రుచ్చుకొని బాధించుచున్నవి
కదా! [పరిక్రమించును]

వా—దేవా! ఇటు దయచేయుము.

సీ—అమ్మా తమసా! నిజముగా వనదేవతకూడ నన్నుఁ జూడఁ జాలదు కదా!

తమ—కుమారీ! మందాకినీమహిమ యే దేవతలకును లేదు. నీకు సందేహ మెందులకు?

సీ—అట్లయిన, మనము కూడ ననుసరింతము. [పరిక్రమింతురు.]

రా—భగవతీ గోదావరీ! నమస్కారము.

వా—దేవా! వధూసాహాయ్యమున నీప్రియురాలియేనుఁగ గెలిచినది. సంతోషింపుము.

రా—ఇది చిరంజీవియై వృద్ధిఁ బొందుఁగాక.

సీ—ఆహా! ఇది యెంతటి దైనది!

రా—దేవీ! నీవు పెంచిన కరికలభము జయము గాంచినది. నీ భాగ్యము ఫలించినది.

ఉ. తామరతూండ్లఁ బోలునవదంతయుగం బుదయించునీకునం
దో మదిరాక్షి! నీదు చెవి నున్నలవంగపుఁబల్లవంబు లీ
లామతితోఁ గరాగ్రమున లాగినపెంపుడుపిల్ల యౌవన
శ్రీమతమంగళంబు మదసింధురజేత యు నయ్యెఁ జూడుమీ!

సీ—ఈదీర్ఘాయువు చక్కగా నున్నయీభాగ్య మెడఁబాయక చిరకాలము నిల్చుఁ
గాక.

రా—సఖీ వాసంతీ! ఈచిరంజీవికిఁ దనభార్యను సంతోషపెట్టు చాతుర్యముగూడఁ
గలదు సుమీ చూడు.

ఉ. ప్రేయసి తూండ్లు మెక్కునతఱిన్ గనిపెట్టుచు నిచ్చె నోటికిన్
దోయజవాసితం బయిన తొండములోనిజలంబు, వీఁపునన్

హాయిగ నీళ్ళుచల్లెఁ దనహస్తముతో, మఱి దానినెత్తిపైఁ
బాయనికూరిమిన్ గొడుగుపట్టె సనాళసరోజపత్త్రమున్.

సీ—తమసా! ఇది యిట్లు పెరిగి పెద్దదైనది. కాని, కుశలవు లీనాఁటి కెంతవారైరో తెలియదుగదా!

తమ—ఇది యెట్లు పెరిగినదో వారు నట్లే పెరిగి యుందురు.

సీ—నేను నిర్భాగ్యురాలను. పతివియోగ మొక్కటే కాదు, పుత్త్రవిరహముగూడ దుస్సహమై నన్ను బాధించుచున్నది.

తమ—నీ యదృష్ట మింతే. ఏమిచేయఁగలము?

సీ—పిల్లలనుగన్నాను. అయితే నేమి? మల్లెమొగ్గలవంటిపలుగుదురతోను, విశాల నేత్రములతోను, తెలిసీతెలియనిసన్ననిమృదుమధురకంఠస్వనముతోడి చిఱునవ్వుతోను ముద్దులొలుకు నా పుత్త్రులసుందరవదనారవిందములు నాయార్యపుత్త్రుఁడు ముద్దుపెట్టుకొను భాగ్యమునకు నోఁచుకోని నాకాన్పుతో నేమి ప్రయోజనము?

తమ—ఆ భాగ్యము దేవతానుగ్రహమునఁ గలుగుఁగాక.

సీ—తల్లీ తమసా! పిల్లలను దలఁచుకొనుటచే ఱొమ్ము చేఁపుటయు, పిల్లలతండ్రి దగ్గఱ నుండుటచేఁ గొంచెముసేపు కాఁపురము చేయుటయు సంభవించినది.

తమ—నిజమమ్మా! ఈమాట చెప్పవలెనా? సంతాన మనఁగా స్నేహముయొక్క పరమావధి. మఱియును, తల్లిదండ్రుల యవినాభావసంబంధమునకుఁ బ్రధాన కారణము.

క. పూనికని భార్యాభర్తల
మానసములఁ బ్రేమ నొక్కటైనఁ గూర్చెడియా
యానందగ్రంథియె సం
తానం బని చెప్పుచుండ్రు తత్త్వజ్ఞులిలన్.

వా—దేవా! ఈవైపుకూడ చూడుము.

గీ. తరుణపింఛంబు పుట్టినతరుణమందు
దేనినీసీభార్య పెంచెనో దినదినంబు,
ఆమయూరమె కడిమిపై నాఁడు నెమలి
తోడుగాఁ గేక లడరంగ నాడుచుండె

సీ—[సకౌతుకస్నేహస్మితముగా] ఔ నదే యిది.

రా—కుమారా! ఆనందింపు మానందింపుము. మే మిపుడు సంతుష్టుల మైతిమి.

చ. కనుబొమ లాడఁగా, విరియఁగాఁ గనుఁదమ్ములు, వేడ్కనీదున
రత్నవలయంబులందు కరతాళ మొనర్చుచు దృష్టి నిల్పి, మా
జనకతనూజ మున్న తనచాతురి మీఱఁగ నాట్య మాడ నే
ర్పనని ను మాతనూభవుని రీతిఁ దలంచెద నో మయూరమా!

ఆహా! తిర్యగ్జంతువులు గూడ స్నేహమార్గ మనుసరించుచున్నవి.

గీ. ఎడనెడను మొగ్గ తొడుగునీకడిమిచెట్టు
ప్రేమతో మున్ను ప్రియురాలు పెంచినదియ

సీ—[నిట్టూర్పువిడిచి కన్నీళ్ళతో] ఆర్యపుత్రుఁడు చక్కఁగాఁ జ్ఞానమాలు పట్టెను

రా—కనుక నే చుట్టమైనయీ కడిమిఁ జేరి
నాతి పెంచిన నెమలి యానంద మొందు

వా—దేవా! ఇది నీవు పూర్వము నివసించినయీ శ్రమస్థానము గావున నిచ్చటఁ గొంచెము సేపు కూర్చుండుము.

రా—అట్లే చేయుదును [కూర్చుండును]

వా—గీ. బాలకదలీవనాంతరవర్తి యిదిగొ
పడఁతి తోడుగ నున్న నీపడకఱాయి
దేవి యిందుండి పచ్చికఁ దిందిచేఁ గాన
హరిణములు నేఁటి కీరాతి నాశ్రయించు.

రా—అబ్బా! నే నిది చూడలేను. [ఏడ్చుచు వేఱుప్రక్కనుఁ దిరిగి కూర్చుండును]

సీ—సఖీ వాసంతీ! ఆర్యపుత్రునకును నాకును దీనిఁ జూపి యేమిప్రయోజనము కావించితివి, అయ్యో! అయ్యో!! అతఁడే యార్యపుత్రుఁడు, అదే పంచవటి, ఆ మెయే నాచెలికత్తెయైనవాసంతి. అవియే యెల్లసవిలాసవిహారములకు సాక్షులైన గోదావరీతీరకానన ప్రదేశములు, అవియే కుమారసమానములైనమృగపక్షిపాదపములు, దురదృష్టవంతురాలనైన నా కిది యంతయు దృగ్గోచరమగుచున్నను శూన్యముగా నున్నది, హా జీవలోక మంతయు నా కిట్లు విపరీతమైనది.

తా—సఖీ జానకీ! రామభద్రుని యవస్థను నీవు గాంచవా?

చ. కనుఁగొనుచున్న నెల్లపుడుఁ గల్వలఁ గేరుశరీరకాంతి నే
ఘనుఁడు నవీనుఁడట్లు మనకన్నులవిం దగుచుండెఁ దొల్లి, య
య్యనఘుఁడు దుఃఖపాండురకృశాంగుఁ డితండొకొ యన్న సంశయం
బున కను వయ్యె, నైనను బ్రమోద మొనర్చుచునుండెఁ జూడ్కికిన్.

సీ—సఖి! చూచుచున్నాను.

తమ—పుత్రీ, మనసు దీర నీప్రియుని జూచుచు సేయుచుము.

సీ—హా దైవమా! ఇకను నన్నెడఁబాయరు, నే నితని విడిచియుందుననియు నెవ రనుకొన్నారు? అందుచే ముహూర్తమాత్రమైనను జన్మాంతరములో నకస్మాత్తుగాఁ గనఁబడినట్లు కనఁబడిన నాప్రియనాథుని గన్నీళ్ళు తెలిపి యిచ్చినపుడెల్ల మనసారఁ జూచుచున్నాను (అని చూచుచుండెను)

తమ—[సస్నేహాశ్రుముగా సీతను గౌఁగిలించుకొని] కుమారీ!

మ. పరమానందవిషాదసంజనిత మహాబాష్పాంబుపూరంబుతో
నురువేగం బయి దీర్ఘమై విపులమై యుత్కృష్టలంబై తమిన్
దొరఁగం జొచ్చిననీదుదృష్టి విలసద్దుగ్ధాబ్ధికుల్యాభమై
చిరకాలంబున కాసతో జలక మార్చెన్ నీమనోనాయకున్.

వా—

చ. అనఘుఁడు రామదేవుఁడు తనంతన వెండియుఁ జూడవచ్చెని
న్వని, దరులార! పువ్వులను బండ్లను నొసంగుచుఁ బూజచేయుఁడీ
యనిలములార! మందగతి నంబుజగంధముతోడ వీవుఁడీ
యనుపమమంజులస్వరములార శకుంతములార! పాడుఁడీ

గా—సఖీ వాసంతీ! ఇటు వచ్చి కూర్చుండుము.

వా—[కూర్చుండి కన్నీళ్ళతో] సుకుమారలక్ష్మణుఁడు కుశలముగా నున్నాఁడా?

రా—[విననట్లభినయించి]

గీ. నీరు పచ్చిక నివ్వరుల్ నెమ్మిఁ గూర్చి
సీత తనచేతులారఁ బెంచినమహీజ
హారిణవిహాగంబులను జూచునపుడు మనసుఁ
గలఁచు విషరసమట్లు వికారమొకటి.

వా.—మహారాజా! లక్ష్మణునికుశల మడుగుచున్నాను.

రా—(తనలో) మహారాజా! యని ప్రేమరహితముగా సంబోధించుచున్నది. కన్నీళ్ళొలుక మాట తొట్రుపడ లక్ష్మణుని కుశల మడుగుచున్నది. దీని బట్టి సీతావృత్తాంత మీమెకుఁ దెలిసినదని తోఁచుచున్నది. (ప్రకాశముగా) ఆఁ కుమారలక్ష్మణుఁడు కుశలముగా నున్నాఁడు.

వా—(ఏడ్చుచు) దేవా! ఏమి? మిక్కిలి క్రూరుఁడ వైతివిగదా!

సీ—సఖీ వాసంతి! ఎందు కిట్లు మాట లనెదవు? ఆర్యపుత్రుఁ డందఱికిని బూజనీయుఁడు, అందును నా చెలికత్తె వగుటచే నీకు మిక్కిలి పూజ్యుఁడు.

వా.-ఉ. నీవు మదీయజీవితము నీవు మదీయనేత్రసుధారసం
బీవు మదీయచిత్తము మదీక్షణచంద్రిక నీవనుంచు సం
భావనచేసి కూర్మిగలమాటల లాలనచేసి చేసి యా
దేవి నొకర్తె ముగ్ధను సఖీ—(మూర్ఛిల్లును.)

తమ—వాక్యసమాప్తియు మూర్ఛయుఁ గూడ నుచితముగా నున్నవి.

వా—ఊ......పయిమాట లిఁకేల చెప్పఁగన్? (నేలఁబడును)

రా—ఊఱడిల్లు మూఱడిల్లుము.

వా—[ఊఱడిల్లి] దేవా! ఎందు కింత పెద్దపని చేసితివి?

సీ—వాసంతీ! ఊరకుండుము.

రా—లోకము సహింప కున్న దని.

వా—కారణ మేమి?

రా—అదేమో! ఆలోకమే యెఱుఁగును.

తమ—చిరకాలమునకు లోకనింద.

గీ. కఠిన! నీ కిష్టము యశస్సు గాదె? యింత
కన్న ఘోరాపకీర్తి వే ఱున్నదొక్కొ?
సీత యే మయ్యెనో వనిఁ జెప్పవయ్య
తెలియదే నేమి తలఁచెదో తెలుపుమయ్య!

సీ—వాసంతీ! నీవే కఠినురాలవు. నీవే క్రూరురాలవు. దుఃఖించు నార్యపుత్రుఁడు మఱింత దుఃఖించునట్లు చేయుచున్నావు.

తమ—కుమారీ! ఆమె స్నేహావిషాదము లామెచే నిట్లు మాట్లాడించుచున్నవి.

రా—వాసంతీ! తలఁచుట కేమున్నది?

చ. ఉరుతరగర్భభారమున కోపక ఘోరవియోగబాధ వం
దురు చొకయేటిలేడివలెఁ దొయ్యలి బెగ్గలి చూచుచుండఁగా
సరసిజనాళమో విమలచంద్రికయో యన నొప్పునామెనుం
దరతనువల్లి నేపులిరో సంజుట నిక్క మటంచు నెంచెదన్.

సీ—హా! ఆర్యపుత్రా! బ్రతికియున్నాను, ఇక్కడనే యున్నాను.

రా—హా ప్రేయసీ జానకీ! ఎక్కడ నున్నావు?

సీ—అయ్యో! ఎఱుఁగనివానివలె నార్యపుత్రుఁడు గూడ గొంతెత్తి యేడ్చుచున్నాడెను.

అయ్యో! ఎంతకష్టము!

తమ—సమారీ! ఇప్పటి కిది నైజమే. దుఃఖములో మునిఁగినవారు తమకడుపులోని

దుఃఖము నెట్లో వెళ్ళఁబుచ్చవలెను గదా!

గీ. గట్లు కెగదాసి సలిలంబు కలఁచునపుడు
చెఱువు రక్షింప గతి తూము తెఱచు టొకటె
ఘనవిషాదంబు హృదయంబుఁ గలఁచునపుడు
దానిరక్షింప నేడుపే తగినమందు.

అందును, బహువిధములఁ గష్టజీవనము చేయుచున్న రామభద్రుఁ డీసమయమున గొంతెత్తి విలపించుట ముఖ్యమే యగును.

ఉ. పూనిక ధర్మతత్పరత భూపరిపాలన మాచరించు, దుః
ఖానల మార్చు జీవము లతాంతము న్వ్యాపమట్లు, ప్రేయసిన్
దా నయి పాయుటన్ గృహమునన్ విలపింపఁగ లేదు, నేఁడు వీ
లైనది యూపి రాడ, నిపు డైన విలాపమ్ము లాభమే కదా!

రా—హా! కష్టము కష్టము.

చ. హృదయము బీఁటవాఱును మఱెందుకు ముక్కలు కాదో? మేనుపె
ల్లదరుచు మూర్ఛఁ జెందు విడనాడదు తెల్వినదేమొ? దేహమున్
బొదిగొని కాల్చు దుఃఖశిఖ, బూడిదచేయ దదేమొ? మర్మముల్
వదలక కోయునట్టివిధి ప్రాణము తీయ దదేమిపాపమో?

ఓపౌరజానపదులారా! మహాత్ములారా

ఉ. జానకి యింట నుండుట యసమ్మతమయ్యెను మీకుఁ గావునన్
గానఁ దృణంబుమాడ్కి విడనాడితి మీ కపుడైన జాలి యిం
తేనియుఁ బుట్టెనే? మది దహించెడు నప్పటిభావముల్, దయా
హీనుఁడ దిక్కులేక యిపు డేడ్చెద మీర లనుగ్రహింపుఁడీ!

వా—(తనలో) కోపాతిశయమును వెల్లడించుట మిక్కిలి గంభీరముగా నున్నది.
(ప్రకా) దేవా! గతించినదానికి విచార మేల? ధైర్యము తెచ్చుకొనుము.

రా—సఖీ! ధైర్య మని చెప్ప నేల?

గీ. జానకీశూన్య మైనట్టిజగతి కిపుడు
వఱలుచున్నది ద్వాదశవత్సరంబు,
ఆమెపేరును మాసిన ట్లయ్యెఁ గాని
బ్రతికి యుండక పోలేదు రాఘవుండు.

సీ—ఆర్యపుత్రుని యీమాటలచే నాకు మూర్ఛ వచ్చుచున్న ట్లున్నది.

తమ.—అమ్మా! నీవన్నమాట నిజము.

గీ. ప్రియము లనురాగసిక్తముల్ విరహదుఃఖ
కఠినములు నివ్వి మాటలు కావు సుమ్మ,
విమలమకరందధారలే విషముఁ గూడి
కురియుచున్నవి నీమీఁదఁ గోమలాంగి!

రా—వాసంతీ! ధైర్యము లే కేమి? గూడు—

గీ కాల్చి గ్రుచ్చినశల్యంబుకరణి, విషము
పూసి నాటినదంతంబుపోల్కిఁ, దీవ్ర
మగుచు హృదయంబుమర్మముల్ తెగనఱకెడి
దుఃఖకీలంబు నోర్చుకొందును గదమ్మ!

సీ—నేను వట్టినిర్భాగ్యురాలను. ఎప్పటి కపుడే యార్యపుత్రున కాయాసము గలిగించు
చున్నాను.

రా—ఇట్లే శ్రమపడి నాహృదయము నెట్లో యణఁచుకొనుచున్నను, పరిచితవస్తువులను
జూచుటచే నిపు డావేగము కలుగుచున్నది. ఎట్లనఁగా?—

చ. సరగున హద్దును దాఁటి కలుషం బయి ఘూర్ణిలి పొంగి పొంగి పై
పొరలెడి దుఃఖ మాఁపుటకుఁ బూని యొనర్చెడి యత్నమెల్ల స
త్వరగతిఁ ద్రొక్కి వచ్చె నతిదారుణచిత్తవికార మొంచు, భీ
కరముగఁ బొంగు నే ఱసుకగట్టును జీలిచి వచ్చునైకె వడిక్.

సీ—అడ్డులేక దారుణవేగముతోఁ బొంగి పొరలుచున్న యార్యపుత్రుని మహాదుఃఖముచేఁ దనదుఃఖము తిరస్కరింపఁబడినట్లుగా నాహృదయ మేమో మొద్దువాఱి యున్నది.

వా—(తనలో) కష్టము కష్టము. రాజు మిక్కిలి గాఢవిచారమున మునిఁగిపోవుచున్నాఁడు. ఇపు డీతనిదృష్టి మరల్చుట యుచితము. (ప్రకాశముగా) దేవా! చిరపరిచితములైన యీజనస్థానభాగములను జూచి మన్నింపుము.

రా—సరే కానిమ్ము. [ఇద్దఱును లేచి పరిక్రమింతురు.]

సీ—ప్రియసఖి తలపెట్టిన వినోదనోపాయము దుఃఖము నింకను బ్రజ్వలింపఁజేయు ననియే తలంచెదను.

వా—[సవిచారముగా] దేవా! ము న్నొకనాఁడు—

ఉ. ఈపొదరింట నుంటివి మహీసుత వచ్చెడిత్రోవ చూచు చీ
వాపెయు గౌతమీపులినమండలిహంసలఁ జూచి చూచి రా
నోపక వచ్చి కోపపడుచున్నటు లుండిననిన్నుఁ జూచి నీ
కోపము దీర్పఁగా జలజకోశసమాంజలి యెత్తి మ్రొక్కదే?

సీ—వాసంతీ! ఎంత కఠినురాల వైతివే! హృదయమర్మంబుల నాటుకొనియున్న శల్యమును గదల్చునట్టి యీపూర్వవృత్తాంతములు తెల్పి దురదృష్టవంతురాల నైన నన్నే యార్యపుత్రుఁడు స్మరించునట్లు చేయుచున్నావా?

రా—చండీ జానకీ! ఇటు నటుఁ గనఁబడుచున్నావు కాని యనుగ్రహింపకున్నావు.

శా. హా దేవీ! జగమెల్ల శూన్య మగు, దేహాంగంబు లూటాడు, ను
న్మాదం బెత్తి మహాంధకారమున మగ్నం బయ్యె జీవాత్మయున్
భేదిల్లున్ హృదయంబు, మూర్ఛ యలమెన్, దీండ్రించె దుఃఖాగ్ని; హా!
హా! దీనుండను మందభాగ్యుఁడను జేయంజాల నే నేమియున్.

[అని మూర్ఛిల్లును]

సీ—అయ్యయ్యో! ఆర్యపుత్రుఁడు మరల మూర్ఛిల్లె.

వా—దేవా! ఊఱడిల్లుము. ధైర్యము తెచ్చుకొమ్ము.

సీ—హా నాథా! పాపజన్మమైన నన్నుఁ గూర్చి సకలలోకశ్రేయస్కర మయిన నీజన్మలాభము మఱిమఱియు జీవసంశయంబు గలిగించు దారుణావస్థపాలగు చున్నదిగదా. హాదైవమా! చచ్చిపోయినాను. [అని మూర్ఛిల్లును.]

తమ—బిడ్డా! ఊఱడిల్లుము. ధైర్యము నొందుము. మరల నీపాణిస్పర్శమే రామభద్రునకు సంజీవనోపాయము. లెమ్ము.

వా—హా! ఇప్పటికిని నిట్టూర్పు రాకున్నది. హా సీతా! ఎక్కడ నున్నావు? వచ్చి నీప్రాణనాథుని బ్రతికింపుము.

సీ—[తొందరతో లేచివచ్చి రామునిహృదయమును లలాటమును స్పృశించును]

వా—అమ్మయ్యా! ఇప్పటికి రామభద్రునకుఁ దెలివి వచ్చినది.

రా-గీ. అంగముల నెల్ల నమృతంబు నలఁదినట్లు
బ్రతుకఁ జేసి మహాద్భుతస్పర్శ మొకటి
విస్మయానందసంభవావేశ మైన
యన్యమోహంబు గలిగించునట్లు లుండె.

[ఆనందముతోఁ గన్నులు మూసికొని] సఖీ వాసంతి! నీయదృష్టము మంచిది.

వా—ఎందుచేత?

రా—వేఱే యే మున్నది? జానకి వచ్చినది.

వా—ఏది? రామభద్రా! జానకి యెక్కడ?

రా—[స్పర్శసుఖ మభినయించి] చూడు మిదిగో! ఎదుటనే యున్నది.

వా—రామభద్రా! సఖీవిపత్తిచేఁ బుట్టిన దుఃఖాగ్నియే నన్నుఁ గాల్చివేయుచుండఁగా నాయువుపట్లు పొడుచునట్టి దారుణమైన యీపలవరింతలచే నీవు కూడ నన్ను దహించెదవా?

సీ—దాఁటి పోవలెనని యనుకొనుచున్నాను గాని, నాదీర్ఘదారుణసంతాపమును జల్లార్చునట్టి చిరకాలస్నేహశీతలమైన యార్యపుత్రుని స్పర్శముచే వజ్రలేపము చేసినట్లుగా నాచేయి యంటుకొని కదలి యూడి రాకున్నది.

రా—సఖీ! పలవరింత యెక్కడ?

చ. పరిణయ కాలమందు మును పట్టిన (1) కంకణధారి యేసుధా
కరకిరణాళిశీతలశికస్వరకాంతి ముదంబు గూర్చెనో-

[1] ఈ విశేషణములు రెండును సీతాహస్తమునకును రామునకును సమానముగా నన్వయించును.

సీ—నాఁడట్లు ముదంబు గూర్చిన సౌభాగ్యపుతుఁడవే యిప్పటినీవు.

రా- అరయఁగ సాటి దేసికిఁ దదన్యకరంబగు నట్టిజానకీ
సురుచిరహస్తపల్లవము చూడు నిజంబుగ నేను బట్టితిఁ.

[అని సీతాహస్తమును గ్రహించును]

సీ—అయ్యో! ప్రియనాథుని దాఁకుటచే మోహపడి పొరపాటు చేసినాను.

రా—వాసంతి! ప్రేయసీస్పర్శసంజనిత మైన శృంగారభయముచే నానందమగ్నమై నాయొడలు పరవశ మగుచున్నది. ఈచెయ్యి నీవు కూడఁ బట్టుకొనుము.

వా—అకటా! నిజముగా నిది యున్మాదమే.

సీ—[తత్తఱపడి చే యూడఁదీసికొని వెళ్ళును.]

రా—అయ్యో! ప్రమాదము! కరకరమునుండి కరిణీకరము జాఱినట్లుగాఁ బొరపాటుగా నున్న నా చేతినుండి యామెచేయి జాఱిపోయినది.

సీ—అబ్బా! దుఃఖభయములచే మిక్కిలి కలఁగిపోయిన నాహృదయ మిప్పటికిని గుదుటఁ బడకున్నది.

తమ—[సస్నేహ కౌతుకస్మితముగాఁ జూచి] అమ్మా సీతా!

గీ. మగనిఁ దాఁకినసుఖముచే గగురుపాటు
చెమట కంపంబు గదురునీవిమలతనువు
గాలిఁ గదలుచు వానచుక్కలకుఁ దడిసి
మొగ్గ దొడిగినకడిమి సొంపును వహించె.

సీ—[తనలో] హృదయము పరవశ మగుటచేఁ గదా తమసాదేవిమాటలకు సిగ్గుపడవలసివచ్చినది. ఈ పరిత్యాగమును, ఈ యాసక్తిని గూర్చి యీమె యిపుడే మనుకొనుచున్నదో!

రా—[నలుదిక్కులు కలయఁజూచి] హా, లేదు. సీత లేదు. ఓనిర్దయురాలా సీతా,

సీ—నిజముగా నేను నిర్దయురాలనే. ఇట్టియవస్థలో నున్ననిన్నుఁ జూచుచు జీవించియున్నాను.

రా—హా దేవీ, ఎక్కడున్నావు? అనుగ్రహింపుము. ఇట్టిదశలో నున్ననన్ను విడిచి వెళ్ళుట తగదు.

సీ—ఆర్యపుత్రా, నీమాట విపరీతముగా నున్నది.

వా—దేవా, విచారపడవద్దు. లోకోత్తర మైన ధైర్యముచే మహాదుఃఖమున మునిఁగిన నిన్ను నీవే లేవనెత్తుకొనుము. సీతా సీతా యనెదవు. సీత యిచ్చటి కెక్కడనుండి వచ్చును.

రా — నిజముగా సీతలేదు. ఉన్నయెడల వాసంతిచూడదా? — ఇది స్వప్నమా? - నేను నిద్రింపలేదే! — రామునికి నిద్రయెక్కడిది? అన్నివిధముల మహాశక్తిసంపన్నమై పలుమాఱు పలు తెఱంగుల సిద్ధమగుచున్న భ్రాంతియే నన్నిపుడత్యంత మాశ్రయించుచున్నది

సీ — క్రూరాత్మురాలనై యార్యపుత్రుని మోసపుచ్చినాను

రా — దేవా! చూడు చూడు.

చ. ఇదె మును పాజటాయువు మహిం బడగొట్టినపంక్తికంఠుతే,
రదియె తదీయవాహనఖరాస్థిచయుం, బివి రావణుండు దు
ర్మదమునఁ గూల్చినట్టిఖగమాన్యునిఱెక్కలగూళ్ళు, వియ్యదా
స్పదఘనభంగిఁ బై కెగసె జానకితో సురవైరి యిచ్చటన్.

సీ — [భయముతో] ఆర్యపుత్రా! ఈ దురాత్ముఁడు పూజ్యుఁ డైనజటాయువును జంపుచున్నాఁడు, నన్నపహరించుచున్నాఁడు. రక్షింపు రక్షింపు.

రా — [తొందరతో లేచి] ఒరిపాపీ! తాతప్రాణసీతాపహారీ! ఉండు ముండుము.

వా — దేవా సకలరాక్షసాంతకా! ఇప్పటికిని నీవు కోపింపఁదగినవిషయ మున్నదా?

సీ — ఆహా! భ్రాంతిగదా?

రా — ఔను. తడఁబడుచున్నాను. ఇది మునుపటి యాపత్తుగాదు, క్రొత్త, మఱియొకవిధమైనది.

ఉ. వానరసేన గూర్చుకొని వారిధి దాఁటి విచిత్రమైనక
య్యానకు లోక మద్భుతము నందఁగ రావణుఁ గూల్చుదాఁక ము
న్నైనవియోగ మోర్చుకొననయ్యె, ననంతము ఘోరమైనయీ
జానకివిప్రలంభ మిఁకఁ జచ్చెడిదాఁక సహింప నయ్యెడిన్.

సీత — పూర్వవిరహమున బహుమానభాజన మైతినిగాని యిప్పటివిరహ మనంతమను టచే నిరాశురాల నైతిని. హా దేవా! దురదృష్టవంతురాలను, అయ్యో.

రా — హా, హా, కష్టము కష్టము. హా దేవీ!

ఉ. వానరరాజుమైత్రియును వానరశౌర్యము నప్రయోజనం,
బౌనలజాంబవంతులసహాయ మనర్థక, మాంజనేయును
ద్యానము పోల్లు, లక్ష్మణునియస్త్రమహత్త్వ మనర్థకంబు, నో
జానల నెక్కడుంటివో? యికం గనఁజాలను హా సతీమణీ!

సీ—పూర్వవిరహము నెంతయు గౌరవించుచుండెను.

రా—వాసంతీ! రామదర్శనము మిత్రజనమున కెంతయు దుఃఖదాయకమే యగును ఎంతసేపు నిన్నేడిపింతును? కావున నే నిఁకఁ బోయెదను. సెలవిమ్ము.

సీ—[దుఃఖావేగముతో తమసను గౌఁగిలించి] హా, భగవతీ! ఆర్యపుత్రుఁ డరుగు చున్నాఁడు. ఏమి చేయుదును?

రా—బిడ్డా! శాంతింపుము విచారింపకుము. వనము కూడఁ జిరంజీవు లయిన కుశలవుల ద్వాదశవత్సరపూర్తిమహోత్సవ మొనరింప భాగీరథీదేవి దగ్గఱకుఁ బోవుదము.

సీ—అమ్మా! క్షమింపుము. దుర్లభదర్శనుఁడైన ప్రాణనాథుని మఱియొక్క నిమిష మైనఁ జూచెదను.

రా—అశ్వమేధ మొనరింప నాకిపుడు సహధర్మచారిణి కలదుసుమీ?

సీ—[సాక్షేపముగా] ఆర్యపుత్రా! అది యెవతె?

వా—హా! పెండ్లియాడితివా?

రా—లేదు లేదు. బంగారు సీతాప్రతిమ—

సీ—[కన్నీరు విడిచి నిట్టూర్పుతో] ఇపుడు నీవు నిజముగా నార్యపుత్రుఁడవు నా మనస్సులోని విరహదుఃఖశల్యము నిపుడు నిజముగా నూడఁదీసితివి

రా—అశ్రుబిందువు లొలుకు నాకన్ను లాబొమ్మను జూచియే తృప్తిపడును.

సీ—ఆ ప్రతిమయే ధన్యురాలు. ఆహా! ఆమె యార్యపుత్రుని సంతోషపెట్టుచున్నది. ఆర్యపుత్రుని గౌరవమందుచున్నది. ప్రియనాథుని జీవితాశకు హేతువైన యామెయే లోకమున కంతకును జీవితాశాబంధన మగుచున్నది.

తమ—[సమందహాసస్నేహబాష్పముగాఁ గౌఁగిలించి] బిడ్డా! నిన్ను నీవే పొగడుకొనుచున్నావు.

సీ—[సిగ్గుతోఁ దనలో] తమస పరిహాసము చేయుచున్నది.

వా—దేవా! నీవు మాయెడఁ గలయనుగ్రహమువలన నీసమావేశము తటస్థించినది. ఇదియే మాకు మహాప్రసాదము. ఇఁకఁ గార్యహాని కలుగకుండఁ బురమున కేగుటయే యుత్తమము.

రా—అట్లే చేసెదను.

సీ—వాసంతి నాకిపుడు ప్రతికూలురాలైనది.

తమ—అమ్మా! మనము పోవుదము గమ్ము.

సీ—అట్లే చేయుదము.

తమ—నీ వెట్లు రాఁగలవు?

గీ. అధికతరతృష్ణచే మనోహరుని మేన
గట్టిగా నాటుకొన్న నీగాఢదృష్టి
హృదయమర్మంబులను గత్తిరించుపూని
నూడఁదీయుచు నుంటి వోయుత్పలాక్షి!

సీ—పుణ్యాత్ములకు దర్శనీయము లైన యార్యపుత్రుని పాదపద్మములకు నమస్కారము. (అని మూర్ఛిల్లును.)

తమ—అమ్మా! ధైర్య మవలంబింపుము. శాంతింపుము.

సీ—(ఊఁఱడిల్లి) మబ్బునడుమ నున్నపూర్ణచంద్రు నెంతసేపు చూడఁగలము?

తమ—ఆహా! కథానిర్మాణ మెంతయాశ్చర్యకరముగా నున్నది?

గీ. కరుణరస మొక్కటే వేఱుకారణముల
వేఱువేఱువిధంబుల మాఱుచుండు
సలిల మొక్కటె బిందుతుషారభంగ
బుద్బుదావర్తరూపముల్ పొందునట్లు.

రా—విమానరాజమా! ఇట్టిటు—

[అందఱు లేచుచున్నారు]

వాసంతి—[రామునిగూర్చి]—తమస—[సీతనుగూర్చి]

గీ. వంశకర్తయు వేదప్రవక్త యైన
సూర్యుఁడు నరుంధతీవసిష్ఠులును మఱియు
ధరణి జాహ్నవి మావంటి తాపసులును
శ్రేయ మొనగూర్చి నిన్ను రక్షింతురు గాత.

[అందఱు నిష్క్రమింతురు] ఇది తృతీయాఙ్కము.

# ఉత్తరరామచరిత్రనాటకము

## చతుర్థాఙ్కము.

[తరువాత నిద్దఱు మునిశిష్యులు ప్రవేశింతురు]

ఒకఁడు—సౌధాతకీ! ఇపు డీయతిథులు వచ్చుటచే మన వాల్మీకిమహర్షిగారి యాశ్రమ మెంతరమణీయము గానున్నదో చూడు.

చ. అలమగలేడి యిప్పు డిపు డక్కడ యీనినలేడి త్రాగఁగా
నిలిచిన వేఁడి తీపియగు నివ్వరిగంజిని ద్రాగుచుండె, జి
హ్వలఁ జవులూరఁ జేసెడిఘృతాన్నసుగంధము రేఁగుపండ్లతో
గలిసినకూరవండుతఱిఁగ్రైడి కమ్మనితావి వచ్చెడిన్.

సౌ— దాండాయనా! అనధ్యయనకారణము లైన యీతెల్లగడ్డాలకు స్వాగతము—

దాం— (నవ్వి) ఓరీ! పెద్దవారిని జూచి సంతోషించుటకుఁ గ్రొత్తకారణము చక్కఁగాఁ గనిపెట్టినావురా!

సౌ—(నవ్వుచు) ఆఁడువాళ్ళను కట్టుకట్టుకొని మోసికొనివచ్చిన ముసలితాతయ్యగా రెవరురా?

దాం—ఛీ పశువా! ఆపనికిమాలిన నవ్వేమిటి? ఆయన యెవ రనుకొన్నావు? వసిష్ఠమహాముని గారు, ఋశ్యశృంగాశ్రమమునుండి వచ్చుచున్నారు. ఆయన వెనుకవచ్చినవారిలో మొదటియామె వసిష్ఠులవారిభార్య అరుంధతీదేవిగారు, ఆమెతో నున్నవారు దశరథమహారాజుగారిభార్యలు కౌసల్యాకైకేయీసుమిత్రలు. తెలియకుండఁగాఁ బేలుచున్నావు సుమీ!

సౌ—ఊఁ. వసిష్ఠులవారా?

దాం—అవును.

సౌ—ఆలాగా? ఏదో పెద్దపులి యనుకొన్నాను.

దాం—ఆఁ. ఏ మన్నావు? ఎందు కట్లు తోఁచినది?

సౌ — పాపము! ఆయన రాఁగానే పుల్లావుపెయ్యను బలాత్కారముగా మడమడ మనిపించినారు.

దాం — "సమాంసో మధుపర్కః" యన్నధర్మశాస్త్రమునుబట్టి గృహమేధులు తమ యిండ్లకు వచ్చిన శ్రోత్రియులైనయభ్యాగతుల కావుపెయ్యమాంసమునో బలిసిన యెద్దుమాంసమునో వండి పెట్టుట యాచారము. అది యుత్తమధర్మమని సూత్రకారులు చెప్పుచున్నారు.

సౌ — మఱి దొరకినావురా!

దాం — ఎట్లు?

సౌ — వసిష్ఠులవారు వచ్చుటకుఁ గొంచెము ముందుగా వచ్చిన రాజర్షియైనజనకునకు మనగురువుగారు తేనెపెరుగులు కలిసినమధుపర్కముమాత్రమే సమర్పించినారు. ఆవుపెయ్యను ముట్టుకోలేదు.

దాం — మాంసాహారము విడిచినవారికిఁ గల్పము చిత మని కొందఱ న్నారు. జనకమహర్షి మాంసపరిత్యాగి.

సౌ — ఎందుచే?

దాం — అతఁడు సీతాదేవికి సంభవించినఘోరమైనయాపత్తు విని వానప్రస్థుఁడై చంద్రద్వీపతపోవనములోఁ దపస్సు చేయుచు నిట్టే పెక్కేండ్లు గడపెను.

సౌ — అందుండి యిచ్చటి కెందుకు వచ్చెను?

దాం — చిరకాలప్రియమిత్రుఁడైనవాల్మీకిమహర్షిగారిని జూచుటకు —

సౌ — ఇపు డితనివియ్యపుగాండ్రు, ఇతనిని జూచినారో లేదో తెలిసినదా?

దాం — "నీవు స్వయముగా వచ్చి జనకమహర్షిని జూచి యాదరింప వలసిన" దని కౌసల్యతోఁ జెప్పుటకు వసిష్ఠులవారిపుడే యరుంధతీదేవిని బంపినారు.

సౌ — ఈముసలివా రందఱు కలిసినట్లుగా, మనము గూడఁ దక్కిన బ్రహ్మచారులతోఁ గలిసి యనధ్యాయమహోత్సవము నాటలతో వెళ్ళఁబుత్తము. సరే కాని ఇపుడు జనకుఁ డెక్కడ నున్నాఁడు?

దాం — వాల్మీకివసిష్ఠులను సేవించి వచ్చి యాశ్రమమువెలుపల నున్న చెట్టుమొదట కూర్చున్నాఁడు.

క. చిరముగ మది నాటిన కూఁ
తురివిరహముచే జనించు దుఃఖాగ్నిని గో
టరగతవహ్నిఁ బురాతన
ధరణీజముపోల్కి నతఁడు తపియింపఁ బడున్.

(అని నిష్క్రమింతురు) ఇది మిశ్రవిష్కంభము.

[పిదప జనకమహర్షి ప్రవేశించును]

జ.—చ. తనయకు వచ్చినట్టియతిదారుణ పాపవిపత్తి విన్ననా
మనమును బుంజుచేసినయమర్షవిషాదమునన్ జనించి నూ
తనగతి నేఁటికిన్ సునిశితం బగుకోపము వాఁడిఱంపమ
ట్లనయము కోయుచున్నది హృదంతరసీమలు, తగ్గదంతయున్.

ఈ వప్ప నలవికాని దుఃఖమును వార్ధకమును దిగఁగేయుచున్నను, కష్టసాధ్యములైన కృచ్ఛ్రచాంద్రాయణాది వ్రతము లాచరించి శరీరధాతువు లెండించుకొన్న నాపాపపుదేహము నిరాలంబమయ్యు నిప్పటికిని నశింపకున్నది గదా! పోనీ! వచ్చి పోదమన్న నాత్మహత్య చేసికొన్న నా గంధతామిస్రము లయినయసూర్యనామ నరకలోకములకుఁ బోవుదు రని ధర్మశాస్త్రవేత్త లయిన మునీశ్వరు లిట్లు చెప్పుచున్నారు.

"అసూర్యా నామ తేలోకా అంధేన తమసా వృతాః
తాంస్తే ప్రేత్యాభిగచ్ఛంతి యే కే చాత్మహనో జనాః"

ఇప్పటి కనేకసంవత్సరములు గడచినను, నిరంతరచింతచే నెప్పటి కప్పుడే నవీన మగుచు నాదుఃఖావేగము శాంతింపకున్నది. ఓతల్లీ దేవయజనసంభవా సీతా! నీజన్మఫల మిట్లున్నది. సిగ్గుచే యథేచ్ఛముగా నేడ్చుటకుఁ గూడ వీలు గాకున్నది. హా కుమారీ!

చ. కలకలనవ్వు చొక్కపరి, కావున నేడ్చుచు నొక్కసారి, యిం
పులు దులకించు కొన్నిపలుమొగ్గలకాంతులు పర్వ ముద్దుగన్
దెలియనిపల్కులన్ బలుక నేర్చిననీపసిపిన్ననాఁటికో
మలవదనారవింద మిదె మానసదర్పణగోచరం బగున్.

భగవతీ వసుమతీ! నీవు నిజముగాఁ గఠినురాలవే.

చ. ఎఱుఁగుదు రగ్నిజాహ్నవి మునీంద్రు లరుంధతియున్ వసిష్ఠభా
స్కరులును జానకీమహిమ, కాంచితి వామెను వాణి విద్యన
ట్లెఱుఁగవె నీవు? పావకపరీక్ష జగద్విదితంబు గాదె! కూఁ
తురు పడినట్టిదుఃఖ మపదూఱును నీ వెటు లోర్చినావొకో?

(తెరలో తల్లులారా! ఇటు రండు.

జన—కంచుకివలన గారి తెలిసికొని వచ్చుచున్న యీమె యరుంధతీదేవి. ఈ రెండవ

మహాదేవియో—(పరీక్షించి చూచి) హా! ఈమె దశరథమహారాజధర్మపత్ని యైన కౌసల్య. నాప్రియసోదరి. అకటా! ఈమె యీమె యని యెవఁ డానవాలు పట్టఁగలఁడు?

ఉ. ఈమె వసించె ముద్దశరథేశ్వరునింటను లక్ష్మిసాటిగా,
సామెత యేల? లక్ష్మియె నిజంబుగ, హావిధి! రాణి ఘోరచిం
తామయమూర్తియై యిటులు దైవవశంబున మాఱిపోయె,నా
హా! మహనీయదైవగతిఁ బ్రాణియవస్థలు మాఱ కుండునే?

గీ. తొల్లి నాకన్నుఁ గవ కీమె తోఁచుచుండెఁ
దనువు దాల్చినయామహోత్సవ మనంగ
నీమెదర్శన మిప్పుడు సహింపరాక
పుండుపై నుప్పు చల్లిన ట్లుండె నకట!

(పిదప నరుంధతి కౌసల్య కంచుకి ప్రవేశింతురు.)

అరు—స్వయముగా వెళ్ళి వియ్యంకుని బలుకరింపవలె నని మాగురువుగారి యాజ్ఞ. అందుకే గదా నీవద్దకు నేను వచ్చినాను. అట్టియెడ మాటిమాటికి సందేహ మెందుకు?

కంచు—అమ్మా! మనస్సు గట్టిచేసికొని వసిష్ఠులవారిసెలవుప్రకారము చేయవలసిన దని నామనవి—

కౌస ఇట్టిసమయములో జనకచక్రవర్తిని జూడవలసి వచ్చినదిగదా యని దుఃఖము లన్నియు నొక్కుమాఱుగాఁ బైకి వచ్చుచున్నవి. అందుచే జాఱిపోయినమూల బంధము గలనాహృదయ మూఁపుకొనఁ జాలకున్నాను

అరు—ఈవిషయమున సందేహ మేమి?

గీ. ముఖ్యబంధువియోగసంభూత మైన
నరులదుఃఖంబు లెప్పుడుఁ దొరఁగుచున్నఁ
బ్రాణమిత్రుండు కనఁబడినప్పు డవ్వి
హెచ్చి వేవాఁగులఁ బ్రవహించుఁగాదె!

కౌస—అడవిపా లయినయనుఁగుఁగోడలి తండ్రికి రాజర్షియైన జనకునకు నామొగ మెట్లు కనఁబఱుతును?

అరు-క. ఘనయాజ్ఞవల్క్యముని యె
వ్వని కుపదేశించె బ్రహ్మపారాయణ మా
జనకకులోద్భవుఁ డగునీ
జనకుఁడు మీఁ పొగడఁదగిన సంబంధి యగున్.

కౌస—ఆమహారాజునకుఁ బ్రాణమిత్త్రుఁడును, కోడలికిఁ దండ్రియు నైన సీరధ్వజుఁ డితఁడే. హా! నిర్విచారము లైనరాజభోగము లెపుడు తలఁపునకు వచ్చుచున్నవి. హా దేవా! ఇదంతయు శూన్యము.

జన—భగవతీ! అరుంధతీ! సీరధ్వజుఁడు నమస్కరించుచున్నాఁడు.

చ. గురువులకున్ గురుండు నతిఘోరతపోనిధి నీదుభర్త నీ
పరిచితిఁ బావనుండ నని భావనచేయు, జగత్త్రయంబు భా
స్వరముగఁ జేయునాయుదయసంధ్యను బోలినతల్లి! నీకు నే
శిరమును నేల మోపి యిరుచేతులు మోడ్చి నమస్కరించెదన్

అరు—అక్షరం బగుజ్యోతిస్సు వెలయుఁ గాక. సృష్టిస్థితికారణుండై యంతటఁ బ్రకాశించుచుండు పరుఁ డగుపరమాత్ముఁడు నిన్నుఁ బవిత్త్రుని జేయుఁ గాక.

జన—ఆర్యగృష్టీ! ఈప్రజాపరిపాలకులతల్లిగారి కారోగ్యమా?

కంచు—(తనలో) ఇది మాకు సంపూర్ణమైనగట్టి దూషణము. (ప్రకా) రాజర్షివర్యా! ఎంతకాలముక్రిందటనో రామభద్రుని జూచి యిట్లుదుఃఖించుచున్న యీదేవి నిట్టికోపముచే మఱింతదుఃఖపెట్టుట యర్హము కాదు. పౌరజానపదులలో నతినింద్యమైనకింవదంతి వ్యాపించుటచేతను నీచమతు లగువా రగ్నిశుద్ధిని విశ్వసింపకపోవుటచేతను రామభద్రుఁ డిట్లు దుర్భాగ్యముపాలై దారుణకర్మ మొనరించెనుగాని వేఱు కాదు.

జన—(రోషముతో) మావంశములోఁ బుట్టినపరిశుద్ధురాలయినసీత కగ్నిశుద్ధి యనఁగా నేమి? అకటా! రామభద్రుఁడా చేసినయవమానమునకుఁ దోడై యీలోకుల మాటలు మఱిమఱియు మా కవమానము గలిగించుచున్నవి.

అరు—(నిశ్వసించి) అవును నిజమే. 'అగ్ని' యనెడి యక్షరములు, సీత, యనునక్షరములదగ్గఱ మిక్కిలి తేలిక యగును. సీత యనుటయే యన్నివిధములఁ బరిపూర్ణమైనది. హా వత్సా సీతా!

ఉ. బాలిక శిష్యురా లనెడిభావన కేమి? పవిత్ర మైననీ
శీలము నాకు నీయెడ విశేషపుభక్తిని గూర్చుఁ, గాంతవున్
బాలిక వయ్యు నీ వఖిలవంద్యవు గావె? గుణాఢ్యులందు స
చ్ఛీలమువంద్య, మట్లుపయిచిన్నెలు ప్రాయముఁ గా వొకప్పుడున్.

కౌస—అయ్యో! దుఃఖములు నాప్రాణా లూడఁదీయు చున్నవి.

(మూర్ఛిల్లును.)

జన—అయ్యో ఏమిది ?

అరు—రాజర్షీ ! వేఱే యేమున్నది ?

ఉ. ఆనర పాలుఁ డాదినము లాసుఖ మాపసిపిల్ల లంతయున్
ధ్యానపథంబుఁ జొచ్చెఁ బసిమాప్తుని నిన్నిటఁ జూచినంతనే,
దానిభయంకరం బయినదైవికదుర్దశ మున్గి మూర్ఛలన్
గానఁగఁ బువ్వుకంటెఁ గులకాంతలచిత్తము మెత్తనౌఁ గదా.

జన.—అకటా! చాలాకాలమునకుఁ గనఁబడిన నాప్రియస్నేహితుని ప్రియసతి యగు
కౌసల్యను శత్రువువలెఁ జూచి యన్నివిధముల ఘాతుకుఁడ నైతిని.

మ. అతఁడే నాప్రియమిత్రుఁ డుత్తముఁడు వియ్యంకుండు చిత్తంబు జీ
వితసాఫల్యము మోద మీయొడలు భావింపంగ జీవంబు నీ
యితరంబేని ప్రియం బదే యతఁడు, భూమీందుప్రిండు రాజశ్రీ
హితుఁ డాపంక్తిరథుండు పుణ్యనిధి నా కేమేమి కాఁ డెన్నఁగన్.

అకటా! ఈమెయే యాకౌసల్య—అహా! కౌసల్యాదశరథులు —

చ. ఇరువురు వేఱువేఱ వచియించుచు నాకు రహస్యభాష లొ
క్కరిపయి నేర మొక్కరధికంబుగ మోపెడివేళ వార లి
ర్వురమది తేఱుటో యలుక పూనుటయో యది నాయధీనమై
పరగె, నిఁ కేల హా! కడుపు భగ్గున మండుచు దానిఁ దల్పఁగన్.

అరు—కటకటా ! చాలాసేపటినుండి నిశ్వాసము నిలిచిపోవుటచే నీమెహృదయ
మాడకున్నది.

జన—హా ప్రియసోదరి! (కమండలూదకము చల్లును.)

కంచు—మొదట దైవంబు మిత్రునిపోల్కి నొక్క
కరణి సుఖ మిచ్చు ననుకూలగతిని జూపి,
యసమయంబున దారుణ మగుచుఁ బిదప
వెనుకకును మళ్ళి హృదయపీడన మొనర్చు.

కౌ—(నిట్టూర్పు విడిచి) హా వత్సా జానకీ! ఎందున్నావు? అమ్మా! క్రొత్త పెండ్లికూఁతుర నైననాఁటిలక్ష్మీప్రద మైననీముఖపద్మమును దలఁచుచున్నాను. ఓ శరచ్చంద్రచంద్రికాసుందరాంగీ! రమ్ము. మరల నా తొడమీఁదఁ గూర్చుండుము. "జానకి రఘువంశమహాత్ములకుఁ గోడలు కాని మనకుఁ గూఁతురే" యని మామామగారు సర్వదా యనుచుండెడివారు.

కంచు—ఔను. దేవి సెల విచ్చినమాట నిజము.

గీ. ఐదుగురిఁ గన్నవాఁడైన నావిభునకు
రామభద్రునిమీఁదనే ప్రేమ మెండు
మఱియు నలుగురు కోడళ్ళమాట చూడ
జనకసుతమీఁదఁ బ్రేమ మాయనకు మెండు.

జన— హా ప్రియసఖా! దశరథమహారాజా! అన్నివిధముల నాకువన్నె కెక్కినట్టి నిన్నెట్లు మఱవఁగలను?

ఉ. కన్నియతల్లిదండ్రు లధికంబుగ నల్లునియాప్తబంధులన్
మన్ననచేయుచుందు, రది మాయెడనో విపరీత మయ్యె నీ
మన్ననఁ నట్టినిన్ను మనమైత్రికిఁ గారణ మైనసీతఁ దా
నెన్ని హరించెఁ గాల మిసి యీబ్రతుకేటికి ఘోరభూమిలో.

కౌస—జానకీ! ఏమి చేయుదును? వజ్రలేపమున బిగిసినట్లుగా నిర్భాగ్యురాల నైన నాపాడుజీవనము నన్ను విడువ కున్నది.

అరు—రాణీ! ఊఱడిల్లుము. అదే పనిగాఁ గంట నీరు పెట్టుకొనకు. అది గాక ఋశ్యశృంగాశ్రమమున మాగురువుగారు చెప్పినమాట మఱచినావా యేమి? "తప్పనిసరి యగుటచే నిది యిప్పటి కిట్లు జరిగినది కాని తుదకు శుభప్రదము కాఁగల"దని వారు సెలవియ్యలేదా?

కౌస—అన్నికోఁక లడుగంటిన నా కట్టియదృష్టము పట్టునా?

అరు—అట్లయిన, రాణీ! మాగురువులమాట యసత్య మనుకొనుచున్నావా? అట్లాగా

చింపఁగూడదు సుమీ!

గీ॥ ఆత్మవిజ్ఞానులైన బ్రాహ్మణులమాట
సత్యమే యని నమ్ము సంశయము వలదు
వారిపలుకుల నివసించు భద్రలక్ష్మి
వారినోట నిరర్థకవాక్కు రాదు.

(తెరలోఁ గలకలము — అందఱు విందురు.)

జన — నేఁడు శిష్టానధ్యయన మగుటచే నవర్గళముగా నాడుకొనుచున్న బ్రహ్మచారుల కలకల మిది;

కౌస — చిన్నతనము సౌఖ్యదాయకము గదా! (చూచి) ఆహా! ఆబాలురనడుమఁ జక్కని కోమలాంగములతోఁ గనవచ్చుచున్న యాపిల్లవాఁడు మా రామచంద్రుఁడు చిన్నప్పు డున్నట్లుండి నాకన్నుల కానందము గలిగించుచున్నాఁడు. అతఁ డెవరిపిల్లవాఁడో!

అరు — (తనలో సంతోషముతో) భాగీరథి చెప్పినరహస్యకర్ణామృత మిదే. కాని చిరంజీవులైన కుశలవులలో నితఁ డెవఁడో తెలియకున్నది. (ప్రకా —)

చ. కువలయనీలమూర్తిఁ జిఱుకూఁకటి నొప్పుచుఁ జిన్ననాఁటిరా
ఘవుఁ డిపు డిందు నుట్టిపడుకై వడిఁ, దాపసపుత్రపంక్తికిన్
బ్రవిమలభూషణం బగుచు భవ్యతనూమృదుకాంతి, నాదుక
న్గవ కమృతాంజనం బయి సుఖంబొనగూర్చు నితం డెవం డొకో?

కంచు — నిశ్చయముగా నీబాలుఁడు క్షత్రియబ్రహ్మచారి యని తలఁచెదను.

జన — సత్యము సత్యము ఏమన?-ఇతఁడు —

చ. కలిసినకంకపత్త్రములఁ గ్రాలెడియమ్ముల నిండుతూణముల్
పొలుపుగఁ దాల్చెఁ బిక్కలను, బోర ధరించె విభూతిరేఖలున్
జెలువగుతోలు, జందెమును, జేతులఁ గార్ముక మక్షమాల, పి
ప్పలితరుదండ మూనె, మొలబట్టకుఁ జుట్టి బిగించె నారియున్.

భగవతీ! అరుంధతీ! ఈపిల్లవాఁ డెక్కడనుండి వచ్చినాఁడని నీ వనుకొనుచున్నావు?

అరు — మేమును, ఇపుడే వచ్చినాము.

జన — ఆర్యగృష్టీ! కుతూహలము హెచ్చుగా నున్నది. నీవు వెళ్ళి వాల్మీకిమహా

నడిగి రమ్ము. ఇదిగో, మఱి యొకమాట. “ఎవరో పెద్దలు నిన్నుఁ జూడఁ గోరుచున్నా” రని యాపిల్లవానితోఁ గూడఁ జెప్పి పొమ్ము.

కంచు—చిత్తము చిత్తము. (నిష్క్రమించును.)

కౌస—ఏ మేమనుకొనుచున్నారు? మనకోరిక విని యాచిన్నవాఁడు వచ్చునా రాఁడా?

జన—ఇట్టిలోకోత్తర మైనయాకారమునకు సౌశీల్యము వేఱగునా?

కౌస—[చూచి] కంచుకి చెప్పినమాట నణఁకువతో విని తన తోడిబాలురను విడిచి యా కుమారుఁ డిటు వచ్చుచున్నాఁడు.

జన—(చాలసేపు చూచి) ఆహా! ఏమిటి?

చ. వినయముచేతఁ జల్లనయి పిన్నతనంబున మెత్తమెత్తనై
కనుఁగొన సూక్ష్మబుద్ధులకుఁ గాక తదన్యుల కప్రమేయమై
యను వగునీకుమారుమహిమాతిశయంబు విమూఢ మైననా
మనమును సూదిరా యినుముమాడ్కి బలంబునలాగుచుండెడిన్.

లవుఁడు—(ప్రవేశించి) ఎవరు పెద్దలో, ఎవరు చిన్నలో, క్రమము తెలియకుండఁగా నీపూజ్యుల కెట్లు నమస్కరింతును? (ఆలోచించి) కానిమ్ము. ఇది విరుద్ధము గానిపద్ధతి యని పెద్ద లందురు. (సమీపించి) మీయందఱి కిదే లవునినమస్కారపరంపర.

అరు—జన—దీర్ఘాయుష్యుఁడవు కమ్ము.

కౌస—నాయనా! చిరంజీవివి కమ్ము.

అరు—రా నాయనా! [అని యొడిలో లవుని గూర్చుండఁబెట్టుకొని] నాయదృష్టముచే నాయొడియే కాదు నాకోరికయు నిండినది.

కౌస—నాయనా! ఇటు కూడ రమ్ము. [అని యొడిలోనికిఁ దీసికొని] ఆహా! వికసించుచున్ననల్లకలువను బోలుశరీరచ్ఛాయచేతనే కాదు, పద్మకేసరములు తినుటచేఁ గషాయవర్ణ మగుకంఠము గలిగినరాయంచకూఁతవలె ఖంగుమని మ్రోఁగు కంఠస్వరముచేఁ గూడ రామభద్రు ననుసరించుచున్నాఁడు. లేఁతతామర తూఁడువలె మెత్తనగుశరీరస్పర్శము నట్టిదే. తండ్రీ! నీ మొగము చూడ నిమ్ము. (గడ్డ మెత్తి పట్టుకొని చూచి సాభిప్రాయముగాఁ గన్నీటితో) రాజర్షీ! చక్కఁగాఁ బరిశీలింపఁగా, నితనిమొగము సరిగాఁ గోడలిముఖచంద్రబింబమును బోలియున్నది చూడలేదా?

జన—అమ్మా! చూచుచున్నాము. తల్లీ! చూచుచున్నాను.

కౌస—అకటా! వెఱ్ఱి యెత్తినట్లు నాహృదయము పరిపరివిధములఁ బరితపించుచున్నది

జన—

మ. అనఁగుంగూఁతురిచాయ రామురుచి తా నచ్చొత్తినట్లుండె నీ
తనియం దీముఖకాంతి యీయొడలిసౌందర్యంబు నీవాణి యీ
వినయం బీయనుభావ మయ్యవియ, హా విశ్వంభరానందినీ
తనయా! నాహృదయంబు చంచలగతిఁ ధావించు వేదారులన్.

కౌస—అబ్బాయీ! నీకుఁ దల్లియున్నదా? ఆమెను దలఁచుచుందువా?

లవు—లేదు లేదు.

కౌస—అట్లయిన నీ వెవరిపిల్లవాఁడవు?

లవు—సుప్రసిద్ధు లయినవాల్మీకిమహర్షి గారిపిల్లవాఁడను.

కౌస—నాయనా! చెప్పఁదగిన దేమైనఁ జెప్పుము.

లవు—నే నింతే యెఱుఁగుదును.

[తెరలో] ఓసైనికులారా! కుమార చంద్రకేతు వాజ్ఞాపించుచున్నాఁడు. "మీ రెవ్వరును, ఆశ్రమసమీపప్రదేశములను ద్రొక్కఁగూడదు."

అరు—జన—యాగీయాశ్వప్రసంగమున వచ్చినచంద్రకేతువును జూచుట తటస్థించినది నేఁడు సుదినము.

కౌస—చిన్నిలక్ష్మణునికొడు కాజ్ఞాపించుచున్నాఁ డనునక్షరము లమృతబిందు సుందరములై వినఁబడుచున్నవి.

లవు—ఆర్యా! చంద్రకేతు వెవరు?

జన—దశరథపుత్రు లయినరామలక్ష్మణుల నెఱుఁగుదువా?

లవు—రామాయణకథాపురుషులు వీరే కదా!

జన—అవును.

లవు—అట్లయిన నెందు కెఱుఁగను?

జన—ఈచంద్రకేతు వాలక్ష్మణునికొడుకు.

లవు—అట్లయిన నూర్మిళాపుత్రుఁ డగుటచే మైథిలుఁ డైనరాజర్షికి దౌహిత్రుఁడు.

అరు—(నవ్వి) బాలుఁడు కథాప్రావీణ్యమును బ్రకటించెను.

జన—[ఆలోచించి] నీ వీకథ చక్కఁగా నెఱుఁగుదు వేని చెప్పుము చూచెదము. ఆదశరథుని భార్యలలో నెవరెవరి కెందఱెందఱు పుత్రు లేపేళ్లవారు పుట్టిరి?

వు—ఈకథాభాగము మేము గాని యితరులు గాని మున్ను విన్నది కాదు.

జన—కవిగారీభాగమును రచియింపలేదా?

లవు—రచియించిరి కాని మాకు వినపింపలేదు. మాచేఁ జదివింపలేదు. మఱియు వారు రామాయణములోని యొకచిన్న భాగమును జక్కని దృశ్యకావ్యముగా రచించి, తమచేతితో వ్రాసినయాప్రబంధమును తౌర్యత్రిక సూత్రధారుఁడైన భరతునికిఁ బంపిరి.

జన—ఎందుకు?

లవు—అతఁ డప్సరసలచే దాని నభినయింపఁజేయు నని—

జన—మా కిదంతయు గూఢార్థముగా నున్నది.

లవు—ఈవిషయమున వాల్మీకులవారి కాసక్తి యెక్కువ. ఎమనఁగా?-కొందఱు శిష్యులచేతి కాపుస్తక మిచ్చి భరతాశ్రమమునకుఁ బంపుచు వారితోఁగూడ ధనుష్పాణి యగు మాభ్రాతను బ్రమాదములను దొలఁగించుటకుఁ బంపినారు.

కౌస—నీకు భ్రాత యొకఁ డున్నాఁడా?

లవు—కుశుఁడను పేరుగలయార్యుఁ డున్నాఁడు.

కౌస—నీమాటనుబట్టి యతఁడు నీకంటెఁ బెద్దవాఁ డని తెలియుచున్నది.

లవు—అవును. ప్రసవానుక్రమమున నతఁడు పెద్దవాఁడే.

జన—మీరు కవలపిల్లలా యేమి?

లవు—అవును.

జన—కుమారా! మీగురువుగారీకథాప్రపంచమెంతవఱకుఁ బ్రకటించినారో చెప్పుము.

లవు—"అసత్యమైనలోకాపవాదమునుబట్టి తొందరపడిన శ్రీరాములవారియాజ్ఞచే నొక్కతెయు నాసన్నప్రసవవేదనయు నైన సీతాదేవిని మహారణ్యమున విడిచిపెట్టి లక్ష్మణుఁడు వెళ్ళె" నన్నంతవఱకును.

కౌస—హా చంద్రసుందరముఖీ సీతా! ఒంటికత్తెవైన నీసుకుమారకోమలశరీరమున కాకస్మికమైన దైవదుర్యోగమున నేమి గతి పట్టినదో కదా!

జన—హా కుమారీ! పతివ్రతాశిరోమణీ!

చ. అనుచితనింద, భర్త విడనాడినయట్టిపరాభవంబు, కా
ననగతి కాన్పువేదన యనన్యసహాయత దుఃఖవార్ధి ముం
చినతఱి దుష్టజంతువులు చేరినయప్పుడు భీతిచెంది, నా
యన! యని యెన్నిసార్లు హృదయంబుననన్నుఁ దలంచితో కదా!

లవు—అయ్యలారా! మీ రెవరు?

అరు—ఈమె కౌసల్య, ఇతఁడు జనకమహర్షి

లవు—(సబహుమానఖేదకౌతుకముగాఁ జూచును)

జన—అహాహా! దురాత్ము లగుపౌరుల నిర్దయత్వము, అహో రాజయినశ్రీరాముని శీఘ్రకారిత్వమును?

చ. ఘనతరదుఃఖవజ్రపటుఘాతము గాంచిననాఁడుకోపమున్
గనలఁగఁ జేయుకాలమిది కార్ముకమెత్తియొ శాపమిచ్చియో

కౌస—[భయముతో] భగవతీ! కాపాడుము. కోపగించురాజర్షిని ప్రసన్నుని జేయుము.

లవు—

గీ. అతపరాభూతులైనమహాహృదయుల
కోప ముడిగింప బ్రతిమాలుకొనుట మందు.

అరు—

రామభద్రుండు నీబిడ్డ రాజవరాని!
పాలనీయులు దీను లాపౌరజనులు.

జ—

విహత సతీ శిశు స్థవిర విప్రవికీర్ణము పౌరలోక మా
యనఘుఁడురాఘవుండునుమదాత్మజభాండముశాంతినొందెదర
నేఁటితోఁ గోపము విడిచితిని విడిచితిని.

వటువులు—[తొందరగాఁ బ్రవేశించి] కుమార! కుమారా!

'అశ్వోఽశ్వ' యని జనపదముల వినవచ్చుజంతువిశేష మిపుడు మాకుఁ బ్రత్యక్షముగాఁ గనఁబడినది.

లవు—'అశ్వోఽశ్వ' యని పశుసమామ్నాయమందును యుద్ధకాండమందును గూడఁ బఠింపఁబడును. మీరు చూచిన దెట్టిదో చెప్పుడు.

వటు—అట్లయిన వినుము.

చ. వెడఁదగు తోఁక వెన్కఁగనిపించు, నజస్రము దాని వీచుచుం
డెడుఁ, బొడుగౌను దానిమెడ, డెక్కలునాలుగె, లేఁతపచ్చికన్
మడులను మేయు, వేసెను మామిడికాయలమాడ్కిలద్దిఁ జె,
ప్పెడి దిఁకనేమి? దూరముగ వెళ్ళును బోదమురమ్మురమ్మికన్.

(అని లోలుజంగెము విల్లు చేతులు పట్టుకొని లాగుదురు)

లవు—(కౌతుకబలాత్కారవిషయములను సూచించుచు) ఆర్యులారా! చూడండి. వీరు నన్ను లాగుకొని పోవుచున్నారు. (అని వేగముగా వెళ్ళును)

అరు—జన—పిల్లవానికిఁ గుతూహలము హెచ్చుగా నున్నది. వెళ్ళనీ!

కౌస—మీ రడవిపిల్లవాండ్రరూపములకును మాటలకును సంతోషించినారు. నేను లవుని జూచుచు, పెద్దయాశ పెట్టుకొన్నాను. కావునఁ గొంచె మటు వెళ్ళి యుత్సాహముతోఁ బరుగెత్తుబాలుని జూతము రండు వానిని జూడకుండ నుండలేను.

అరు—ఆచపలుఁ డతివేగముతో బహుదూరము వెళ్ళెను. ఇం కెట్లు కనఁబడును?

కంచుకి—(ప్రవేశించి) "సమయము వచ్చినపుడిది మీకుఁ దెలియు" నని వాల్మీకిమహర్షిగారు సెల విచ్చినారు.

జన—ఇదేదో యతిగంభీరముగా నున్నది. మనమే వెళ్ళి ప్రాచేతసమహర్షిని జూతము రండు. (నిష్క్రమింతురు.)

వటులు—(ప్రవేశించి) కుమారా! ఈయాశ్చర్యము చూడు.

లవు—చూచితిని గ్రహించితిని. ఇది నిజముగా నశ్వమేధసంబంధమైన గుఱ్ఱము.

వటు—ఎట్లు తెలిసినది?

లవు—ఓరిమూఢులారా! ఆభాగము మీరు కూడఁ జదివినవారే. కనఁబడదా యేమి? ఒక్కొక్కవందమందిచొప్పున దండధారులు కవచధారులు నిషంగధారులు రక్షకులుగా నున్నారు. మఱియొకవిషయమునఁ గూడ నిట్టిసైన్యమే యుండవచ్చునని మీరు సంశయము గలిగెనేని పోయి వాండ్రనే యడుగుఁడు.

వటు—సేనారక్షితమై యీతురగ మెందు కిట్లు తిరుగుచున్నది?

లవు—[కోపకతోఁ దనలో] అశ్వమేధయాగము, విశ్వమంతయు జయింపఁగోరు క్షత్రియులకు బలిష్ఠమును సకలరాజతిరస్కారకారియు నైన గొప్పసాన రాయి.

(తెరలో)

గీ. ఈతురంగంబు సప్తలోకైకవీరుఁ
డయినదశకంఠశత్రునిజయపతాక,
కాని-చో నెల్ల రాజలోకంబునకును
వీరఘోషణ యగు నిదే వినుఁడు వినుఁడు.

లవు—(గర్వముతో) ఆహా! ఈయక్షరములు క్రోధజనకము లగుచున్నవి గదా

వటు—ఎందు కీమాటలు? ఈకుమారుఁడు ప్రాజ్ఞుఁడు గదా!

లవు—ఎందు కీకేకలు? భూతల మరాజకమా యేమి?

(తెరలో) ఓరీచపలా! మామహారాజున కెదురు రాజు లెక్కడ?

లవు—ఛీ మూర్ఖులారా!

గీ. ఉర్విలో నట్టి రాజన్యు లుండ నిండు
కాక యుండక పోనిండు-కాని యిప్పు
డీవిభీషిక యేమి?-పోనీఁడు మాట
లేల? యిప్పుడు హరియింతు నీపతాక.

చటులారా! ఈగుఱ్ఱమును పట్టియెదలు ఉవ్వి కొట్టి మళ్ళించి మనగోపిత మృగములమందలోనికిఁ దోలుకొనిపొండు.

పురుషుఁడు—(ప్రవేశించి) ఛీ చపలా! ఏమన్నావు? ఈసైనికపంక్తులు సామాన్యములు కావు. మిక్కిలి చులుకైనవి. కుఱ్ఱవాఁడన్నను గర్వోక్తిని సహింపవు. పైగా, రాజపుత్రుఁ డైనచంద్రకేతువు దుర్దాంతుఁడు. అతఁడును విచిత్రారణ్యసందర్శనమున సక్తహృదయుఁడై యిప్పటికిని రాకుండెఁగావున నీదుర్గమతరుగహనముఁ జొచ్చి శీఘ్రముగాఁ బాఱిపొండు.

వటు—కుమారా! మన కీగుఱ్ఱ మెందుకు? అయోధనవర్గము విండ్లు మ్రోఁగించుచు భయపెట్టుచున్నది. మనయాశ్రమమూ దూరముం దున్నది. కావున రమ్ము లేడిగంతులతోఁ బాఱిపోవుదము.

లవు—(నవ్వి) అశరాసనము లేమిమ్రోఁగును? (వి ల్లెక్కు వెట్టుచు)

చ. గొన మునునాల్కఁ జుట్టఁబడుకోటియుగంబును కోఱలొప్పఁగా,
ఘనతరఘుర్ఘురధ్వనులు గ్రమ్మఁగ భీకరలీల, మ్రింగఁ బూ
నినతెఱి బాగుగాఁ దెఱచి నిల్పినయంతకునాస్యయంత్రమో
యన వికటోదరంబయి భయంకర మయ్యెడు విల్లు చూడుఁడీ!

[అంత యథోచితముగాఁ బరిక్రమించి యందఱును నిష్క్రమింతురు.]

ఇది చతుర్థాఙ్కము.

# ఉత్తరరామచరిత్రనాటకము

## పఞ్చమాఙ్కము.

[తెరలో] ఓ సైనికులారా! మనబలములకవలంబనము కలిగినది.

ఉ. వారక కోవిదారమనుభవ్యపతాక చలించుచుండఁగా
సారథి యశ్వరాజములఁ జయ్యనఁ దోల, మహాజవంబునన్
జేరెడి తేరిపై నధివసించి వినంబడుయుద్ధవార్తపైఁ
గోరికఁ జంద్రకేతు వఁడుగో! యరుదెంచెను గొప్పప్రాపుగా.

చంద్రకేతువు — [యథోక్తముగాఁ బ్రవేశించి సారథితో] ఆర్య సుమన్త్రా! చూడు
చూడు.

మ. చిఱుకోపంబున నెఱ్ఱవాఱినముఖశ్రీ యొప్పఁగాఁ, బిల్లజు
ట్లరుదారం జలియింప, నీబుడుత వీరాకారుఁడై నారి చె
చ్చెర లాగన్ గిఱువెట్టుకోటియుగళిం జెన్నొందు విల్లెత్తి సం
గరభూమిన్ భటకోటిపైఁగురియు వేడ్కన్ సాయకాసారమున్

గీ. ఔర! రఘువంశదుర్యశోఽంకూర మనఁగ
నీమునికుమారుఁ డొక్కరుఁ డేపు మీఱి
దారుణారంభ శరశతదళితకుంభి
కుంభటంకారములు నాకుఁ గూర్చు ముదము.

సుమ — కుమారా! వినుము.

గీ. దేవరాతిసమమహిమల ధిక్కరించు
నితని శౌర్యంబు రూపంబు నెంచి చూచి

కౌశికునియజ్ఞభూమి రక్కసులఁ జంప
ధనువు పట్టినరాముని దలఁచుచుంటి.

చం—ఒక్కచిన్నపిల్లవానితోఁ బెక్కండ్రు యోధులు పోరాడవలసివచ్చినదిగదా యని నాహృదయము సిగ్గుపడుచున్నది.

గీ. మదము తొరఁగెడునేన్గుల మందతోడ
హైమఘంటలు మ్రోఁగురథాళితోడ
ఘోరశస్త్రాస్త్రములతోడ వీరభటుల
మొత్త మొక్కకుమారుని ముట్టడించె.

సుమ—వత్సా! వీ రందఱును గలిసియున్నను వీనికిఁ జాలరు. వేఱుగా నున్నఁ జెప్పెడిదేమి?

చం—ఆర్యా! త్వరపడుము త్వరపడుము. మనసైనికుల నితఁడు చంప మొదలు పెట్టినాఁడు.

మ. రణభేరీఘననాదముం గలిసి సాంద్రి బైనచంచద్ధను
ర్గుణనిర్ఘోషము శైలకుంజవిచలత్కుంభ స్రవద్దానవా
రణకర్ణజ్వరకారియై వెలయ సంగ్రామస్థలిన్ మృత్యుభీ
షణవక్త్రంబును జొచ్చుయోధుల శిరస్సంఘుంబులన్ గప్పెడున్

సుమ—[తనలో] ఇట్టివానితోఁ జంద్రకేతువు ద్వంద్వయుద్ధము చేయ నెట్లంగీకరింతును? [ఆలోచించి] కాకపోయినను, నే నిక్ష్వాకురాజులయి ద్లఁ బెరిగిన పెద్దవాఁడను గదా! యుద్ధము సంభవించినపు డింతకంటె గతి యేమి?

చం—[సవిస్మయలజ్జాసంభ్రమముగా]అయ్యో! సైనికులెల్లెడఁ బాఱిపోయిరి గదా! ఛీ!

సుమ—[రథవేగము నిరూపించి] కుమారా! ఇడుగో బాలవీరుఁడు, మాట్లాడవచ్చును.

చం—[స్మృతి నభినయించి] ఇతని పే రేమి?

సుమ— లవుఁడు.

చం—మణిరంగవృత్తము.

ఓమహాభుజ! యోలవ బాలా!, యేమి నీకీక హీనులతోడన్
రా మతేనిదె రాశమియించున్, ధామమిప్పుడు ధామములోనన్!

సుమ—ప్రభాకలితవృత్తము.

మరలెను నీపిలు పాలకించి కుమారుఁ డీతఁడు సైన్యసం
హారణము మానుచుఁ జూడు బాలక! యంబుదధ్వని విన్నకే
సరివరశాబక మామదాంధగజప్రహింసను మాని తా
మరలినయట్టులు, చూడఁగా నుపమాన మీతని కీవుగా.

లవుఁడు—(ధీరోద్ధతపరాక్రమభావముతోఁ బ్రవేశించి) సెబాసు! రాజపుత్ర సెబాసు!! నీవు నిజముగా నైక్ష్వాకుఁడవే. ఇదిగో నేను వచ్చినాను.

(తెరలోఁ గలకలము)

లవు—[నిరసనదృష్టితోఁ దిరిగి చూచి] ఈసేనాపతులు పరాజితులై పాఱిపోయియు మరల వెంబడించుచున్నారు. ఛీ ఛీ! నీచులారా!

చ. ఘనతర మైన శైలపరిఘట్టన రేఁగిన బాడబాగ్నిక
య్యనిలవికంపితాబ్ధిరణితౌఘము లైనవశీ, నాకు ప్రథాగ్నికిన్
వెనుకకుఁబోయి హేలమెయి వెండియువాఁగుచువచ్చు మీఁదు వా
హిని యొకముద్ధయయ్యెడు సహింపను హేళన రంకురంకుఁకన్.

[అని తొందరగాఁ బరిక్రమించును]

చం—ఓయీ మునికుమార,

చ. అతులిత మద్భుతం బగుగుణాతిశయంబున నైతి వీవు స్నే
హితుఁడవు గాన నాకుఁ గల దెల్లను నీయదియౌనుగాదె? యు
ద్ధతి నిజసేనతో ననికిఁ దార్కొనఁ జూతువె? రమ్ము రమ్ము నీ
జత యన నీబలంబు నికషం బన నే నిదె చంద్రకేతుఁడన్

లవు—[సహర్షసంభ్రమముగా మరలి] అహో! మహానుభావుఁ డయినయీసూర్యవంశకుమారుని వీరవచన ప్రయోగ మెంతప్రసన్నకర్కశముగా నున్నది! ఇంక నీతుచ్ఛులతో నేమి? ఇతని నే యెదుర్కొనెదను.

[తెరలోఁ గలకలము]

లవు—[కోపముతో] ఛీ ఛీ! ఈపాపాత్ములు వీరసంవాదమునకు విఘ్న మొనరించుచు నాపని పాడుచేయుచున్నారు. [అని వారి కెదురుగా వెళ్ళును.]

చం—ఆర్యా సుమంత్ర! చూడు చూడు.

మ. పటుదర్పంబు కుతూహలం బడర నాపై దృష్టి సారించి యు
ద్భటకోపంబున వెంబడించుబలముం దాడింప వి ల్లెత్తునీ

వటువీరుం డిరువంక వాయువులు వీవం దత్తఱం బంది యి
ట్టటు నూఁగాడుసహేంద్రచాపజలదం బన్నట్లు భాసిల్లెడున్

సుమ — బాలకా! మన సేనానాయకు లితనివైపు కన్నెత్తి చూచుటకుఁ గూడఁ జాలరు. మనమే కేవల మాశ్చర్యమునఁ బరవశుల మైతిమి గదా! వారిమాట చెప్పెడి దేమి?

చం — ఓ రాజులారా!

చ. అరదములన్ గజంబులు హయంబులు నెక్కియు సంగరక్షలా
భరణములెల్ల దాల్చి నడిప్రాయము మీఱినవెన్కఁ గీర్తికిన్
దొంఁకొని, పాదచారి యయి తోళ్ళ ధరించిన పిల్లవానిఁ బె
క్కురుగుమిగూడిముట్టుదురొకో! యపకీర్తి యమీకుమాకిఁకన్

లవు — [సోన్మాదముగా] ఆ! పాపము! నాపై దయ దలఁచుచున్నాఁడు కాఁబోలు! [ఆలోచించి] కాలహరణము కాకుండుటకై యీసేనలను జృంభకాస్త్రముచే స్తంభించెదను [అని ధ్యానము నటించును]

సుమ — ఉల్లోల మైనసైన్యనిర్ఘోష మకస్మాత్తుగా శాంతించిన దేమి?

లవు — ఇంక నే నీ ప్రగల్భుని జూచెదను.

సుమ — కుమారా! ఈబాలుఁడు జృంభకాస్త్ర మామంత్రించె నని యూహించుచున్నాను.

చం — సందేహ మేమి?

చ. వెలుఁగును జీకటిం గలిసి వెళ్లెడిరీతిని భీతిగొల్పి క
న్నులు మిఱుమిట్లుగొల్పుచుఁ గనుంగొనసీయక విప్పుమూయు, ని
శ్చలముగఁ జేసె సైన్యమును సందడి మాన్పెను దెప్పపాటులోఁ
దెలియ ననంతవీర్య మురు తేజము నియ్యది జృంభకాస్త్రమే.

ఆశ్చర్య మాశ్చర్యము —.

మ. పరితప్తస్ఫురదారకూటకపిశజ్వాలాభ తేజంబు భీ
కరపాతాళతమోవినీలరుచి గల్గన్ జృంభకాస్త్రాళి, యు
ద్ధురకల్పానిలకంపితం బగుతటిత్పుంజాంబుదాభాసకం
దరవింధ్యాచలశృంగపంక్తిగతి మింటన్ నిండెఁ దేజంబులన్.

సుమ — ఇతని కీజృంభకాస్త్రము లెట్లు వచ్చెనో?

చం—వాల్మీకిమహర్షి వలన వచ్చిన వని తలఁచెదను.

సుమ—ఇతఁ డస్త్రవిద్యమాత్రము వాల్మీకిమహామునియొద్ద నేర్చె ననుకొను. అందులోను జృంభకములమాట చెప్పనే యక్కఱ లేదు. ఏమనఁగా?

క. మునుపు కృశాశ్వమహాముని
కనె నీజృంభకము లతనికరుణఁ గని గ్రహిం
చెను విశ్వామిత్రుండా
మునికరుణ గ్రహించె రామమూర్తియుఁ బిదపన్

ఇవి జృంభకాస్త్రసంప్రదాయము.

చం—నీవు చెప్పినదారే కాక, గురుసంప్రదాయము లేకుండఁగా మహాప్రతిభాశాలులు మంత్రవేత్తలు నగు నితరమహర్షులు గూడఁ గొంద ఱీయస్త్రములను స్వయముగాఁ గనుఁగొనియుందు రని భావించెదను.

సుమ—కుమారా! సావధానముగా నుండుము. నీ ప్రతివీరుఁడు సమీపించెను.

కుమారులు—[ఒకరి నుద్దేశించి యొకరు తమలో] ఆహా! చూచుట కెంతయింపుగా నున్నాఁడు! [స్నేహానురాగములతోఁ జూచి]

చ. సమయవిశేషమో! నియతిసంగతసద్గుణతావిశేషమో!
అమలినపూర్వజన్మసముదంచితమైత్రివిశేషమో! యవే
ద్యమయిన దేహబాంధవమహత్త్వమొ! యీతనిఁ జూచినంతఁ జి
త్తము కడు సావధానమయి తత్పర మయ్యెని దేమి చిత్రమో!

సుమ—తారామైత్రి యనియుఁ జక్షూరాగ మనియు దేనిని లోకజ్ఞులు వ్యవహరింతురో యట్టి నిష్కపటప్రేమ యొకానొకరి కొకానొకరియెడఁ గలుగుట యనునది ప్రాణిస్వభావము. అనాలోచనీయమూల మయినయట్టిప్రేమ మనుభవైకగోచర మని పెద్ద లందురు.

గీ. హేతువిరహిత మాపక్షపాతవృత్తి
దాని కడ్డం బొకింతయుఁ గానరాదు
శుచితరం బైనయాప్రేమసూత్ర మహహ!
జీవిహృదయాంతరంబులు చేర్చి గ్రుచ్చు.

కుమారులు—[అన్యోన్యము మరలఁ దమలో]

గీ. ఎంతయును జూడఁ జూడంగ నితనిమేను
కౌఁగిలింపఁగ నామేను గగురుపొడుచు,
నట్టిమృదునీలపట్టాంబరాభమైన
కాయమున నెట్లు బాణంబు లేయువాఁడ?

ఉ. కాని పరాక్రమాఢ్యు నెడఁ గైదువు పట్టక తప్పునొక్కొ? మె
ట్లేనియు నిట్టిశూరునెడ నెత్తనిశస్త్రము శస్త్రమౌనె? చే
పూనియు నాయుధంబు మఱి పోరనిచో నితఁడేమి పల్కునో?
ఛీ! నిజమైనకూర్మికిని జేటగు దారుణవీరపద్ధతిక్

సుమ—[లవుని జూచి కన్నీటితోఁ దనలో] హృదయమా! పెడదాఁ బడెద వేల?

గీ. నీదుమొలకెత్తునభిలాష కాదియైన
బీజమును ముందుగా దుష్టవిధి హరించె,
హృదయమా! యెక్కడైనను మొదలుకోసి
నట్టితీఁగను మొగ్గలు పుట్టునొక్కొ?

చం—ఆర్య సుమంత్రా! రథము దిగెదను.

సుమ—ఎందుకు?

చం—ఈ వీరపురుషుని గౌరవించుట యగును. అది గాక రాజధర్మము పాలించుటయు నగును. రథికులు పాదచారితో యుద్ధము చేయరాదని శాస్త్రవేత్తలు చెప్పుచున్నారు.

సుమ—(తనలో) ఓ! కష్టమే సంభవించినది.

గీ. న్యాయ్యమైనట్టియీకార్యమాచరింప
వద్దనుచు నెట్లు పల్కు నావంటివాఁడు?
సాహసైకరసక్రియాచరణ మిప్పు
డెట్టు లంగీకరించు? నే నెఱుఁగఁజాల

చం—ఏదైనఁ గార్యసందేహము వచ్చినపుడు మాతండ్రిగూడ మాతాతగారి ప్రియమిత్రుఁడ వైన నిన్నడుగుచుందురు గదా! ఈ విషయమున నాలోచించుచున్నా వేమి?

సుమ—కుమారా! క్షత్రియధర్మ మనుసరించుచున్నావు.

క. ఇదియె సనాతనధర్మం
బిదియే సంగ్రామధర్మ మిదియేన్యాయం
బిదియే క్షత్త్రియధర్మా
స్పద రాఘవవీరచరితపద్ధతి వినుమా!

చం—ఆర్యా! అసమాన మైనమాట చెప్పినావు.

క. ఇతిహాసపురాణంబులు
స్మృతులును సూత్త్రములు న్యాయశిక్షలును జగ
న్నుత మగురఘువీరకుల
స్థితిగతు లెఱుఁగుదువు నీవ తెల్లము గాఁ గన్

సుమ—[సస్నేహాశ్రము గాఁ గౌఁగిలించి]

ఉ. చిన్నికుమార! యింద్రజిని జీల్చినకీర్తిని గన్న బిడ్డని
న్గన్నకుమారలక్ష్మణుఁడు గాంచఁగ మొన్నటివాఁడు గాఁడె! మే
లన్న! తదాత్మజుం డెఱిఁగె నప్పుడె వీరులధర్మముల్ బళీ!
సన్నుతి కెక్కె భాగ్యమున సౌరకులంబు బహుప్రతిష్ఠమై

చం—గీ. అన్వయజ్యేష్ఠుఁ డనపత్యుఁ డగుచునుండ
దినకరాన్వయమునకుఁ బ్రతిష్ఠ యేది?
యనుచు దుఃఖించుచున్నవా రాత్మలోనఁ
దక్కుమువ్వురు మాతండ్రు లొక్కగతిని.

సుమ—అకటా! ఇంద్రకేతునిమాటలు హృదయమర్మచ్ఛేదదారుణము లగుచున్నవి గదా!

లవు—ఆర్యా! రసక్రమము కలిసి పోవుచున్నది.

గీ. చంద్రుఁ గన్గొన్నకుముదినిచాయ నితనిఁ
జూచి యానంద మొందు నాచూడ్కి, కాని
కలహ మాసించు గుణఝుణాత్కార ఘోర
కార్ముకం బూనుగుణకిణకలితభుజము.

చం—[గాథావతరణము నిరూపించి] ఆర్యా! సూర్యవంశజుఁ డైన చంద్రకేతుఁడు నమస్కరించుచున్నాఁడు.

సుమ — ఆదివరాహమూర్తి యైన శ్రీమన్నారాయణుని యనుగ్రహమున నహితునకే పరాభవము గలుగుఁగాక.

మ. కులనాథుం డగుసూర్యుఁడియ్యెడ నొసంగుంగాక సౌఖ్యంబు, మీ
కులపూజ్యుండు వసిష్ఠమౌనియు నొసంగుంగాక యుత్సాహముల్
గలుగున్ గారుడ మాగ్నిమారుతము నైంద్రావైష్ణవం బోజముల్
గెలుపుల్ గూర్చుత రామలక్ష్మణధనుర్నిక్షేపణమంత్రంబులున్.

లవు — కుమారా! నీవు రథముమీఁద నుండియే మిక్కిలి శోభిల్లుచున్నావు. ఇప్పుడు నాయెడఁ జూపిన మహాదరము చాలును.

చం — అట్లయిన, మహాభాగా! నీవు గూడ మఱియొకరథ మెక్కుము.

లవు — ఆర్యా! రాజపుత్రుని మరల రథ మెక్కింపుము.

సుమ — కుమారా! నీవు గూడఁ జంద్రకేతుని కోరిక నంగీకరింపుము.

లవు — తమ సాధనములు తా ముపయోగించుకొనుట కాలోచన మేల? ఇఁక నొా వనవాసులు రథగతు లెఱుఁగరు.

సుమ — బాలకా! ఇతని దర్పసౌజన్యముల యాచారము నుఁ జూచితివా? ఇక్ష్వాకుకుల వీరుఁడైన రామభద్రుఁడు చూచెనా, అతని హృదయము నితనియందు స్నేహమునఁ గరఁగించును గదా!

లవు — దాని కేమి గాని, ఆరాజర్షి మిక్కిలి సజ్జనుఁ డని వినుచున్నాను. (సిగ్గుపడుచున్నట్లుగా)

చ. మునివరుయజ్ఞశత్రులరిపుం డగువీనినియాదరంబు నా
కును లభియించునే నతనిగొప్ప నెవం డిల గారవింపఁడై
నను హయరక్షకుల్ ధరణినాథుల నెల్లర ధిక్కరించి మిం
చినఁ దగినట్లు నేనును వచించితిఁ గోపము వచ్చె వారికిన్.

చం — నీవు మా నాయనగారి మహాప్రతాపమును గూడ సహింపవా యేమి?

లవు — సహింతునో, సహింపనో అది వేఱుమాట. దాని కేమి కాని యొకటిమాత్ర మడుగుచున్నాను. ఆరఘుకుల రాజన్యుఁడు దాంతుఁ డని వినుచున్నాము. అతఁడు స్వయముగా గర్వింపఁడు, అతని ప్రజలుగూడ గర్వింప రనియు విందుము. అట్టియెడ నీయశ్వరక్షకులు రక్కసమాట లాడెద రేమి?.

గీ. వెట్టి యెత్తినవారి గర్వించువారి
మాట రక్కసమాటని మానులండ్రు
అఖిలవైరంబులకు మూల మదియె, మఱియు
సర్వలోక తిరస్కారసదన మదియె.

ఇట్లు మత్తోన్మత్త భాషితమును నిందించినవారే సూనృతభాషితము నిట్లు నుతించిరి.

గీ కోరికలు దీర్చుఁ బగవారినో రణంచు
యశము గలిగించు నపసిరి నపహరించు
భవ్యమును బావనం బింటిపాఁడియావు
భద్రములపుట్టినిల్లు సుభాషితంబు.

సుమ—అయ్యో! వాల్మీకి శిష్యుఁడైన యీబాలుఁడు సంపూర్ణస్వభావుఁ డయ్యును, అసహనాభిప్రాయముతో మాటాడుచున్నాఁడు.

లవు—సరే కాని. చంద్రకేతూ! "నీవు మానాయనగారి మహాప్రతాపమును గూడ సహింపవా యే" మని పల్కితివి గదా! క్షత్రియధర్మ మొక్కనియందే మూర్తీభవించి యున్న దని నీయభిప్రాయమా యేమి?

సుమ—ఓయీ వత్సా! నీ వాపూజ్యుఁడైన యిక్ష్వాకు వంశవీరు నెఱుఁగవు. కావున నధిక ప్రసంగము కట్టిపెట్టుము.

గీ. సత్యముగ సైనికుల నోర్చి జయముగాంచి
వెల్లడించితి తేజంబు చెల్లుఁ గాని,
పరశురాముని గెల్చినపురుషునందు
మాఱువాదంబు చేయ నర్హుడవు గావు.

లవు—[నవ్వి] ఆర్యా! పరశురాముని గెల్చినపురుషుఁడని పెద్దగొప్ప చెప్పుచున్నా వేమి?

గీ. బ్రాహ్మణులకును వాక్కున బాహుజులకు
బాహువుల నుండు వీర్య మీపల్కు నిజము
శస్త్రధరుఁ డైనవిప్రు నాజామదగ్న్యు
గెల్చుటొకగొప్ప యౌనె మీక్షితివరునకు?

చం—(మనశ్శ్లేశముతో) ఆర్య సుమంత్రా! చాలుఁజాలు. ఇఁక బదులు చెప్పవద్దు.

చ. భువనము లెల్ల నిర్భయతఁ బొందిసుఖంపడ నేలుకీర్తికిన్
దవిలిన రాఘవేంద్రుచరితంబు లెఱుంగరె డశేషవిప్రమా
నవపతిపూజ్యుఁడైనభృగునందను వీరుని గా గణింపఁడీ
నవపురుషావతారుఁ డగునాయకనాయకుఁ డెంతవాఁడొకో!

లవు—రఘునాథునిచరిత్ర గాని మహిమ గాని యెవ్వఁ డెఱుఁగఁడు? చెప్పఁదగి విశేష మేమయినఁ గలదా? చెప్పుము. లేదా? ఊరకొనుము.

ఉ. వారలు పెద్ద లాచరితవర్ణన కూడదు, సుందసుందరిన్
బోర వధించి పేర్చినయమోఘయశస్కులు వారి నుండనీ!
వీరు ఖరున్ వధించునెడ వెన్కకుఁ బోయినపోక వాలిపై
సారశరంబు లేయుఘనచాతురియున్ జగతీప్రసిద్ధమే.

సుం—ఆఁ! ఓరీ తాతాపవాదీ! భిన్నమర్యాదా! కొలఁదిమీఱి యెగురుచున్నావే
లవు—ఆఁ! ఏమీ! కనుబొమలు ముడివడఁ జూచుచున్నాఁడే!
సుమ—వీరికి గోపము హెచ్చుచున్నది.

ఉ. కూఁకటిముళ్లు త్రుళ్ళిపడఁ గోపవికంపిత మయ్యె నంగముల్
కోకనదచ్ఛదంబులకుఁ గూరిమిమిత్రములయ్యె నేత్రముల్
భ్రూకుటిభీకరాననములున్ ధృతలాంఛనచంద్రశోభ భృం
గీకలితారవిందరుచిఁ గేరినకాంతి వహించె నెంతయున్

లవు—కుమారా! అట్లయిన, యుద్ధమున కనుకూలమూలమైన నేలకిఁ బోవుదము రమ్ము

(అని యందఱు నిష్క్రమింతురు) ఇది పఞ్చమాఙ్కము.

# ఉత్తరరామచరిత్రనాటకము

## షష్ఠాఙ్కము.

(తరువాత విమానారూఢులైనవిద్యాధరమిథునము ప్రవేశించును)

విద్యాధరుఁడు.—ఆహా! ఆకస్మికనైసర్గికగాఢకాయులును, ఉత్తమక్షాత్రతేజోవిరాజమానులు నయినయీసూర్యవంశకుమారులపరాక్రమవిలాసములు దేవాసురులకుఁ గూడఁ దత్తఱపాటు గలిగించుచు నెంతయాశ్చర్యకరములుగా నున్నవి ప్రేయసీ! చూడు చూడుము!

గీ. వింటినొప్పును గంటలు వింటినారి
రణరణలు గణగణలు ఝుంఝుణలు చేయ
ఘోరశరములు గురియు కుమారవీర
వరులపోరాట మద్భుతావహము గాదె?

విచిత్ర పదవృత్తము.

నీరద గర్జముపోల్కిన్, భోరనునాదము గల్గన్
గోరుచు వీరశుభంబుల్, భేరులు మ్రోఁగుచు నుండెన్

కావున సురతరు తరుణమణిమయ ముకుళమకరంద సుందరంబును, వికచ కనకమయకమల కమనీయంబు నగు పుష్పవర్షము తెఱపి లేకుండ వీరిపైఁ గురిపింతము గాక.

విద్యాధరి.—సరే కాని, ఇదేమి! మనయెదుట నెల్లెడఁ దళతళ మెఱయు విద్యుత్కాంతిజాలమునఁ గపిలవర్ణమైనట్లుగా నాకాశ మకస్మాత్తుగా నిట్లుమాఱి పోయిన దేమి?

విద్యా.—ఔను నిజమే. ఇందుకుఁ గారణ మిపు డిట్లు తోఁచుచున్నది. ఈ మహాతేజము-

గీ. శాణయంత్రంబునన్ ద్వష్ట సానపట్టు
తటిని గిరగిరఁదిరిగెడు దరణికిరణ
జాలశిత తేజమో, కాక కాలరుద్రు
ఫాలనేత్రంబు నద్భుతోన్మీలనంబో?

(పరికించి) ఆఁ! కాను కాదు. నిజము తెలిసినది. కలఁత చెందిన చంద్రకేతు వాగ్నేయాస్త్రము ప్రయోగించెను. అదియే నిప్పులఁ బోలినశరధారలు కురియుచున్నది.

గీ. కనుము జెండాలు చామరల్ కాలిపోవఁ
దొలఁగి పోయె విమానమండలము, చూడు
క్రొత్తమోదుగు పువ్వులాగున వెలుంగు
నగ్ని దహియించు దీర్ఘధ్వజాంశుకములు.

ఆశ్చర్య మాశ్చర్యము. భగవంతుఁ డైనవీతిహోత్రుఁడు వజ్రము బద్ద లగుచున్నట్లుగాఁ బ్రచండ మైనఘటచ్ఛటారవంబు గావించుచు మిణుఁగురులు గ్రక్కుచు భీకరజ్వాలామయము లైననాలుకలు ద్రోయుచు నంతట వ్యాపించుచుండె. కావున నాప్రియురాలిని బట్టతోఁ గప్పి దూరముగా, దీసికొని పోయెదను. (అట్లు చేయును)

వి.రి.—ఆహా! విమలమౌక్తికశైలముమాడ్కి నున్ననై చల్లనైనప్రియుని దేహము? సోఁకినంతనే జనియించిన మహానందముచే మెల్లమెల్లగాఁ దల యెత్తుచున్న నాసంతాప మంతనే చల్లారినది. బళీ నాభాగ్యము!

విద్యా—ప్రేయసీ! నే నేమి చేసితిని? అయినను-

గీ. ఏమియును జేయ కూరక యెవ్వ రెవరి
దుఃఖమును నైజసుఖమునఁ దొలఁగుచుందు
రట్టినిర్హేతుకప్రీతి నలరునట్టి
వారు వారియదృష్ట దేవతలు గారె?

వి.రి.—అనారతము సంచలించు విద్యుల్లతలు చకచకలాడుచుఁ బ్రకాశింప మత్తమయూరకంఠములఁ బోలిన జలధరము లాకాశము నావరించుచున్న వి దేమి.

విద్యా—సుందరీ! ఇది లవుఁడు ప్రయోగించిన వారుణాస్త్రముయొక్క మహిమ సెబాసు! తెఱపి లేకుండఁగా బడుచున్ననీరధారలచే నాగ్నేయాస్త్రము శాంతించినది.

వి.రి—సంతోషము సంతోషము.

విద్యా—అయ్యో! ఏది యైనను, అనర్థమునకే యగుచున్నది గదా! అకటా! ప్రలయకాలఝంఝామారుతమునఁ గలఁత చెందినకల్పాంత మేఘములు గుడగుడలాడుచు మింటికి మంటికి నేకధారగాఁగురియుచెడ దట్టముగాఁగ్రమ్మిన మహాగాఢాంధకారమునఁ గన్నుగానక పడిపోయి నట్లును, ఒక్కమాఱుగాఁ బ్రపంచ మంతయు మ్రింగుటకై తెఱచినమృత్యుదేవతనోటిలోఁ బడి దొరలుచున్నట్లును, యుగాంతకాలమున యోగనిద్రచే సకలద్వారంబులు బంధించి యున్న శ్రీమన్నారాయణుని విశాలోదరమున నిలిచి యున్నట్లును, భూతజాల మంతయు విపత్తినొందుచున్నది. (చూచి) చంద్రకేతూ! మేలు మేలు! వాయవ్యాస్త్రము ప్రయోగించి మంచిపని చేసితివి.

గీ. మారుతాస్త్రంబునన్ మేఘమండలంబు
లెక్కడో యణఁగిపోయెఁ జే రేని లేక
యాత్మవిద్యఁ బరబ్రహ్మమం దణంగు
ఘటపటాదివివర్త సంఘాతమట్లు.

వి.రి—నాథా! దూరమున నుండియే తొందరతోఁ జేయి పైకెత్తి పైబట్టచెఱఁగు విసరుచు మృదుమధురగంభీరస్వరంబున శాంతింపుఁడు శాంతింపుఁ డను మాటలతోఁ గుమారులపోరాటమును నిషేధించుచు వచ్చి వారినడుమ విమానము దింపినయీమహాత్ముఁ డెవరో!

విద్యా—ఇతఁడు శంబూకుని జంపి తిరిగివచ్చుచున్న శ్రీరామచంద్రమూర్తి.

చ. చెవులకు హాయి గొల్పురఘుశేఖరుశాంతరసోక్తిమీఁదిగా
రవమున శాంతుఁడై సమరరాగము మానె లవుండు, చంద్రకే
తువు నతిభక్తి శాంతుఁడయి దోసిలి యొగ్గి నమస్కరించె, రా
ఘవుఁడు కుమారు లిద్దఱిని గౌఁగిటఁ జేర్చి సుఖించుఁగావుతన్.

ప్రేయసీ! మన మింక బోవుదము రమ్ము (అని నిష్క్రమింతురు)

ఇది మిశ్రవిష్కంభము.

(పిదప శ్రీరాముఁడు, లవుఁడు, సాష్టాంగపడిన చంద్రకేతుఁడును ప్రవేశించుచున్నారు)

రాము—(విమానము దిగి)

గీ. సౌరకులపూర్ణిమాచంద్ర! చంద్రకేతు!
కౌఁగిలింపుము లెమ్ము వేగముగ రమ్ము
తుహినశీతలభవదంగ మహిమవలన
శాంతిఁ జెందును నామనస్తాప మిపుడు.

(లేవనెత్తి సస్నేహాగ్రహముగాఁ గౌఁగిలించి) కుమారా! దివ్యాస్త్రయుద్ధము చేయు నీ కారోగ్యమా?

చం—నాయనా! ఆశ్చర్యకరుఁడైన ప్రియమిత్రుఁడు లభించిన భాగ్యముచే నెంతయుఁ గుశలము. కాని నా దొకవిన్నపము, నన్నుఁ జూచినట్లుగాని యంతకంటె నెక్కువగాఁగాని యనర్గళసాహసుఁడైన యీవీరకుమారుని మీరు స్నేహదృష్టితోఁ జూడవలెనని నాకోరిక.

రా—[లవుని జూచి తనలో] అదృష్టవశమునఁ గుమారున కతిగంభీర మంగళాకారుఁడైన స్నేహితుఁడు దొరకెను. (మరలఁ జూచి) చూడఁగాఁ జూడఁగా నాకిట్లు తోఁచుచున్నది. ఈబాలవీరుఁడు—

మ. మణియో! లోకులపుణ్యమో! మహితసామర్థ్యవ్రజంబో! జగ
ద్గణరక్షార్థశరీరధారి యగుసాక్షాదస్త్రవేదంబొ! స
ద్గుణపుంజంబొ! ఘనీకృతంబయినసంతోషంబొ! బ్రహ్మాండపో
షణముం గోరినమూర్తిమంత మగు రాజద్రాజధర్మంబొకో!

లవు—(తనలో) మహానుభావంబును బరిభూతపుణ్యంబు నయిన యీమహాపురుషుని సాక్షాత్కార మాహా! ఆహా! ఇతఁడు—

గీ. అంచితధ్యానమునకు నాహ్లాదపదము
పావనైకాంతభక్తికిఁ బట్టుకొమ్మ
మూర్తిసుందర మైనసంపూర్ణధర్మ
సుప్రసాదం బనంగ నాచూడ్కి దనిపె.

మ. అవురా యేమిది? యీతనిం గన నదృశ్యం బస్మద్దర్పంబణం
కువ చేకూరెను బారవశ్య మమరెన్ గ్రుంగె న్విరోధంబు ను
త్సవ మయ్యెన్-మహనీయులందు విలసద్గంగాదితీర్థంబులం
దవురీతిన్ మహిమం బొకండు సహజంబై యుండు-నింకేమగున్?

రా—[తనలో] ఏమిది? ఏకారణముచేతనో యీబాలుఁ డొక్కమాఱుగా నా యంతరాత్మను దుఃఖరహితముగాను స్నేహసహితముగాను జేయుచున్నాఁడు. ఆశ్చర్య మాశ్చర్యము-అది గాక, స్నేహమేమి? నిమిత్తసాపేక్ష మేమి? ఇది మిక్కిలి పొసఁగనిమాట.

చ. కలుపుఁ బదార్థసంతతి నొకానొకలోపలికారణం బదే
తెలియఁగ స్నేహ మంచు వినుతిం గను, నయ్యది కోర దెన్నఁడున్
వెలుపలికారణంబు లిది నిక్కము, చంద్రుని జూచుచున్ విధూ
పలము ద్రవించు సూర్యుఁ గని పంకజమున్ వికసించుఁగా దొకో!

లవు—చంద్రకేతూ! వీ రెవ్వరు?

చం—ప్రియవయస్యా! వీరు మాతాతపాదులు.

లవు—ప్రియవయస్యా యని పిలిచితివి కావున నాకుఁ గూడ వీ రట్లే యగుదురు. కాని, నీవు తండ్రు లనఁదగినవారు నలుగు రున్నారుగదా! రామాయణకథాపురుషు లయినవారిలో నీ వెవరో తెల్పుము.

చం—పెదనాయనగారని తెలిసికొనుము.

లవు—(సోల్లాసముగా) ఏమి? భగవంతుఁడైన రఘునందనుఁడే నా? అదృష్టవశమున నీమహానుభావుని దర్శనమైనది. నేఁడు సుదినము. (వినయకౌతుకములతోఁ జూచి) తాత! ప్రాచేతసాంతేవాసి యగులవుఁడు నమస్కరించుచున్నాఁడు.

రా—చిరంజీవీ! రమ్ము రమ్ము (ప్రేమతోఁ గౌఁగిలించి) నాయనా! అత్యంతవినయము చాలును. గట్టిగా నన్నుఁ గౌఁగిలింపుము.

గీ. కమలకుట్మలగర్భపత్రములఁ బోలి
మెత్తనై నున్ననై లేఁత యొత్తు నగుచుఁ
జందనముఁ జందురుని బోలి చల్ల నగుచు
నీదుకౌఁగిలి సౌఖ్యంబు నెఱపె నాకు.

లవు—(తనలో) ఆహా! వీరికి నాయెడ నిట్టినిర్హేతుకానురాగ ముదయించినది. నేనో, అజ్ఞానుఁడనై యిట్టివారికి యపకారము గావింప వ్యర్థముగా నాయుధము చేతఁబట్టినాను. [ప్రకా] తండ్రీగా రిపుడు మూఢుఁడైన లవుఁడు చేసిన తప్పు క్షమింతురుగాక.

రా—నీవు చేసినయపరాధ మేమి?

లవు—గుఱ్ఱముతో వచ్చినయోధులు నాయనగారి ప్రతాపమును బ్రకటింపఁగా విని

వీ నివలెఁ బ్రవర్తించినాను.

రా—కుమారా! ఇది క్షత్త్రియుని కలంకారమే కదా!

చ. ఇతరుల తేజ మెన్నఁడు సహింపఁడు దేజము గల్గువాఁ, డనా
హతమును నైజ మైనయది యాతని ధర్మము నిశ్చయం, బనా
రతము తపింప నుజ్జ్వలకరంబుల సూర్యుఁడు సూర్యకాంతము
ద్గతపరిభావ మోర్వనివిధంబున నగ్నికణాలు గ్రక్కదే?

చ—ఈమహావీరుని తేజస్సే కాదు, కోపముగూడ శోభాయమానమే యగుచున్నది, చిత్తగింపుఁడు. నాప్రియవయస్యుఁడు ప్రయోగించిన జృంభకాస్త్రమహిమచే సైన్యము లెల్ల నిశ్చేష్టములై పడియున్నవి.

రా—కుమారా! అస్త్ర ముపసంహరింపుము. చంద్రకేతూ! నీవు వెళ్ళి నిశ్చేష్టు లగుటచే నాశ్చర్యపడుచున్న సైనికులను మంచిమాటలచే నాదరింపుము.

లవు—[ధ్యానము నటించును]

చం—చిత్తము చిత్తము (నిష్క్రమించును)

లవు—తండ్రీ! అస్త్రము శాంతించినది.

రా—వత్సా! జృంభకాస్త్రములును వానిప్రయోగసంహారములును, అతిరహస్యము లైనవి.

గీ. మున్ను బ్రహ్మాది గురువులు భువనహితము
గోరి వేయేళ్లు పొనరించి ఘోరతపము
జపతపస్సిద్ధనైజ తేజః ప్రభావ
మనఁగఁ గనుఁగొని రీజృంభకాస్త్రచయము.

వారివలన నవి కృశాశ్వునకు వచ్చినవి. ఆమహాముని వేయేండ్లు పైగాఁ దన శుశ్రూష యొనర్చినవిశ్వామిత్రున కాయస్త్రమయ మైనయుపనిషత్తు నేర్పెను. అపూజ్యుఁ డైనకౌశికుఁడు దానిని నాకుఁ జెప్పెను. ఇది జృంభకములపూర్వసంప్రదాయము. నీ కీయస్త్రసంప్రదాయ మెక్కడనుండి వచ్చెనో యని తెలియక యడుగుచున్నాను.

లవు—మా కీయస్త్రములు తమంతటఁ దామే వచ్చినవి.

రా—(ఆలోచించి) ఏమి! ఇది యసంభావ్యమా? ఇ దేదో మహాపుణ్యమువలన సంభవించినయొకమహిమ కావచ్చును. అబ్బాయీ! మా కని బహువచనము ప్రయోగించితి వేమి?

లవు— మే మిద్దఱము కేవలపిల్లలము.

రా— ఆ రెండవవాఁ డెక్కడ?

[తెరలో] మిత్రా దాండాయనా!

శా. ఏమన్నావుర! చెప్పుచెప్పు మఱి యేమీ! యేమి! మాతమ్ముఁడున్
భూమీనాథుని సైనికప్రవరులున్ బోరాడుచున్నార? వ
హ్వా! మే ల్మే లధిరాజశబ్ద మిపుడే యస్తంగతం బయ్యెడున్
భూమీనాథులశస్త్రపావకము లామూలంబు చల్లారెడున్.

రా—

గీ. ఇంద్రనీలమణిచ్ఛవి యెవఁ డితండు?
కాలజలధరగర్జనఁ గడిమిచెట్టు
మొగ్గ దొడిగినకరణి నీముద్దులాని
కంఠరవమున నామేను గగురుపొడిచె.

లవు— ఇతఁడే యార్యుఁ డయినమాయన్న కుశుఁడు. భరతాశ్రమమునుండి వచ్చుచున్నాఁడు.

రా— (సంతోషముతో) అట్లయినఁ గుమారా! ఆచిరంజీవి నిచ్చటికిఁ బిలుచుకొని రమ్ము.

లవు— చిత్తము [పరిక్రమించును]

కుశుఁడు— [కోపధైర్యములతో విల్లు మ్రోఁగించి]

చ. అమలినసూర్యవంశభవు లైనమనుప్రముఖక్షితీశ్వరుల్
దమితసురారులై యభయదక్షిణ లింద్రున కిచ్చి, రట్టియు
త్తములకు నాకుఁబో రయిన ధన్వము గాదొకో యీశరాసనం
బఖిలసదస్త్రదీధితులు హారతులై చెలు వొందు నారితో.

[అని వికటముగా నడచును]

రా— ఓహో! ఏ మీక్షత్రియకుమారుని పౌరుషాతిరేకము!

ఉ. చూపు జగత్త్రయీబలముఁ జూచును గాదె? తృణీకరించి, పె
ల్లూఁపును గాదె యానడక యుద్ధతిమై ధరణీతలంబు? నా

రా! పసివాఁడే కాని గిరిరాజనంగా గురువై తనర్చు నీ
పాపఁడు వచ్చు వీరరసభాసురమూర్తియొ దర్పమోయనన్.

లవు—[సమీపించి] అన్నా! జయము జయము.

కుశు—తమ్ముఁడా! యుద్ధము యుద్ధమనువార్త వినవచ్చెను. సత్యమేనా?

లవు—అదేఁతః దాని కేమిఁగాని, నీవు దర్పము విడిచి వినయముతో నుండవలె నని నాకోరిక.

కుశు—ఎందుచేత?

లవు—పూజ్యుఁడైన రఘుకులనాయకుఁ డిచ్చట నున్నాఁడు.

కుశు—[ఆలోచనతో] రామాయణకథానాయకుఁడును బ్రహ్మకోశరక్షకుఁడు నైన శ్రీరాముఁడా?

లవు—అవును.

కుశు—ఆమహాత్ముని దర్శనము తప్పక కోరఁ జేయఁదగినదే. కాని, అతనియొద్ద కేవిధముగఁ బోవలయునో యని యాలోచించుచున్నాను.

లవు—తండ్రియొద్దకుఁ బోవునట్లె—

కుశు—అదెట్లు?

లవు—సుజనుఁడును గంభీరుఁడు నూర్మిళాతనయుఁడు నైన చంద్రకేతుఁడు 'ప్రియవయస్యా' యనుచు నన్ను స్నేహభావముతోఁ జూచుచున్నాఁడు. ఆసంబంధమును బట్టి రాజర్షిని దండ్రివలెఁ జూచుట ధర్మము.

కుశు—సరే. ఈసమయమందు రాజన్యునియెడ వినయము చూపుట తప్పు గాదు.

[ఇద్దఱు పరిక్రమింతురు]

లవు—అన్నా! ఆకారానుభావగాంభీర్యములను బట్టి యూహింపఁదగిన లోకోత్తర సచ్చరిత్రముల రాశియో యన విలసిల్లు నీమహాపురుషు నాలోకింపుము.

కుశు—(చూచి)

గీ. ఏమియనుభావ మేమిరూ పేమిమహిమ?
యహహా! రామాయణకవీంద్రుఁ డనఘుఁడైన
యర్థనాయకు సమకూర్చి యర్థదివ్య
ఫణితి వాగ్దేవి నుపయోగపఱిచెఁ గాదె?

తాత! ప్రాచేతసాంతేవాసి యగుకుశుఁడు నమస్కరించుచున్నాఁడు.

రా—కుమారా! రమ్ము చిరంజీవివి కమ్ము.

గీ. నూతనామృతపూర్ణజీమూతశోభఁ
బూని నిగనిగలాడునీమేను నేను
గాఢముగ ననురక్తిమైఁ గౌఁగిలించు
వాఁడ సుఖియింపఁ జూచుచున్నాఁడ రమ్మ.

(కౌఁగిలించి) ఏమిది? ఈబాలుఁడును—

మ. అనురాగామృతజాతమై పయికి సర్వాంగస్రుతంబైననా
తనుసారంబొ? బహిర్గతంబయినచైతన్యాంశమో నాఁగ సం
జనితాహ్లాదరసపరిపూర్ణహృదయస్రావాభిషిక్తాంగుఁడై
నను నాలింగితు సేయుచున్నతనవలె నానందాబ్ధి నోలార్చెడున్.

లవు—అయ్యా! చండభానుఁడు లలాటంతపుఁడై ప్రజ్వలించుచున్నాఁడు. కావున దయచేసి యీనెట్లనీడను విశ్రమింపుఁడు.

రా—నాయనా! నీయిష్టము నెఱవేర్చెదను. (పరిక్రమించి యందఱును గూర్చుందురు)

రా—(తనలో)

గీ. భక్తి వినయంబుఁ గడు నుట్టిపడుచు నున్న,
వీరిచూపులలో మాటతీరులోను
నడక మున్నగువానిలో నడరుచుండె
రాజ్యలక్ష్మిని సూచించు రాచతీవి.

గీ. శారదేందున కాత్మాంశుజాలమట్లు
కమలమున కాత్మమకరందకణములట్లు
వీరిలావణ్యమహిమయే వీరిమేన
నవనవోన్మేషరుచి నిరంతరము గూర్చు.

మఱియును జూడఁజూడ రఘువంశసంజాతుల బాల్యశోభ వీరియందధికముగాఁ గనవచ్చుచున్నది.

గీ. పోలవే?-మూఁపు లాఁబోతుమూఁపురంబు,
చూపులు ప్రసన్నసింహకిశోరదృష్టి,

కాయములు మేచకకపోతకంఠసీమ,
కంఠనాదంబు శుభమృదంగస్వనంబు.

(మరలఁ జక్కఁగఁ జూచి) ఓ! కేవలము మావంశమువారి ననుకరించు నాకారమే కాదు! జానకిపోలికకూడ వీరియందు గనవచ్చుచున్నది. ఆహా! లక్ష్మీప్రదమైన ప్రియురాలి సుందరవదనారవిందము నేఁడు నాపై మరల గోచరించినట్లున్నది.

గీ. ధవళతరదంతకాంతిసుందరము లైన
వీరిపెదవులుఁ జెవులు నావెలఁది వేసు
కనులు వీరివి యెఱుపు పామెకనులు నలుపు,
కాని, సౌందర్య మంత యొక్కటియె నిజము.

(ఆలోచించి) వాల్మీకిమహర్షి నివసించు నీయరణ్యమే దేవిని విడిచిపెట్టిన చోటు. వీరియాకారమా! యిట్టిది. వయస్సా! ఈమధ్యకాలమునకుఁ దగియున్నది. వీరిప్రభావమా! అసాధారణము. మఱియు, "మా కీయస్త్రములు తమంతటఁ దామే వచ్చిన" వని లవుఁడు చెప్పినమాట స్మరింపఁగా, చిత్రపటదర్శనసమయమందు "ఈ మహాస్త్రము లెల్లవిధముల నీసంతానము నాశ్రయింపఁగల"వని నేను దేవితోఁ బలుకుచు నిచ్చిన యభ్యనుజ్ఞ యిప్పుడు జ్ఞప్తికి వచ్చినది. కానిచో వీరి కెట్లు వచ్చును? పూర్వమహర్షుల కైనను గురుసంప్రదాయము లేకుండఁగా నీజృంభకాస్త్రములు వచ్చినట్లు వినియుండలేదే! [ఆలోచించి] లోకములోఁ బ్రియజనసంబంధమైన సంయోగము సుఖహేతువును, వియోగము దుఃఖహేతువు నగుట సహజము. నాకు సంభవించినయీవియోగమో ఆశ్చర్యపరిణామముఁ దెలియఁజేయుచు హృదయమునకు సుఖదుఃఖములు రెంటిని గూడఁ గలిగించుచున్నది. ఆహా! 'మేము కవలపిల్లల'మనుట గూడ నాపూర్వానుభవమునకు మిక్కిలి సరిపడుచున్నది. అప్పుడు దేవి గర్భమున కవలపిల్లలు పుట్టుదు రని సూచించుచునే యుండెను. (విచారముతో)

చ. పరిచయ మెక్కువై చనవు పారము ముట్ట రహస్యవేళ నా
సరసఁ దనంతఁ జేరుటకు జంకని దైనను, సిగ్గు చూపుసుం
దరికదు పంతట న్నిమిరి తాల్చెను గర్భయుగంబటంచు ముం
దరఁ గనుఁగొంటి, నామెయుఁ బదంపడి కన్గొనెఁ గొన్నినాళ్ళకున్.

(కంటనీరు వెట్టి) ఏదో యొకయుపాయముచే వీరి నడుగుదునా?

లవు—

గీ. భవ్యచారిత్ర! లోకశుభప్రదంబు
నిర్మలం బగుముఖము కన్నీటఁ దడిసి
దట్ట మగుమంచుచినుకులఁ దడిసినట్టి
పుండరీకంబుకాంతిని బొందె నేమి?

కుశు—అఁ! తమ్ముఁడా! ఏమిది?

ఉ. ఆయెను సీత లేనిబ్రతు కక్కట! దుఃఖము రాదె తేనికిన్?
వేఁయసి పోయినన్ జగము పెద్దయరణ్యము, వారిప్రేమ మ
జ్ఞేయ మపార మీవిరహసింధువు, దీనినెటుంగ వాక్కొ? రా
మాయణ మెన్నఁడున్ జదువనట్టులు ప్రశ్నలు వేయఁజూతువే?

రా—(తనలో) నాయనా! మాటలు మిక్కిలి తటస్థముగా నున్నవి. అనుగవద్ద. ముగ్ధహృదయమా. నిష్కారణముగా నీ కీయెగురుపా టెందుకు? అకటా! దుఃఖవేగమున హృదయము బద్దలగుటచేతఁగదా, పిల్లలు గూడ నన్నుఁ జూచి కనికరము చూపుచున్నారు! కానీ! ఇఁక దీనిని గప్పి పుచ్చెదను. (ప్రకా-) కుమారులారా! రామాయణము రామాయణమని సూర్యవంశపవిత్ర స్వరూపముగా వాల్మీకిమహాకవి రచియించిన దివ్యవాణీవిలసితమైనమహాకావ్య మొకటి తఱుచుగా వినవచ్చుచున్నది. అం దేదయినఁ గొంచెము వినవలెనని కుతూహలపడుచున్నాను.

కుశు—మేము మాకావ్య మంతయుఁ జదివితిమి. బాలకాండము కడపటిశ్లోకము లిందు మాజ్ఞప్తికి వచ్చినవి.

రా—చదువు నాయనా!

[1] కుశు—

శ్లో. ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి
గుణా ద్రూపగుణా చ్చాపి ప్రీతి ర్భూయోఽభ్యవర్ధత

---

[1] ధర్మపత్ని యగుటచేతను, తండ్రిగారు కూర్మితో సమకూర్చిన దగుటచేతను సీతాదేవి రామునికిఁ బ్రియురా లయ్యెను. ఆమెచక్కఁదనమును బట్టియు సద్గుణసంపత్తినిబట్టియు నామెయెడ రామునకు మఱియుఁ బ్రేమ హెచ్చెను. అట్లే సీతాదేవికి శ్రీరాముఁడు ప్రాణములకంటె నెక్కువ ప్రియుఁ డయ్యెను.

తద్ధైన రామ స్సీతాయాః ప్రాణేభ్యోఽపి ప్రియోఽభవత్
హృదయం త్వేవ జానాతి ప్రీతియోగం పరస్పరం.

రా—(తనలో) అయ్యో! ఇది గుండెలోని పోటై మిక్కిలి దుస్సహమగుచున్నది. హా దేవీ! ఇదంతయు నిజమే కదా! ఆహా! నీతోఁ గలిసి యున్ననాఁటి సాంసారిక సుఖానురాగాదులు దైవవంచనచే సంభవించిన నీ వియోగమున స్మరణమాత్రము లైనవిగదా! అయ్యో!

ఉ. చక్కఁగ నత్తుకొన్న సరసం బగుపొత్తున మించుసంతసం
బెక్కడ? మామనోరథము లెక్కడ? మామదిలోని ప్రేమసొం
పెక్కడ? సౌఖ్యదుఃఖముల నేకమనస్కత యెక్క? డైన, వీఁ
డెక్కడి పాపజీవుఁడొకో? యిప్పటి కైన నశింపఁ డక్కటా!

హా! కష్టము కష్టము. ఈశ్లోకములవలన మిక్కిలి దుఃఖకరమును దుస్సహంబు నగుచుఁ బ్రియురాలి సౌందర్య సౌజన్యాది సుగుణసంపదను దెలియఁజేయు కాలము స్మృతికి వచ్చినది గదా. అపుడు—

గీ. సీతయురమున యౌవనచిహ్న లంకు
రించి కొన్నాళ్ళ కవి విస్తరించువేళ
నింగితము ప్రాయ మనురాగ మెఱిఁగి మదనుఁ
డంగముల ముగ్ధుఁ డెదఁ బ్రోడ యగుచు నలరె.

లవు—ఇది చిత్రకూటమార్గమున మందాకినీతీర వనవిహార సమయమున సీతాదేవి నుద్దేశించి రాఘవుఁ డన్నది.

(1) శ్లో. త్వదర్థ మివ విన్యస్త శ్శిలాపట్టోఽయ మగ్రతః
యస్యాయ మభితః పుష్పైః ప్రవృష్ట ఇవ కేసరః.

రా—[సలజ్జాస్మితస్నేహకరుణముగాఁ దనలో] పిల్ల లేమియు నెఱుఁగరు గదా! అందులోను వనవాసులైనవారు బొత్తిగా నెఱుఁగరు. హా దేవీ! ఆసమయమందలి పరిణయక్రీడాపరిసంగము స్మరించుచున్నావా? హా కష్టము!

---

వారి పరస్పర ప్రేమను వారిహృదయములే యెఱుఁగును.

[1] ప్రేయసీ! నాలుగుప్రక్కలను పొగడవృక్షము పువ్వులు వర్షించినట్టియీయెదుట నున్న రాతిపలక నీకొఱకు వుంచఁబడిన ట్లున్నది.

ఉ. శ్రమజలశీతలం బయి నిరాభరణోజ్జ్వలకర్ణపాళిర
మ్యము నయి పత్రభంగమలినాకృతిఁ జెందని చెక్కులన్ మనో
జ్ఞము నయి యేటిగాలి కలకల్ చలియించి పడంగ వానిమ
ధ్యమునఁ జెలంగు ఘాలరుచు లారిననాఁటి మొగంబు నెంచెదన్.

[స్తంభించిన ట్లుండి సకరుణముగా] ఆహా! ఏమిది?

మ. పరదేశంబున కేగుబంధుల సదా భావింప భావింప ముం
దరఁ బ్రత్యక్షము కాకపో రెపటికైనన్, జచ్చువా రట్లు వ
త్తురొకో! భార్య నశింప జీర్ణవనమై తోఁచున్ జగం బక్కటా!
చిరదుఃఖం బనుకుమ్ములో నణఁగి నాచిత్తంబు పక్వం బగున్

[తెరలో]

ఉ. ఈకొమరుల్ భటాళి కలహించినవార్తకు భీతి చెంది వా
ల్మీకివసిష్ఠులున్ జనకమిశ్రుఁ డరుంధతి రాముతల్లు ల
త్యాకులచిత్తులై నడక తత్తఱ మంద జటల్ చలింపఁగా
నాకడనుండి యీకడకు నట్లులె వచ్చుచునుండి రెట్టులో!

రా— ఏమి? అరుంధతీవసిష్ఠులు, మాఅమ్మలు, జనకమహర్షియు నిచ్చటనే యున్నారా! అయ్యో! వీరి నెట్లు చూతును? [దుఃఖముతో వారివైపు చూచి] పూజ్యుఁడైనజనకమహర్షి యిక్కడికి వచ్చుట వజ్రము వచ్చి నాహృదయమున గ్రుచ్చుకొనుటయే, అకటా!

మ. సమసంబంధ మి దంచు వేదగురువుల్ శ్లాఘింపఁగా మావివా
హము గావించినతండ్రిమామలముదం బానాఁడు వీక్షించి, యి
ట్టిమహాపాప మొనర్చి నేఁ డితనిఁ గంటిన్ గాని నేఖండఖం
డము లైనాఁడనె? కాక, యెట్టిపని కైనన్ రాముఁ డర్హుం డగున్.

[తెరలో] కష్టముకష్టము.

గీ. ముందు పడినట్టిజనకుండు మూర్ఛ దేఱి
యితఁడె యనుభావమాత్రసమీక్ష్యుఁ డైన
రాముఁ డని చూపఁ దల్లు లౌరా యటంచు
బాగలి నిశ్చేష్టలై మూర్ఛపోయి రకట!

రా —

గీ. తాత! మిథిలేశ! ననుఁ గన్నతల్లులార!
యుభయవంశశుభం బైనయుర్విపుత్రి
యందు దయమాలినట్టి పాపాత్మునందు
కరుణ చూపుట వ్యర్థంబు కాదె మీకు?

కానీ! వారి కెదురుగా వెళ్ళి నమస్కారాదులచే సత్కరించెదను

[అని లేచును]

కుశలవులు — తాతా! ఇటు దయచేయుఁడు.

[సకరుణముగా నందఱు పరిక్రమించి నిష్క్రమింతురు]

-- ఇది షష్ఠాఙ్కము —

# ఉత్తరరామచరిత్రనాటకము

## సప్తమాఙ్కము.

[అంతర్నాటకము]

[పిదప లక్ష్మణుఁడు ప్రవేశించును]

ల—అహో! ఆశ్చర్యము. భగవంతుఁడైన వాల్మీకిమహర్షి మాతోఁగూడ బ్రాహ్మణక్షత్రియసహితమైన సకలపౌరజానపదప్రజాసముదాయము నీసభకుఁ బిలిపించి, నిజమహిమచే సకలదేవాసుర నాగాదిసంఘమును సమస్త జంగమస్థావరసమూహమును సమీపమునకు రావించెను. మా అన్నగారు నాకిట్లాజ్ఞాపించినారు. "వత్స లక్ష్మణా! అప్సరస లభినయించు తననాటకము చూచుట కని భగవంతుఁడైన వాల్మీకిమహాముని పిలిపింపఁగా మన మందఱ మిచ్చటికి వచ్చినాము కావున నృత్తగీతాదిరంగస్థానమైన గంగాతీరమున సమాజసన్నివేశము చేయుము."

ఆర్యునియాజ్ఞచే నేను మానవులకు దేవదానవాదులకు భూతజాతమునకుఁ దగినరీతిని స్థానము లేర్పఱచితిని. [ముందుచూచి] ఇతఁడే రఘువంశపావనుఁడైన యార్యుఁడు —

క. పరిపాలనాశ్రమంబునఁ
జరియించుచుఁ గష్టతాపసవ్రతుఁ డగునీ
నరపతి వాల్మీకిమునీ
శ్వరునందలి గౌరవమున వచ్చుచునుండెన్.

ఆర్యా! జయము జయము.

రాముఁడు—[ప్రవేశించి] లక్ష్మణా! రంగస్థలమునఁ బ్రేక్షకు లందఱు నుచితస్థానములఁ గూర్చున్నారా?

ల—చిత్తము.

రా—ఈకుమారకుశలవులు కుమారచంద్రకేతువుతో సమానముగా నర్హస్థానమునఁ గూర్చుండఁ బెట్టఁదగినవారు.

ల—దేవరవారికీ పిల్లలమీఁద నున్న ప్రేమనుబట్టి యట్లే యేర్పాటుచేసినాను. ఇదిగో రాజపీఠము. మీ రిందు దయచేయుఁడు.

[అందఱు యథోచితముగాఁ గూర్చుందురు.

రా—ప్రదర్శనము ప్రారంభింపవచ్చును,

సూత్రధారుఁడు—[ప్రవేశించి] సభాసదులారా! మహాత్ములును సత్యవాదులు నైన వాల్మీకిమహర్షిగారు "మేము యోగదృష్టితోఁ జక్కఁగాఁ జూచి కరుణాద్భుతరసమిశ్రమును బరమపావనము నగు వచనామృతమును సమకూర్చినాము. ఇది చిన్నరూపక మైనను గౌరవార్హము గావున దీనియెడ సావధానముగా నుండవలె"నని జంగమస్థావరాత్మక మైన సకలజనమున కానతిచ్చుచున్నారు.

రా—దీనినిబట్టి మహర్షులు ధర్మసాక్షాత్కారముగలవా రనియు, పరమపవిత్రములును సుధారసపూరితములు నైన రామహాత్ముల ప్రజ్ఞానముల కడ్డు లే దనియు స్పష్టమైనది. కావున నీకావ్యార్థము సత్యమా యసత్యమా యని శంకింపఁ దగినదికాదు.

[తెరలో] హా! ఆర్యపుత్త్రా, హా కుమారలక్ష్మణా!

ఒంటికత్తెను, దిక్కులేనిదానను, నిరాశురాలను, ఆసన్నప్రసవవేదన నైన నన్ను శార్దూలములు మ్రింగఁ జూచుచున్నవి. హా! ఇపుడు గతిమాలినదాన నై గంగలోఁ బడుచున్నాను.

ల—[తనలో] అయ్యో, ఎంతకష్టము! ఈప్రసంగ మనుకొన్నదానికంటె వేఱుగునది.

సూ—గీ. విభునిచే ఘోరవనమున విడువఁబడిన
పట్టమహిషి ధరాత్మజ పరమసాధ్వి
జానకీదేవి సంప్రాప్త మైనప్రసవ
బాధ కోర్వక గంగలోఁ బడుచునుండె.

[అని నిష్క్రమించును] ఇది ప్రస్తావన.

రా—[తొట్రుపాటుతో] దేవీ! ఉండు ముండుము. లక్ష్మణాని బ్రతీక్షింపుము.

ల—అన్నా! ఇది నాటకము.
రా—హా దేవీ దండకారణ్యప్రియసఖీ! ఇది నీకు రాముఁడు తెచ్చిపెట్టిన దుఃఖము.
ల—ఆర్యా! దుఃఖము విడిచిపెట్టి ఋషికల్పితమైన యీప్రబంధమును చిత్తగింపుఁడు.
రా—ఇదిగో! వజ్రమూర్తినై సిద్ధముగా నున్నాను.

(పిదప నొక్కొక్కబిడ్డ నొడిలోఁ బెట్టుకొన్న గంగావసుంధరలచేఁ బట్టుకొనఁబడి మూర్ఛితురాలైనసీత ప్రవేశించును)

రా—లక్ష్మణా! కాలుతీసి కాలు పెట్టుటకుఁ గూడఁ గనఁబడని గాఢాంధకారములో మునిఁగినట్లుగా నాకన్నులు కానరాకున్నవి. నన్నుఁ బట్టుకో.

గం-వ-గీ. ఊఱడిల్లుము జానకీ! యూఱడిల్లు
మమ్మ కల్యాణి! నీదుభాగ్యము ఫలించె
రఘుకులస్థితికారులై ప్రణుతి కెక్క
కవలపిల్లల నీటిలోఁ గంటి వీవు.

సీ—(ఊఱడిల్లి) దైవవశమునఁ బిల్లలను గన్నాను. హా ఆర్యపుత్రా! (మూర్ఛిల్లును.)
ల—అన్నా! (అని కాళ్ళపైఁబడి) మనయదృష్టము ఫలించినది. రఘువంశము శుభప్రదముగా మొలక లెత్తినది. (అయ్యో! ఆర్యుఁడు కన్నీరు కాలువలు గట్ట మూర్ఛ మునిఁగి యుండెనే! (విసరుచున్నాఁడు.)
గం-వసు—అమ్మా! ఊఱడిల్లు మూఱడిల్లుము.
సీ—(ఊఱడిల్లి( ఎవ రమ్మా మీరు? నన్ను విడిచిపెట్టండి.
వసు—ఈమె మీయత్తగారి కులదేవతయైన భాగీరథి.
సీ—దేవీ! నమస్కారము
గం—నీపాతివ్రత్యమునకును సచ్చారిత్రకును దగిన శ్రేయస్సంపత్తిని గాంచుము.
ల—మహానుగ్రహము.
గం—ఈమె నీ జనని విశ్వంభరాదేవి.
సీత—అమ్మా! ఈయవస్థలో నన్నుఁ జూచినావు.
వసు—రా తల్లీ! రా బిడ్డా! (ఇరువురు కౌఁగిలించుకొని మూర్ఛిల్లుచున్నారు!)
ల—(సంతోషముతో) భాగ్యవశమున గంగావసుంధరలు సీతాదేవియెడ ననుగ్రహించినారు.
రా—(చూచి) ఇది నాదుఃఖమును మించినదుఃఖముగా నున్నది. ఆహా!
గం—పూజ్యురాలైనభూదేవి గూడ దుఃఖించుట చూడఁగా, అపత్యస్నేహమునకు లొంగనివా రుండరని తెలియుచున్నది. కాకపోయినను, మనస్సునకు గట్టి

మూఁడియు, హృదయములోని యుపద్రవమును సంసారతంతువు నైన యీపుత్ర స్నేహము సర్వసాధారణముగదా! సఖీ భూతధాత్రీ! కుమారీ వైదేహీ! యూఁడిల్లుఁడు.

వసు—(యూఁడిల్లి) సీతను గన్నదానికిఁ జిత్తశాంతి యెట్లు గలుగు నమ్మా?

గీ. రాక్షసులమధ్య నునికి చిరంబు తొలుత
నిపుడు ఘోరవియోగ మో గ్రెట్టు లమ్మ!

గం— అరయఁ బరిపక్వపూర్వకర్మానుభూతి
మార్గములు మాయ నెవరు సమర్థు లమ్మ!

వసు—దేవీ జాహ్నవీ! సరేకాని, మీరామభద్రునకెది యుక్తముగా నున్నదమ్మా?

గీ. చిన్నతనమున నఁ బట్టినసీతపాణి
యీమెశీలంబు సుగుణంబు లీమెకులము
వహ్ని జనకుండు నేను సర్వంబు గూడ
నప్రమాణీకృతం బయ్యె నతని కౌర!

సీ—హా! ఆర్యపుత్రా! స్మరించుచున్నావా?

వసు—ఆఁ!! నీ కార్యపుత్రుఁ డెవఁడు?

సీ—(సిగ్గుతోఁ గన్నీటితో) ఔను. మాఅమ్మ చెప్పినట్లే-

రా—తల్లీ భూదేవీ! అనార్యపుత్రుఁడనై యిట్లున్నాను.

గం—దేవీ! ఈజగత్కాలంబమున కంతకును నీవే కదా శరీరము! అట్లయ్యు నెఱుఁగని దానివలె నల్లునియెడఁ గోపము వహించెద వేల?

చ. పరగెను ఘోరమైనయపవాదము లోకమునందు, లంకలో
జరిగినయగ్నిశుద్ధియుఁ బ్రశంసయు నిచ్చటిమూఁక నమ్మనే?
లోకము సంతసించుగతి లోఁ దలపోయుచు నేలుచున్న యి
క్ష్వాకులసామ్మ గాదె? యిఁక బాలుఁ డొనర్చున దేమిచెప్పుమా?

ల—సర్వవిషయములయందును దేవత లమోఘుజ్ఞానము గలవారుగదా! భూదేవికి మాత్రము నిజము తెలియదా యేమి?)

గం—అయినను నీ కంజలి ఘటించి మ్రొక్కుచున్నాను. ప్రసన్నరాలవు కమ్మ.

రా—తల్లీ భాగీరథీ! భగీరథవంశమునఁ బూర్తిగా మహానుగ్రహము ప్రకటించినావు.

వసు—దేవీ! మీయెడ నేను నిత్యమును బ్రసన్నరాలనే. పుత్రీప్రేమచేఁ గలిగిన

దుఃఖము దుస్సహ మగుటచే నిట్లు పలికితిని గాని వేఱుకాదు. రామభద్రు నకు సీతమీఁద నున్న యనురాగ మెఱుఁగనివాఁడను గాను,

గీ. దహ్యమానమనస్కుఁడై దైవగతిని
భార్య విడనాడియును రామభద్రుఁ డతని
ధైర్యబల మూఁతగాఁ బాలితప్రజాళి
భాగ్యవశమున నెట్టులో బ్రతికి యుండె.

రా—పెద్దవారికిఁ బిన్నలమీఁద నెప్పుడును దయ తప్పదు గదా!

సీ—(దుఃఖముతో దోసిలియొగ్గి) అమ్మా! నన్ను నీలో లయము చేయుము.

గం—ఏమన్నావు? ఎంతమాట? తప్పు తప్పు! లయము లేకుండఁ గా వేయేండ్లు జీవింపుము.

వసు—అమ్మా! నీవు నీపిల్లలగతి చూచుకోవలెను గదా!

సీ—అనాథ నైతిని. ఇఁక నీపిల్లలతో నేమి?

రా—హృదయమా! వజ్రమువలె మా గట్టిగా నున్నావు!

గం—నీవు సనాథురాలవై యుండ ననాథ వెట్లయితివి?

సీ—అభాగ్యురాల నైన నాకు సనాథత్వ మెక్కడ?

గం-వసు-గీ. జగములకు శ్రేయ మొనగూర్పఁ జాలినట్టి
నిన్ను నిందించుకొందువే నీవు తల్లి!
నిన్నుఁ దాఁకుటచే మాకు నిశ్చయముగఁ
బావనత్వంబు వర్ధిల్లెఁ బావనాంగి!

ల—అన్నా! వినండి.

రా—లోకము వినుఁగాక.

(తెరలోఁ గలకలము)

రా—ఇదేదో యత్యద్భుతము.

సీ—కలకలధ్వనితో నాకాశము ప్రజ్వలించుచున్న దిదేమి?

గం.వసు—ఆఁ! తెలిసినది తెలిసినది. కృశాశ్వుఁడు కౌశికుఁడు శ్రీరాముఁడు నను ముగ్గురును క్రమముగా గురువులైనజృంభకాస్త్రములతో నితర దివ్యాస్త్రశస్త్రములు ప్రాదుర్భవించుచున్నవి.

(తెరలో)-గీ పావనీ జానకీదేవి! వందనములు
రఘుకులాగ్రణి చిత్రదర్శనము వేళఁ

గరుణను వాగ్దాన మిచ్చి సకతనము మాకు
గురువు లైనారు నీముద్దుకొడుకు లిపుడు.

సీ—సంతోషము సంతోషము. వీ రస్త్రదేవతలు. ఆర్యపుత్రా ! మీయనుగ్రహ మిప్పటికిని మామీఁదఁ బ్రసరించుచున్నది.

ల—"ఈమహాస్త్రము లెల్లవిధముల నీసంతానము నాశ్రయింపఁగల" వని మీ రప్పుడు సెల విచ్చినారు.

గం-వసు-గీ. అస్త్రదేవతలార! జోహారు మీకుఁ,
గలిగె ధన్యత మాకు మీకరుణవలన
బాలకులు మిమ్ముఁ దలఁచిన కాలమందు
దర్శనం బిందు మీకు భద్రంబు, పొందు.

రా-గీ. విస్మయానందసందర్భవికల మైన
యట్టిదుఃఖతరంగంబు లంతరంగ
మంత గలఁచుచు వచియింప నలవి కాని
తీవ్రమురవస్థలో ముంచి తేల్చుచుండె.

గం-వసు—సుమాకీ! ఇపుడు నీ కొడుకులు రామభద్రునితో సమాను లైరి. ఆనందింపుము

సీ—ఆర్యులారా! వీరికి క్షత్రియోచిత మైనయుపనయనాది సంస్కారము లెవరు చేయుదురు?

రా-గీ. ఘనవసిష్ఠమహాగురుకరుణ నెసఁగు
రఘుకులము. వన్నెఁ దెచ్చినరమణి సీత
పిల్లలకు క్షత్రియోచితవిధు లొనర్చ
గురువు గనరాక యక్కటా కుందుచుండె!

గం—కల్యాణీ! నీ కీవిచార మెందులకు? పాలు విడువఁగానే యీపిల్లలను దీసికొని పోయి వాల్మీకిమహర్షి కప్పగించెదను. జనకవంశమునకు శతానందుఁడును, రఘువంశమునకు వసిష్ఠుఁడు నెట్లు గురువులో యట్లే యిపు డారెండువంశముల కును వాల్మీకిమహర్షియే గురు వగును. అతఁడే నీపుత్రులకుఁ గులోచితసంస్కారములు గావించి బ్రహ్మక్షత్రియవంశోచితము లయిన వేదధనుర్వేదములు రెంటి నుగూడఁ జెప్పును.

వసు—దేవీ! చక్కఁగా నాలోచించినావు.

ల—అన్నా! నిజము చెప్పుచున్నాను. ఆ యూసందర్భములనుబట్టి చూడఁగా, ఆపిల్లలే యీకుశలవు లని నా యభిప్రాయము.

గీ. వీర లిద్దఱు వాల్మీకిఁ జేరినారు
వీరు లాజన్మసిద్ధాస్త్రసారు లైరి
వీర లాకృతి నినుఁ బోలినారు మఱియుఁ
దలఁపఁగా వీరు ద్వాదశాబ్దములవారు.

రా—ఇట్టియూహలలోనే నాహృదయము మునిఁగి తేలుచుండుటచే మూఢుఁడ నైనాను.

వసు—కుమారీ! రమ్ము. రసాతలము పావనము చేయుము.

రా—హా ప్రేయసీ! నీవు లోకాంతరముఁ జేరినావు.

సీ—అమ్మా! ఈజీవలోకపరాభవ మనుభవింపఁజాలను. నన్ను నీలో విలయము చేయుము.

ల—ప్రత్యుత్తర మేమి వచ్చునో?

వసు—నాయాజ్ఞనుబట్టి పాలు విడిచిపెట్టునంతవఱకును నీపిల్లలను జూచుకొనుచు నుండుము, తరువాత నీయిష్టము వచ్చినట్లే చేసెదను.

గం—ఇది యుక్తముగా నున్నది. (సీతయు గంగావసుంధరలును నిష్క్రమింతురు)

రా—హా సచ్చరిత్రదేవతా! దీనినిబట్టి నీవు లోకాంతరమున విశ్రమించియున్నావనుట నిశ్చయము. హా దేవీ! (అని మూర్ఛిల్లును)

ల—దేవా మహానుభావా! ప్రాచేతసా! రక్షింపు రక్షింపు. నీనాటకము సాంతముగాఁ జూచినాము.

(తెరలో) గీతవాద్యసాధనములు తీసివేయుఁడు. ఓ జంగమస్థావరములారా! ఓ మర్త్యామర్త్యులారా! వాల్మీకిమహర్షి చేసినప్రతిజ్ఞచొప్పునఁ గనవచ్చునత్యద్భుతమును జిత్తగింపుఁడు.

ల—[చూచి] ఆహా! ఆశ్చర్య మాశ్చర్యము.

చ. కలఁగుచునుండెఁ గవ్వమున గట్టిగఁ ద్రిప్పినయట్లు జాహ్నవీ
సలిలము, దేవతల్ మునులు సంతస మొప్పఁగ మింట నిండి రా
జలమునునుండి లేచి యలసాగరకన్యకఁ బోలినట్టి భూ
తలసుత సీత, జాహ్నవియు ధాత్రియుఁ దోడుగ సేవచ్చుచుండెడిన్.

(తెరలో) గీ. లోకవంద్యా! అరుంధతీ! నీకు భద్ర
మగుగాక! గంగావసుంధరాఖ్యలము మేము
నీకు నర్పింప వచ్చినా మీకుమారి
నిదిగో మాసీత మాకోడ లిద్ధచరిత.

అ — అహో! ఆశ్చర్య మాశ్చర్యము. అన్నా! పూజ్యురాలు. చూడండి. [రాముని జూచి] నాకష్టము. ఇప్పటికిని స్పృహ రాలేదు.

[పిదప సీతతో నరుంధతి ప్రవేశించును]

అరు-గీ. త్వరపడుము రమ్ము రమ్ము సీతాకుమారి!
సిగ్గుపడకుమమ్మ! ధైర్యంబు చెందవమ్మ!
చల్లనగు నీదుహృదులహస్తమునఁ దాఁకి
బ్రతుకఁజేయుము వేగ నీ రామభద్రు.

సీ — [తొందరతో స్పృశించి] ఆర్యపుత్రా! [illegible].

రా — [నిట్టూర్పు విడిచి సంతోషముతో] ఆఁ! ఏమిది! (చూచి ఆశ్చర్యసంభ్రమములతో) ఏమీ! నారాణి జానకి. [సిగ్గుతో] ఆహా! పూజ్యురా లయిన యరుంధతి, తల్లులా! ఋశ్యశృంగాదులయిన పెద్ద లందఱును వచ్చియున్నారే!

అరుం — ఆమె రఘువంశదేవతయు సుప్రసన్నురాలయిన భాగీరథీదేవి.

[తెరలో] జగన్నాయక రామభద్రా! "తల్లీ! నీవు మాకుపుత్త్రి వైన యరుంధతివలెనే నీకోడలైన సీతయెడల గౌరవముంచు" మని చిత్రపటదర్శనసమయమున నన్నుద్దేశించి యన్నమాట స్మరింపుము. అట్లుచేసి నాఋణము తీర్చుకొన్నాను.

అరుం — ఆమె మీయత్తగారు వసుంధరాదేవి.

[తెరలో] రామభద్రా! లోకాధీశ్వరా! "భగవతి వసుంధరా! సచ్చరిత్ర యగు నీతనయను జూచుకొ" మ్మని సీతాపరిత్యాగసమయమున నన్నుద్దేశించి పలికిన మాట తలఁచుకొనుము. అట్లు చేసి నీమాట చెల్లించినాను.

రా — తల్లులారా! మహాపరాధ మొనర్చినాను. క్షమించి కరుణింపుఁడు. మీకు నమస్కారములు.

అరుం — ఓ పౌరజానపదులారా! ఇంతగా భగవతులు ప్రశంసించుచుండఁ, దొల్లి భగవంతుఁడగు వైశ్వానరుఁడు నిర్ణయించినపవిత్రత గలదియు, బ్రహ్మాదిదేవతలచేతను